





తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM








గుంటూరు : fb.com/vaartha Digital


Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 214 పేజీలు: 12 వెల: 6.50



# గోదావరి పరవళ్లు...
# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

## గోదావరి జలాలతో రైతు ఇంట ఆనందం




**గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు**

## శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిచే
## పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా
## ఉత్తరాంధ్రకు నీటి విడుదల

**తేదీ:** సెప్టెంబర్ 02, 2026 । **సమయం:** మధ్యాహ్నం 2 గంటలకు
**స్థలం:** పి ఎల్ పురం గ్రామం, పాయకరావు పేట మండలం, అనకాపల్లి జిల్లా



తూర్పుగోదావరి, కాకినాడ, డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు ప్రయోజనం



4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9.23 లక్షల మందికి త్రాగునీరు.. పరిశ్రమల అవసరాలకు తగినంత నీరు



పోలవరం ఎడమ ప్రధాన కాల్వ ప్రాజెక్టు వ్యయం: రూ 4,192.34 కోట్లు (ప్రాజెక్టు వ్యయం + భూసేకరణ & R&R కలిపి)

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**ఉత్తరాంధ్ర సాగు, త్రాగునీటికి, పరిశ్రమలకు నీటి భద్రత**



మంగళవారం మొగల్తూరులో జరిగిన సిఎం చంద్రబాబు బహిరంగసభకు హాజరైన అసంఖ్యాక ప్రజలు

# డెల్టా ఆధునీకరణే ధ్యేయం

>> కోసం వివిధ సంస్కరణలు చేయక తప్పదు అన్నారు. అనేక సంక్షేమ పథకాలకు సంస్కరణలకు గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి అంటిపెట్టుకొని ఉన్న వర్గం వెనుకబడిన వర్గమేనని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తపన తన అనుభవం డబుల్ ఇంజన్ మాదిరిగా రాష్ట్ర పురోభివృద్ధికి ఉపయోగపడుతున్నాయని సీఎం చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు ఇవ్వడం ద్వారా తనకు ఎంతో సంతృప్తి కలిగిందని అలాగే ఉత్తరాంధ్ర కూడా గోదావరి నీరు అనకాపల్లి వరకు వెళ్లిందని రాబోయే రోజుల్లో విశాఖ చేరతాయని చెప్పారు. కృష్ణా గోదావరి నదుల అనుసంధానం వలే భవిష్యత్తులో కావేరీ ని కూడా అనుసంధానం చేసే ఆలోచన ఉందని తద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడమే కాకుండా తాగునీరు సమస్య తీరగలదన్నారు. డెల్టా ఆధునికరణ కూడా చాలా అవసరమని ఇందుకోసం కసరత్తు జరుగుతుందన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన అవసరం ఉందని డబ్బున్న వారందరూ కూడా సుఖంగా స్వీట్స్ తినలేరనే విషయాన్ని మరిచిపోకూడదని నవ్వుతూ అన్నారు. కరెంటు చార్జీలను పెంచలేదని చెప్పారు. ఆక్వాకు విద్యుత్ రాయితీ కింద 1200 కోట్ల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని నరసాపురంలో ఆక్వా యూనివర్సిటీని దేశంలోనే నెంబర్వన్ గా తీర్చిదిద్దుతా మన్నారు. ఉన్నదానితో తృప్తి పడిపోతే అక్కడే ఉండిపోతామని ప్రతినిత్యం ఎదుగుదల కోసం కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఏ ఒక్కరికి భయపడకుండా నిర్భయంగా నిజాయితీగా పనిచేయడానికి డైరెక్ట్ ఎన్నికలను నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు మొదటిసారిగా 34 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని స్థానిక ఎన్నికలు కచ్చితంగా జరిపి తీరుదామని ఫైనాన్స్ కమిషన్ నిధులకు ఇబ్బంది రాకుండా ఎన్నికలు నిర్వహించ వలసిన అవసరం కూడా ఎంతో ఉందన్నారు. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్నామని సమాజంలోని కలుషితాన్ని కూడా కడిగేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నీతివంతమైన పాలన రావాలంటే ఓటుకు డబ్బులు తీసుకోకూడదని సూచించారు. ఇంట్లో చెత్తనే కాదు మనసులో కలుషితాన్ని కూడా కడిగేయాలని తెలిపారు. రాబోయే జనవరి నాటికి రాష్ట్రమంతా సంజీవని పథకం అమలు చేస్తామని మీ చేతిలో ఫోనే మీకు సర్వస్వం కాగలదు అన్నారు. ఏఐ డాక్టర్ ఏఐ వ్యవసాయ అధికారి ఏఐ టీచర్ కూడా రాబోతున్నారని రాష్ట్రంలో కోటి అరవై లక్షలు కుటుంబాలు ఆన్లైన్ ద్వారా మానిటరింగ్ చేసే విధానం చేపడుతున్నాం అన్నారు. మొగల్తూరు కాళీపట్నం భూములు సమస్యను నరసాపురంలో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. టూరిజం అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నరసాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే నాయకర్ పనితీరు విశ్లేషిస్తూ జిల్లా బాగుంది నరసాపురం నియోజకవర్గం బాగోలేదు అన్నారు. ఎమ్మెల్యే నోడల్ అధికారి పనితీరును విశ్లేషిస్తూ మైనస్ లో ఉందన్నారు. మహిళలు వంటింట్లో కూర్చుంటే ఎదగలేరని వారు వివిధ పథకాలను ఉపయోగించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రతి ఇంట్లోనూ పారిశ్రామికవేత్త ఉండాలని సోలార్ రాయితీలను ఉపయోగించుకోవాలని కోరారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మంత్రి నిమ్మల రామానాయుడు గొట్టిపాటి రవికుమార్ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడారు. ఈ సందర్భంగా బిఫోర్ లబ్ధిదారులను పరిచయం చేస్తూ ప్రణాళిక వివరించారు. అనంతరం రోడ్డు మీదుగా నరసాపురం చేరుకున్నారు. స్థానిక పొన్నపల్లి బుద్ధిగ వారి రేవులో నలుగురు మత్స్యకారులతో రచ్చబండ నిర్వహించారు. బోటు మీదుగా నరసాపురం నది తీరంలో గల పుష్కర ఘాట్లను చూసి పలు సూచనలు చేశారు.



మంగళవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు మెమొంటో అందిస్తున్న ఇఒ వెంకటేశులు

# శివయ్యసేవలో తెలంగాణ గవర్నర్

**శ్రీకాళహస్తి,సెప్టెంబరు1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో మంగళవారం తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కుటుంబసభ్యులతో పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ బికె వెంకటేశులు,ఎఇఒ లోకేష్,ఎపిఆర్ఒ రవిలు వేదపండితులతో ఆలయ మర్యాదలతో స్వగతం పలికారు.ఆలయంలో నిర్వహించే మహిమాన్విత పూజలను జరిపించుకున్న వారికి స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆలయ ప్రాధాన్యతను, నిర్మాణం క్రమాన్ని అడిగి తెలుసుకున్నారు.ఆయన అడిగిన ప్రతి సమాచారం ఇఒ బికె వెంకటేశు అందించారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులతో వేద ఆశీర్వచనాలతో పాటు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను ఇఒ బికె వెంకటేశు అందించారు.స్వాగతం పలికిన వారిలో ఆలయ ధర్మకర్తల మండలి ప్రత్యేకాహ్వానితులు వెంకటరమణనాయుడు ఉన్నారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

# భారీ ఊరట

>> దేశంలో ఎక్కడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయొద్దని ఆదేశించింది. 2,873 నేరచరిత్ర కలిగిన వారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు స్వేచ్ఛనిచ్చింది. ఇక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నష్టపరిహారం చెల్లింపులపై విధివిధానాలు రూపొందించాలని సూచించింది. విధివిధానాలు రూపొందించిన మూడు నెలల్లోగా కేంద్రప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహనకు కట్టుబడి ఉండాలనే షరతుకి లోబడి ఆర్టికల్ 142 కింద ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసినట్లు స్పష్టం చేసింది. కేసులు కొట్టేయడంతో సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను రద్దు చేస్తున్నట్లు సిజెపి ప్రకటించింది. సెప్టెంబర్ 5న చేపట్టాల్సిన నిరసన పిలుపును ఉపసంహరించుకున్నట్లు సిజెపి ప్రతినిధులు తెలిపారు.

# 'సర్' గడువు పొడిగింపు

>> చింది. అలాగే షెడ్యూల్‌లో చేసిన మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించింది. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేరులో తప్పులు, చిరునామా మార్పులు లేదా ఇతర వివరాల్లో సమస్యలు ఉంటే నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించి సవరించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# క్లోరోక్విన్ మాత్రలు

>> లకు కూడా మాత్రలను పంపిణీ చేశారు. అయితే సాయంత్రం ఐదు గంటల ప్రాంతం నుంచి మాత్రలు తీసుకున్న విద్యార్థులు అస్వస్థతకు గురవుతుండటంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి విషమంగా ఉన్న ఏడేళ్ల చిన్నారి జమీనా ను తొలుత లక్ష్మీ మ్మపురం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చిన్నారి మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన గొల్లగుప్ప గ్రామానికి చేరుకున్నారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అస్వస్థతకు గురైన విద్యార్థులను ట్రాక్టర్ల సహాయంతో ప్రధాన రహదారి వరకు తరలించి, అక్కడి నుంచి అంబులెన్సుల ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. పాఠశాలలోని మొత్తం 28 మంది విద్యార్థుల్లో ఒకరు మృతి చెందగా, మరో 27 మంది అస్వస్థతకు గురైనట్లు సమాచారం. రాత్రి 9 గంటల సమయంలో ఒక అంబులెన్స్‌లో ఏడుగురు విద్యార్థులను భద్రాచలం తరలించగా, మరో అంబులెన్స్‌లో మరో నలుగురిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 14 మంది చిన్నారులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా మిగిలినవారిని లక్ష్మీ మ్మపురం పిహెచ్‌సిలో వైద్య సేవలు కొనసాగి స్తున్నారు. క్లోరోక్విన్ మాత్రలు తీసుకున్న తర్వాతే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారా? లేక మరేదైనా కారణమా? అన్నది వైద్యుల పరీక్షలు, అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. జరిగిన ఘటనపై తక్షణమే స్పందించిన చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఆ గ్రామానికి హుటాహుటిన అధికారులు అందరిని పంపించి, అస్వస్థకు గురైన వారందరినీ ఆసుపత్రికి తరలించేలా చర్యలుచేపట్టి జరిగిన ఘటనపై ఆరా తీస్తున్నారు.

# రాష్ట్రంలో 2.82 కోట్ల మందికి ఎన్‌సిడి పరీక్షలు

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 2.82 కోట్ల మందికి అసంక్రమిక వ్యాధుల (ఎన్‌సిడి) పరీక్షలు పూర్తయ్యాయి. ఎన్‌సిడి సర్వేల ద్వారా ఇప్పటివరకు 59.29 లక్షల బిపి, 48.15 లక్షల మధుమేహం కేసులను వైద్యశాఖ గుర్తించింది. గిరిజనుల జీవనశైలి కారణంగా అల్లూరి జిల్లాలో అత్యల్ప కేసులు నమోదయ్యాయి. ఈ సర్వే వివరాలను అధికారులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు.

# కర్నూల్లో ఉగ్రవాది అరెస్ట్

>> ఆ మేరకు ఇంటెలిజెన్స్ అధికారులు నూర్ మహమ్మద్‌పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. దీంతో నూర్ మహమ్మద్ తరచుగా ఉగ్రవాద సంస్థలకు చెందిన వ్యక్తులతో ఫోన్లో సంభాషిస్తున్నట్లు గుర్తించారు. ఆ మేరకు అతనికి సంబంధించిన ఇతర వివరాలను గోప్యంగా సేకరించి.. అతనికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ అధికారులు నిర్ధారించుకున్నారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం కర్నూలు నగర శివారులలోని గొందిపర్ల ప్రాంతానికి చేరుకున్న కౌంటర్ ఇంటెలిజెన్స్ బృందం పథకం ప్రకారం నూరు మొహమ్మద్‌ను ఒక్కసారిగా పట్టుకున్నారు. ఎలాంటి అలజడి లేకుండా.. ఎలాంటి ఇబ్బంది లేకుండా అతని అరెస్టు జరిగిపోయింది. అతనిని కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తోంది. కాగా ఇంటిలిజెన్స్ అధికారులు హైదరాబాదులో వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగా కర్నూలు జిల్లా పోలీసు విభాగంలోనూ కౌంటర్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఇతర నిఘా విభాగాలు పనిచేస్తున్నాయి. వారు ఎవరు కూడా సదరు నూర్ మొహమ్మద్ గురించిన సమాచారం తెలుసుకోలేకపోవడం గమనార్హం. ఏది ఏమైనా కర్నూల్‌లో ఉగ్రవాది అరెస్ట్ తీవ్ర కలకలం రేపింది.

# గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

>> చేపడతారు. రూ.10 కోట్లతో.. పుష్కరాలకు వచ్చే భక్తులకు రక్షిత తాగునీటి సదుపాయాలు కల్పించనున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రాజోలు, పి.గన్నవరం, రామచంద్రపురం, రంపచోడవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు తదితర నియోజక వర్గాల్లో గ్రామాల నుంచి పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాల్లో బిటి, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అవసరమైన చోట గ్రామాల్లో అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నారు. గోదావరి పుష్కరాలను కేవలం రాజమహేంద్రవరం వంటి ప్రధాన కేంద్రాలకే పరిమితం చేయకుండా, పవిత్ర నదీ పరివాహక ప్రాంతంలోని ప్రతి గ్రామంలో భక్తులు పుష్కర స్నానాలు, పూజలు, పితృదేవతలకు తర్పణాలు నిర్వహించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నారు.

**ప్రతి పుష్కర ఘాట్‌లో రక్షిత మంచినీటి సదుపాయాలు..**

గ్రామీణ రహదారులతో పాటు ప్రతి పుష్కర ఘాట్‌లో రక్షి త తాగునీటి సరఫరా బాధ్యతలను కూడా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పవన్ కల్యాణ్ రూ.7 కోట్ల వ్యయంతో రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మునికూడలిని మోడల్ పుష్కర పంచాయతీగా అభివృద్ధి చేస్తున్నారు. సప్త ఋషి ఘాట్‌కు సకల హంగులు కల్పించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో సిసి రహదారుల నిర్మాణం, టవర్ లైట్ల ఏర్పాటు, మునికూడలి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, పుష్కర ఘాట్ల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు పూర్తికావస్తున్నాయి.

**ఎపిపిసిబి నిధులతో సమగ్ర అభివృద్ధి..**

కాలుష్య నియంత్రణ మండలి ద్వారా కేటాయించిన రూ.100 కోట్లను ఆయా జిల్లాల నుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో వినియోగించనున్నారు. పోలవరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రతిపాదిత అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వినియోగించి గోదావరి పుష్కరాలను మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా

# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

>> ఎడమ కాలువ నిర్మాణం కోసం ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్ల ఖర్చు చేసింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు ఈ జిల్లాల్లో ఉన్న పంపా, తాండవ, వరాహ, శారద నదుల్ని దాటుకుని, ఏలేరు కాలువ, తూర్పు కనుమలపై సంక్లిష్టమైన నిర్మాణాల మీదుగా ఉత్తరాంధ్రకు చేరుకోనున్నాయి. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణంలో భాగంగా వివిధ నదీ ప్రవాహాల వద్ద సైఫన్లు, అక్విడెక్టులను జలవనరుల శాఖ నిర్మించింది. ఈ నదుల ప్రవాహానికి కొన్ని చోట్ల ఎగువన, ఇంకొన్ని చోట్ల ప్రవాహానికి దిగువ నుంచి పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణం జరిగింది. ఏలేరు నది బెడ్ లెవల్‌కు దిగువన గోదావరి జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంపా నది ఎగువ నుంచి అక్విడక్ట్ నిర్మించి పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలకు ఇంజనీర్లు మార్గం సుగమం చేశారు. పంపా నదిపై అక్విడెక్ట్ నిర్మాణానికి 30 మీటర్ల లోతు వరకు 312 పైల్స్‌తో పునాదుల వేసి అక్విడెక్ట్ ను నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 6 వెంట్లతో 447 మీటర్ల పొడవున అక్విడక్టు నిర్మాణం జరిగింది. ప్రస్తుతం ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తున్న గోదావరి జలాలతో అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. పాయకరావుపేట అక్విడెక్టు నుంచి సీఎం విడుదల చేయనున్న జలాలు అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జలవనరుల శాఖ ప్రణాళిక చేసింది. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరహా, మామిడి గెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న 46,620 ఎకరాల స్థిరీకరణ జరగనుంది.

# 100% అక్షరాస్యత

>> పెరిగి 82.1శాతానికి చేరుకుంది, 2027 సెప్టెంబరు నాటికి నూరుశాతం అక్షరాస్యత సాధన దిశగా పనిచేయాలని మంత్రి కోరారు. 2027 మార్చినాటికి మరో 25 లక్షలమందిని, సెప్టెంబరు నాటికి మిగిలిన 27 లక్షలమంది అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు చెప్పారు. ఇందుకోసం 11 ప్రభుత్వశాఖల సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, పెద్దఎత్తున ప్రజలను చైతన్యవంతం చేయాలని మంత్రి సూచించారు. ఈ యేడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా అన్నారు. గత యేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో సుమారు 10వేల అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్ కింద వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించేలా రూట్ మ్యాప్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ యేడాది తల్లికి వందనం పథకం ద్వారా ఇప్పటికే రూ.1051 కోట్ల మేర ఆర్థిక సాయం అందించగా, మొదటి సంవత్సరం విద్యార్థులకు త్వరలో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ ఐడి ఇంటిగ్రేషన్ చేపట్టేలా చర్యలు తీసుకో వాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

**బడిబయట చిన్నారులను పాఠశాలల్లో చేర్చేలా చర్యలు**

పాఠశాల విద్యపై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ... బడిఈడు పిల్లలందరినీ ట్రాక్ చేసి పాఠశాలల్లో చేర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటికీ బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను పూర్తిస్థాయిలో పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు చొరవచూపాలని స్పష్టంచేశారు. పాఠశాల విద్య డైరక్టర్ తమీమ్ అన్సారియామాట్లాడుతూ ఈ యేడాది 33వేలమంది బడిబయట ఉన్న చిన్నారులను స్కూళ్లలో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను కూడా లీప్ యాప్‌ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపించామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ అటెండెన్స్ గణనీయంగాపెరిగిందని, ప్రస్తుతం ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97శాతంగా ఉన్నట్లుచెప్పారు. విద్యార్థుల హాజరు శాతాన్ని 85.41 శాతంగా ఉందని, దీనిని కూడా పెంచేందుకు కృషిచేయాలని మంత్రి కోరారు.

# ఒకే మాటపై ఉందాం

>> యుద్ధాలు, ఘర్షణలపైనా మోడీ స్పందించారు. యుద్ధభూమిలో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని అన్నారు. అన్ని వివాదాలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. మార్కెట్లను కలపడం, వాణిజ్యాన్ని సులభతరం చేయడం, కొత్త అభివృద్ధి అవకాశాలు కల్పించే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే కనెక్టివిటీ పేరుతో చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా ప్రతి దేశం సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎస్‌సిఒసహకారం వల్ల సాధారణ ప్రజలకు నేరుగా ప్రయోజనం కలగాలని మోడీఅన్నారు. సదస్సు సందర్భంగా ప్రధాని మోడీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షి క సమావేశం నిర్వహించారు. ఇక ఈ సదస్సు సందర్భంగా జరిగిన గ్రూప్ ఫొటోలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడటం, పలకరించడం కనిపించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా అక్కడే ఉన్నప్పటికీ.. మోడీ, షరీఫ్ మధ్య ప్రత్యేకంగా సమావేశం జరగలేదు. కనీసం కంటి చూపునకు కూడా నోచుకోలేకపోవడం విశేషం.

## వారం - వర్జ్యం

02-09-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె
తి.పంచమి ఉ.6.12, షష్ఠి తె.4.25
న.భరణి రా.1.41
వర్జ్యం ఉ.11.53 - మ.1.25
దు.ఉ.11.42-మ.12.32
రాహు. మ.12.00-సా.1.30
శుభ ఉ.5.00-ఉ.6.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి విజయం సాధిస్తారు. పనుల్లో పురోగతి సాధిస్తారు.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయం పొందుతారు. తగాదాలకు దూరంగా వుండండి.

**మిథునం :** ఆర్థిక పరిస్థితిలో ప్రోత్సాహం లభిస్తుంది. బంధువులతో ఏర్పడిన మాట పట్టింపులు పరిష్కరించుకుంటారు.

**కర్కాటకం :** శ్రమ ఫలిస్తుంది. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ, వివాహ యత్నాలు కలిసివచ్చే కాలం.

**సింహం :** పనులలో ఎదురైన ఆటంకాలు కొంత వరకు తొలగుతాయి. ప్రయాణాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు.

**కన్య :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** కుటుంబ సభ్యులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**వృశ్చికం :** విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**ధనుస్సు :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం :** దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం :** ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. సంతానం నుండి శుభవార్తలు.

**మీనం :** ఉద్యోగ, వివాహయత్నాలు, సాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఆర్థిక ప్రగతి సాధిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మత్స్యకారుల భద్రత సంక్షేమమే లక్ష్యం

## పొన్నపల్లిలో మత్స్యకారులతో సిఎం చంద్రబాబు



మంగళవారం పొన్నపల్లి మత్స్యకారులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**నరసాపురం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం పర్యటించారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ చేశారు. వేటకు వెళ్లే ఫ్రెరీ పాయింట్‌కు ముఖ్యమంత్రి మొదట చేరుకున్నారు. పడవల వద్ద కూర్చున్న మత్స్యకారులతో ముచ్చటించారు. తిరుమని స్వామి అనే మత్స్యకారునికి స్వయంగా సిఎం పింఛను సొమ్మును అందజేశారు. వారి కుటుంబాల యోగక్షేమాలు, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పథకాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వేట సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను కూడా సిఎం అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దాదాపు 20 రోజుల పాటు సముద్రంలో కనిపించకుండా పోయిన కోనసీమకు చెందిన మత్స్యకారులను సురక్షి తంగా తిరిగి తీసుకురావడంలో కోస్ట్‌గార్డ్, నేవీ, కేంద్ర మెరైన్ విభాగాల సహకారం తీసుకున్న విషయాన్ని సిఎం చంద్రబాబు వారికి వివరించారు. మత్స్యకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును సిఎం చంద్రబాబు వారిని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల సేవలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సాయం వేట నిషేధ సమయంలో తమను ఆదుకుంటోందని మత్స్యకారులు సిఎంకు తెలిపారు. ఈ సమయంలోనే తమతో పాటు పడవలోకి రావాలని ఓ మత్స్యకారుడు సిఎంను ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు మత్స్యకారులతో కలిసి బోటులో ప్రయాణించారు. సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు రోజువారీ జీవితం ఎలా ఉంటుంది? ఎన్ని గంటలు సముద్రంలో ఉండాలి? ఆ సమయంలో భోజనం ఎలా చేస్తారు? వంటి విషయాలను సిఎం అడిగి తెలుసుకున్నారు. పొన్నపల్లి ఏటిగట్టు సమస్యను పుష్కర రేవుల సమస్యలను స్వామి సిఎం దృష్టికి తెచ్చారు. మత్స్యకారుల కుటుంబాల గురించి కూడా మాట్లాడారు

# మాజీ డి.సిఎం రాజన్నదొర కారును చుట్టిముట్టిన పోలీసులు

## ఉద్రిక్త వాతావరణంలో మాజీ ఉపముఖ్యమంత్రి హౌస్ అరెస్ట్

**సాలూరు, సెప్టెంబరు1 ప్రభాతవార్త :** పార్వతీపురం మన్యం జిల్లా మారికవలస గురుకుల పాఠశాల అక్కడే కొనసాగించాలని గిరిజన విద్యార్థి తల్లిదండ్రులు చేస్తున్న పోరుబాటకు సంఘీభావం తెలిపేందుకు సాలూరు నుండి బయలుదేరిన మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర కారును మంగళవారం ఉదయం పోలీసులు చుట్టు ముట్టారు. అలాగే ముందుకు వెళ్లనివ్వకుండా కారును అడ్డగించడంతో రాజన్నదొర సీరియస్ అయ్యారు. గిరిజన బిడ్డలకు అన్యాయం జరుగుతుందని శాంతి యుతంగా మారికవలస వెళుతున్న నన్ను అడ్డుకోవడం స్వేచ్ఛను అలాగే నిరసన కార్యక్రమం తెలిపే హక్కును హరించడమే అని పోలీసులతో వాదించి కారును ముందుకి కదిలించారు. మరల మినిస్టర్ సంధ్యారాణి ఇంటిముందు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కారును పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే పోలీసులకు ఎంత చెప్పినా వినకపోవడంతో నన్ను అరెస్టు చేయండి లేదంటే ముందుకు పోనీయండి అని రాజన్నదొర ఆగ్రహించారు. ఈ డ్రామా మధ్య ఎట్టకేలకు పోలీసులు మాజీ డిప్యూటీ సిఎంను హౌస్ అరెస్టు చేయడంతో చేసేదిలేక రాజన్నదొర తన నివాసం వద్ద ఉండిపోవాల్సి వచ్చింది.

# 1,36,326 పోలింగ్ స్టేషన్లు

>> హైకోర్టులో తాజాగా వేసిన కేసులు, వైఎస్సార్సీపీ సర్కార్‌లో పంచాయతీలను నగర పంచాయతీలుగా ఉన్నతీకరించడం, పంచాయతీలు సమీప పుర, నగరపాలక సంస్థల్లో విలీనానికి వ్యతిరేకంగా వేసిన కేసులు కొలిక్కి వచ్చాక మరో 62 నగరాలు, పట్టణాల్లోనూ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తారు.స్థానిక సంస్థల ఎన్నికలకు అదనంగా 1.50 లక్షల బ్యాలట్ బాక్సుల కోసం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50వేలకు పైగా బ్యాలట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకే నెలలో స్థానికసంస్థలకు వరుసగా ఎన్నికలు నిర్వహించాలంటే 2 లక్షల వరకు బాక్సులు అవసరమని అంచనా.

# ప్రభుత్వ సేవలన్నీ ఇక ఆన్‌లైన్

## ఇక ఎపివన్ యాప్‌ను తెస్తున్నాం: ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్

**విజయవాడ, సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** పౌరులకు ప్రభుత్వం అందించాల్సిన సేవలన్నీ కూడా ఎలాంటి అంతరాయం లేకుండా ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్యం దిశగా ప్రభుత్వ అధికారులు పనిచేయాలని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజిఎస్) సిఇఒ ప్రఖర్ జైన్ సూచించారు. ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న ఎపిఒన్ మొబైల్ అప్లికేషన్ యాప్ వినియోగంపై అధికారుల్లో అవగాహన కల్పించడం కోసం వివిధ శాఖల అధికారులతో ఆర్టీజిఎస్ రెండు రోజులు వర్క్‌షాపు (కార్యశాల) నిర్వహిస్తోంది. మంగళవారం ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్ ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సేవల కోసం ప్రజలెవ్వరూ కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా అన్ని సేవలను ప్రజలు తాము ఉన్నచోటు నుంచే పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్టీజి శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శనంలో ఆర్టీజిఎస్ తీసుకొచ్చిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజాదరణ పొందిందన్నారు. ఇందులో ఇప్పటికే వెయ్యికిపైగా సేవలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. దీంతో పాటు ఇప్పుడు ప్రజలకు ఒక మొబైల్ అప్లికేషన్ యాప్ కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ యాప్ ద్వారా ప్రజలు తమకు కావాల్సిన అన్ని సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా, అడ్డంకులు లేకుండా సులభంగా పొందేలా దీన్ని తీసుకొచ్చామన్నారు. గతంలో ఒక సర్టిఫికెట్ పొందాలన్నా, ఒక కరెంటు కనెక్షన్ పొందాలన్నా మంజూరు చేసే పద్ధతులు ఎంతో సంక్లిష్టంగా ఉండేవని, ఇప్పుడు ఆ పాత పద్ధతులకు స్వస్తి పలికి టెక్నాలజీ వినియోగంతో ప్రజలకు సేవలను సరళతరం, సులభతరం చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 214 పేజీలు: 12 వెల: 6.50


**రాష్ట్రంలో 2.82 కోట్ల మందికి ఎస్‌సిడి పరీక్షలు** 2లో

**ప్రభుత్వ సేవలన్నీ ఇక ఆన్‌లైన్**

# డెల్టా ఆధునీకరణే ధ్యేయం

**కృష్ణా-గోదావరి తరహాలో భవిష్యత్తులో కావేరి అనుసంధానం**

నరసాపురంలో ఆక్వా వర్సిటీని దేశంలోనే నం.1 చేస్తా

కాళీపట్నం భూముల సమస్య పరిష్కరిస్తా

అభివృద్ధిని చూసి ఓర్వలేని గొడ్డలి పార్టీ

మొగల్తూరు సభలో సిఎం చంద్రబాబు



మంగళవారం మొగల్తూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**నరసాపురం (మొగల్తూరు) సెప్టెంబరు 1, ప్రభాత వార్త :** రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతుంటే గొడ్డలిపార్టీ నాయకులు ఓర్వలేక అడ్డంగా మాట్లాడుతారని చివరకు నిలువునా దొరుకుతారని వారి తీరు కుక్క తోక వంకర మాదిరిగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. డిఎస్సీపై చేసిన విమర్శలను తిప్పికొడుతూ విశాఖలో జరిగిన ఉద్యమంతో బంగాళా ఖాతంలో ఆ పార్టీని కలుపుతామని చివరగా ఉపాధ్యాయులు హెచ్చరించడం జరిగిందన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఇదే రోజున 31 సంవత్సరాల క్రితం ప్రమాణ స్వీకారం చేశానని ఈ నాలుగున్నర దశాబ్దాల ప్రస్థానంలో తనకు ఉన్న సంకల్పం దృఢ సంకల్పంగా మారాలనేదే ఏకైక లక్ష ‌ ్యం పనిచేశానన్నారు. నరసాపురం నియోజకవర్గం మొగల్తూరు వై జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గత రెండు సంవత్సరాల్లోనూ 1,50,000 కోట్లు సంక్షేమ కార్యక్రమానికి ఖర్చు పెట్టడం జరిగిందని ఈనిధులతో మూడు పోలవరం ప్రాజెక్టు నిర్మించవచ్చని అయితే పేదరిక నిర్మూలనకు సంక్షేమ కార్యక్రమాలు కూడా ఎంతో అవసరం అన్నారు. కావాలని ఎవరు పేదరికంలో పుట్టరని ఆర్థిక అసమానతలు పోగొట్టడం >>2

## ఎమ్మెల్యే అన్నిట్లో మైనస్

### ఇది ఆమోదయోగ్యం కాదు: నాయకర్‌కు సిఎం ఝలక్

**నరసాపురం సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** మొగల్తూరు లో జరిగిన ప్రజా వేదిక సభలో చివరగా సిఎం చంద్రబాబు నియోజకవర్గం పనితీరుపై వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే పనితీరు పట్ల పెదవి విరిచారు. ఎమ్మెల్యే గారు మీరు మీ ఆఫీసరు పనితీరు బాగాలేదు జిల్లా బాగుంది మీరు మాత్రం అన్నిటిల్లోనూ మైనస్. 25 పాజిటివ్ 23 మైనస్ అలాగే ఆగస్టులోకూడా 21 పాజిటివ్ 20 మైనస్ దీన్ని మార్చుకోవాలి అని హెచ్చరించారు. మోడల్ ఆఫీసర్ కు కూడా చురకండించారు.నాయకర్ పనితీరు విశ్లేషిస్తున్నప్పుడు సభికులు చప్పట్లు కొట్టడంతో అదిగో వాళ్ళు కూడా చప్పట్లుకొడుతున్నారు అంటూ చమత్కరించారు. నాయకర్ పై చేసిన విమర్శలను ప్రతిపక్ష నేతలు పెద్ద ఎత్తున యూట్యూబ్ సోషల్ మీడియాలో వైరల్ చేశారు. గత వారం రోజుల నుండి ఎండన పడి ఎమ్మెల్యే నాయకర్ చేసిన శ్రమంతా సీఎం చంద్రబాబు విమర్శతో నీరుగారిపోయింది. జిల్లా బాగుంది కానీ నరసాపురం నియోజవర్గం పనితీరే బాగోలేదు అన్నారు.



మంగళవారం బిష్కెక్ షాంఘై సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

## ఒకే మాటపై ఉందాం

### ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలొద్దు

### షాంఘై సదస్సులో ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్

**చర్చలు, దౌత్యం ద్వారానే వివాదాలకు పరిష్కారం**

**బిష్కెక్, సెప్టెంబర్ 1:** ఉగ్రవాదంపై భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసింది. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) 26వ శిఖరాగ్ర సమావేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదంపై గట్టి సందేశం ఇచ్చారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తీవ్రమైన అంశంపై అన్ని దేశాలు ఒకే గొంతుతో మాట్లాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని తమ విధానంలో భాగంగా ఉపయోగించే దేశాలతో పాటు ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు కూడా గట్టి సందేశం ఇవ్వాలని అన్నారు. ఉగ్రవాదానికి నిధులు అందించడం, యువతను ఉగ్రవాదంవైపు మళ్లించడం, నియామకాలు చేపట్టడం, ఉగ్రవాదులకు సురక్షి త స్థావరాలు కల్పించడం వంటి మొత్తం వ్యవస్థను కూల్చివేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తదితర దేశాల అధినేతలు హాజరయ్యారు. అయితే మోడీ తన ప్రసంగంలో పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. అయినప్పటికీ ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని అన్నారు. అలాగే, ప్రపంచంలోని పలు >>2

## ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలు
- నాలుగు నదుల్ని దాటుకుంటూ.. తూర్పు కనుమల్లోకి గోదావరి
- 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్ష మందికి తాగునీరు అందేలా ప్రణాళిక
- వచ్చే యేడాది విశాఖ వరకూ..ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం
- నేడు పాయకరావుపేటలో గోదావరి జలాలకు సిఎం చంద్రబాబు జల హారతి

**విజయవాడ, సెప్టెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదారమ్మ ఉత్తరాంధ్రవైపు పరుగులు పెట్టనుంది. నాలుగు నదుల్ని దాటుకుంటూ తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి ఉత్తరాంధ్ర ప్రాంతానికి కదలి రానుంది. రేపు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చిన గోదావరి జలాలకు హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. కాలువపై నిర్మించిన రెగ్యులేటర్‌ను ఆన్ చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడిచి పెట్టనున్నారు. రేపు మధ్యాహ్నం 2.20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి, పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే జలాలకు జల హారతి ఇచ్చి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకెళ్తామని సంకల్పం చేసిన సీఎం ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ద్వారా మొత్తం నాలుగు జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. 5.23 లక్షల మంది దాహార్తి తీరనుంది. >>2

## 'సర్' గడువు పొడిగింపు

### 10వ తేదీ దాకా అభ్యంతరాల దాఖలుకు అవకాశం

**విజయవాడ,సెప్టెంబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి చేసిన అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో కీలక మార్పులు చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు సెప్టెంబరు 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోయినా ఈ గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఈ తేదీలు మారాయి. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం >>2

## పంచాయతి ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు

### మొత్తం 13,278 గ్రామ పంచాయతీలున్నాయి: ఎస్ఇసి అనిల్ చంద్ర పునేఠా

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు దిశలో రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్వరంగాన్ని సిద్ధం చేసుకుంటుంది, ఈ క్రమంలోనే ఎపిలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్టు ఎస్ఇసి అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. మొత్తం గ్రామపంచాయతీలు 13,278 ఉన్నాయని వివరించారు. అందులో వార్డులు 1,33,128 ఉన్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలలోనూ సమగ్రంగా జిల్లా కలెక్టర్లు పోలింగ్ స్టేషన్లు నిర్ణయించారని చెప్పారు. వీటిపై జిల్లాలో అన్ని స్థాయిల్లో ఆగస్టు 23 నుంచి 26 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తీసుకున్నారని, తుదిగా ఈ సంఖ్య నిర్ణయించినట్టు అనిల్ చంద్ర పునేఠా వివరించారు. మరోవైపు సమగ్ర ఓటర్ల నమోదు ప్రత్యేక జాబితా (సర్) ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ప్రతి పంచాయతీలో ఇంటింటా సర్వే పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బిసి ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కీలక పోలింగ్ కేంద్రాల జాబితా తయారీని పూర్తి చేశారు. గరిష్ఠంగా 650 మంది ఓటర్లను మించకుండా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఈ మేరకు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియను వివిధ జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. 61 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ మొదలైంది. సెప్టెంబర్ 3న తుది జాబితాలు ప్రకటిస్తారు. రిజర్వేషన్లు ప్రకటించేందుకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ, బిసిల వివరాలను వాటిలో నుంచి గుర్తించనున్నారు. అదేవిధంగా డివిజన్లు, వార్డుల పునర్విభజనపై >>2

## గోదావరి తీరానికి అభివృద్ధి హారతి



### మరో రూ.100 కోట్లు మంజూరు చేయించిన డి.సిఎం పవన్ కళ్యాణ్

### గ్రామీణ రహదారులు, తాగు నీటి సదుపాయాల కల్పనకు నిధులు

### రూ.90 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో ఏడు నియోజకవర్గాల్లో రహదారుల అభివృద్ధి

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' అనే థీమ్‌తో గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి పవన్‌కల్యాణ్ ముందుకు తీసుకెళ్తున్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా మూడు జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం పంచాయతీరాజ్, గ్రామీణ తాగు నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖలద్వారా రూ.100 కోట్ల నిధులను విడుదల చేశారు.ఈ మేరకు డి.సిఎం కార్యాలయం నుంచి ఒక సమాచార ప్రకటన విడుదల చేసారు గతంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఎపిపిసిబి) ద్వారా విడుదల చేసిన రూ.100 కోట్లకు ఇవి అదనం.ఈ నిధులతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం ప్రాంతాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో రూ. 90 కోట్లతో 111 పనులను చేపట్టనున్నారు. వీటి ద్వారా సుమారు 141 కిలోమీటర్ల మేర సిసి, బిటి రహదారుల నిర్మాణం >>2



## సిజెపి నిరసనకారులకు భారీ ఊరట

### ఎఫ్ఐఆర్‌లు కొట్టేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు1:** ఢిల్లీలోని జంతర్‌మంతర్‌కు నిరసన తెలిపేందుకు వచ్చిన యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్టికల్ 142 కింద కేసులు రద్దు చేసినట్లు న్యాయస్థానం తెలిపింది. జులై 20 నుంచి 25 మధ్య జరిగిన సిజెపి నిరసనల్లో నమోదైన ఎఫ్ఆర్‌లు అన్నింటిని రద్దు చేసింది. జులై 20నుంచి 25 మధ్య జరిగిన సిజెపి నిరసనపై >>2

## ఇక 100% అక్షరాస్యత

**అక్షరాంధ్రలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం**

**బడి బయట పిల్లలను లోనికి తేవాలి**

**మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ అందించండి**

**పాఠశాల, ఇంటర్ విద్యపై మంత్రి లోకేష్ సమీక్ష**



మంగళవారం ఉండవల్లిలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యపై సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత యేడాది చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ఉద్యమంలా పనిచేసి వచ్చే యేడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అధికారులంతా కలసికట్టుగా కృషిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌మాట్లాడుతూ 2024నాటికి రాష్ట్రంలో అక్షరాస్యత శాతం దేశంలోనే అట్టడుగున కేవలం 72.6శాతం ఉండగా, గత యేడాదిగా కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా 25లక్షల మంది అక్షరాస్యులుగా మారారు, ఒక్క యేడాదిలో ఇంత భారీగా అక్షరాస్యత సాధించడంపై ఎపి కృషిని కేంద్రప్రభుత్వం అభినందించినట్లు అధికారులు తెలుపగా, మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్యపరీక్షాఫలితాల్లో 10శాతం >>2

## వికటించిన క్లోరోక్విన్ మాత్రలు

### ఏడేళ్ల చిన్నారి మృతి, 27 మంది విద్యార్థులకు అస్వస్థత

**మన్యంలో కలకలం**

**చింతూరు, సెప్టెంబర్ 1, ప్రభాత వార్త:** క్లోరోక్విన్ మాత్రలు వికటించి ఒక విద్యార్థిని మృతి చెందగా మరో 27 మంది విద్యార్థులు అశ్వస్థకు గురైన విషాద ఘటన ఇది. పోలవరం జిల్లా ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ పరిధిలోని గొల్లగుప్ప గ్రామంలో మలేరియా నివారణకు సంబంధించిన క్లోరోక్విన్ మాత్రలు తీసుకున్న అనంతరం విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం సాయంత్రం మన్యంలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఏడేళ్ల చిన్నారి జమీనా మృతి చెందగా, మరో 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం.గత వారం రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఒకరు మలేరియతో మృతి చెందారు. దాంతో అప్రమత్తం అయిన వైద్య ఆరోగ్య శాఖ గొల్లగుప్ప గ్రామంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు.గ్రామస్తులతో పాటు పాఠశాల విద్యార్థులకు కూడా మలేరియా నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించడంతో పాటు విద్యార్థులకు మలేరియా నివారణ మాత్రలు మింగించారు. మొత్తం 75మంది మాత్రలు తీసుకున్నారు. గ్రామస్తు >>2

## కర్నూల్లో ఉగ్రవాది అరెస్ట్

### స్లీపర్ సెల్‌గా అనుమానించిన కౌంటర్ ఇంటెలిజెన్స్!

**కర్నూలు పోలీసులకు సమాచారం శూన్యం**

**కర్నూలు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** కర్నూలు నగర శివారులలో ఒక ఉగ్రవాదిని కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం అరెస్టు చేసింది. ఉగ్రవాద సంస్థకు చెందిన స్లీపర్ సెల్స్ అనే అనుమానంతో అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. అయితే కొన్ని నెలలుగా సదరు వ్యక్తి కర్నూలు శివారులలో నివాసం ఉంటున్నప్పటికీ.. స్థానిక పోలీసులకు ఎలాంటి అనుమానం రాకపోవడం గమనార్హం. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాదులోని జమ్మిగూడా ప్రాంతానికి చెందిన నూర్ మొహమ్మద్ కొన్ని నెలలుగా కర్నూలు శివారులలోని గొందిపర్లలో ఒక ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ విభాగంలో పనికికుదిరాడు. అప్పటినుంచి కర్నూలు శివార్లలోని ఈ.తాండ్ర పాడులో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో కర్నూలు నగరానికి చెందిన చాలా మందితో సంబంధాలు నేరిపినట్లు అనుమానాలు ఉన్నాయి. కాగా హైదరాబాద్ కేంద్రంగా కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం ఉగ్రవాద సంస్థలపై నిఘా పెట్టడం తెలిసిందే. అదే క్రమంలో వారి నిఘాలో నూర్ మహమ్మద్ వివరాలు తెలిశాయి. >>2

2-9pg4:2-9pg4.qxd 01/Sep/26 10:58 PM Page 1



వార్త


రాజనీతిజ్ఞుడు తాను ప్రభుత్వానికి చెందిన వాడినని అనుకుంటే రాజకీయవేత్త ప్రభుత్వమే తనది అని అనుకుంటాడు.

న- డబ్ల్యు.ఆర్. ఆల్జర్

# పురోగమనమా! తిరోగమనమా?

విషయ పరిజ్ఞానం, సమగ్ర అవగాహన ఉన్నవారెవరైనా ముందు చదువులకు అర్హులేనన్న భావనలో ప్రభుత్వాలు విద్యావిధానాన్ని గందరగోళపరుస్తున్నాయి. 'నో డిటెన్షన్' విధానం గతంలోనే ఉందనుకున్నా, దాని నుంచి సత్ఫలితాలు లేవనే ఆలోచన మేధావులలో ఎప్పుడో ఏర్పడింది. విద్యావ్యవస్థను ఎప్పటికప్పుడు సంస్కరించాలని ప్రభుత్వాలు తలపోయడం, అమలులో డొల్లతనం వలన చతికిలపడిపోవడం చూస్తూనే ఉన్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మిశ్రమ వ్యవస్థగా ఉన్న విద్యా వ్యవస్థలో ఎన్ని మార్పులు చేసినా వాటిలో చిత్తశుద్ధి లోపం బయటపడుతూనే ఉంది. మసిపూసి మారేడు కాయగా మారిన చందాన విద్యాసంస్కరణలు వెక్కిరిస్తున్నాయి. బీహార్ ప్రభుత్వం తమ రాష్ట్ర విద్యారంగ చరిత్ర నుంచి 'నో ఫెయిల్' అనే పదాన్నే కనపడకూడదని శాసిస్తోంది. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం మూల్యాంకనంలో ఎక్కువో తక్కువో మార్కులు రావడం, వారిని ర్యాంకులతో కీర్తించడం అత్తెసరు మార్కులు సాధించిన వారికి మళ్లీ పరీక్షలు, వాళ్ల ఆత్మహత్యల కథనాలకు వగచడం ఇవన్నీ వద్దనుకునితాజాగా 'నో ఫెయిల్' విధానాన్ని ప్రవేశపెట్టచూస్తోంది. ఇలాంటి విధానాల వలన కనీస విద్యాప్రమాణాలు లేని వారు సైతం అవలీలగా పట్టభద్రులైపోయినా ఆశ్చర్యపడనక్కర్లేదు. కనీస అభ్యసన ప్రమాణాలు లేవనో అలాంటి విద్యార్థికి అదనపు బోధన, మూల్యాంకన విశ్లేషణలు గుర్తించాలంటే తదుపరి తరగతికి వెళ్లడం కష్టమన్న భావన ప్రతి విద్యార్థికి కలిగినప్పుడే వారిలో విద్యా జిజ్ఞాస పెరుగుతుంది. చదివినా చదవకపోయినా చిట్టచివరికి ఏదో ఒక డిగ్రీ సర్టిఫికెట్ చేతికొస్తుందిలే. అదే ఉద్యోగానికి అర్హత అవుతుంది. 'చాల్లే ఇది చాల్లే' అనే ధోరణికి విద్యార్థి అలవాటు పడ్డాడో ఇక విద్యావ్యవస్థ సర్వనాశనమవడం తథ్యం. బీహార్ రాష్ట్రమంటేనేబీమార్ 'రాష్ట్రంగా పిలువబడుతుంటుంది. అలాంటి రాష్ట్రంలో ఉత్తీర్ణతతో సంబంధం లేని చదువులు అక్కడి విద్యార్థులకు బతుకు తెరువుకు కష్టమయ్యే పరిస్థితులను తెచ్చిపడతాయి. ఒక తరగతిలో నేర్చుకోదగిన విషయాలు, ప్రమోట్ చేసేస్తే తర్వాతి తరగతిలో చదువుకుంటాడులే అని వదిలేస్తే కొత్త పాఠాలు ఆ విద్యార్థిని బుద్దాయిని చేస్తాయనడంలో సందేహం లేదు. విద్యావిధానంలో 'నోఫెయిల్' భావనను 2009లో అప్పటి కేంద్ర ప్రభుత్వమే తెచ్చింది అదీ విద్యాహక్కు చట్టం ద్వారా. విద్య నేర్చుకునేందుకు చట్టం అవసరమవుతుందేమోకానీ ఎలాగైనా పట్టభద్రులైపోవాలనే యోచన మంచిది కాదు. ఆ చట్ట ప్రకారం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఏ విద్యార్థినీ ఫెయిల్ చేయకూడదని కేంద్ర ప్రభుత్వం హుకుం జారీ చేసింది. ఇక పాఠాలు వినేవారెవరుంటారు. అందునా తమ విలువైన కాలాన్ని 'వాట్సాప్ రీల్స్' చూడటానికే గడిపే వారిని తరగతి గదుల్లో బంధించగల పరిస్థితి కానరాదు. తరగతి నుంచి పైతరగతికి మారినప్పుడల్లా అభ్యసన లోటు పేరుకుపోతే ఆ విద్యార్థి ఎందుకూ పనికి రాకుండా పోతాడు. విద్యార్థులను ఫెయిల్ చేయకపోవడంలో ప్రభుత్వ మూల్యాంకనం ఖర్చులు తగ్గవచ్చు. పరీక్షల్లో లీకుల్లేకుండా నిర్వహించలేని ప్రభుత్వాలకు అవే విజయగాథలు కూడాకావచ్చు. కానీ విద్యార్థులు నిరక్షరాస్యులుగా తయారౌతారేమోనన్న సోయి ప్రభుత్వాలకు లేకపోవడం ఆందోళనకరమైన విషయం. 'నో ఫెయిల్' అనగానే అదేదో మానవీయతకు మరో రూపమనుకుంటూ జబ్బలు చరుచుకునే విధానంగా భావించలేం. ఆ రకమైన భావనకు పురుడుపోసి విద్యార్థుల భవితను అంధకారంలో ముంచడం ఏమాత్రం సరికాదు. ఉచిత ప్రమోషన్ హక్కు కల్పించాల్సి వస్తే వారి అభ్యసన ప్రమాణాలు, నిరంతర అంతర్గత మూల్యాకనం వంటి అంశాల్లో ఎలా వ్యవహరించాలో కూడా అధ్యయనం చేయడం అవసరం. గతంలో ప్రవేశపెట్టిన 'నో డిటెన్షన్ పాలసీ'లో కూడా ఎక్కడో ఓ తరగతి వద్ద డిటెన్షన్ అయ్యే పరిస్థితి ఉండేది. అలాంటి విద్యార్థులను దొడ్డిదారిన మరో పరీక్ష ద్వారా ప్రమోషన్ చూపించే వ్యవస్థ కూడా ఉండేది. ఇలాంటి విద్యా విధానాల వల్లనే నిరంతరం విద్యార్థి చదువుల మీద శ్రద్ధ పెట్టే ప్రైవేట్ విద్యాసంస్థలు అవసరమొచ్చాయి. ఇప్పుడు అలాంటి ఏర్పాట్లున్న విద్యాసంస్థల్లో సంపన్నులు అత్యధిక ఫీజులు చెల్లించి తమ పిల్లలను చదివిస్తున్నారు. 2015లోనే 'నో డిటెన్షన్' విధానం పట్ల 28 రాష్ట్రాలకు 23రాష్ట్రాలు వ్యతిరేకత వ్యక్తం చేశాయి. పిల్లల్లో నేర్చుకోవడం తగ్గిపోతుందని విశ్లేషించగానే 2019లో విద్యాహక్కు చట్టాన్ని సవరించి 5,8 తరగతుల్లో పరీక్షలు నిర్వహించి సరైన చదువులేకపోతే 'ఫెయిల్' విధానాన్ని పునఃస్వాగతం పలికింది. ఆ తర్వాత కొన్ని రోజులకే తమిళనాడు, త్రిపుర, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, అసోం, బీహార్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ వంటి 18 రాష్ట్రాలు 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేశాయి. గతంలో 'నో ఫెయిల్' విధానానికి వ్యతి రేకంగా నిర్ణయం తీసుకున్న 'బీహార్' ఇప్పుడు మళ్లీ అదే విధానం కోసం పట్టుబడుతోంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిబిఎస్ఇ విద్యావిధానం లో తమ మార్క్ షీట్‌లలో ఫెయిల్, కంపార్టుమెంటల్ అనే పదాలకు బదులుగా 'ఎసెన్షియల్ రిపీట్' అని సరిపెట్టుకుంది. అంటేమళ్లీ పరీక్షలు రాయాల్సిందేనన్న మాట. గత 15 ఏళ్లుగా విద్యార్థులఉత్తీర్ణత, ఫెయిల్ అనే విధానంపై ఊగిసలాటలో ఉన్న ప్రభుత్వాలు వారి వారి స్థాయిలో పునరాలోచనలో పడ్డాయి. అది తిరో గమనమా? పురోగమనమా? ఎవరూ నిర్దేశించలేదు. కింద తరగతుల్లో 'ఫెయిల్' అనే ప్రస్తావన లేకుండా పై తరగతులకు స్వేచ్ఛగా వదిలిపెడితే పదో తరగతుల్లో ఉత్తీర్ణతా శాతం తగ్గుతుందన్న విషయం విద్యావేత్తలకు తెలియనిది కాదు.

వస్త్రధారణ మనసును తెలిపేదిగా ఉండాలి. అంటే వస్త్రాలను బట్టి మనసు శుభ్రతను అర్థం చేసుకోగలగాలి.



మహాత్మాగాంధీ

మతం మానవుని కోసమే కాని, మానవుడు మతం కోసం కాదు.




అంబేద్కర్

# సామాజిక భద్రతకు స్వర్ణ యుగమా?

**ఉద్యోగ భద్రత, వృద్ధాప్య భరోసా, సామాజిక రక్షణ ఈ మూడు అంశాలు బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరంగా ఉంటుంది. వేతన పరిమితి పెంపు, కనీస పెన్షన్ పెంపుపై కేంద్రం తీసుకోబోయే నిర్ణయాలు కోట్లాది కుటుంబాల జీవితాలను ప్రభావితం చేయగలవు. అందుకే ఈఅంశాన్ని కేవలం పరిపాలనా నిర్ణయంగా కాకుండా సామాజిక న్యాయానికి సంబంధించిన కీలక సంస్కరణగా చూడాలి. ఉద్యోగుల ఆశలు నిజమయ్యేలా త్వరితగతిన తుదినిర్ణయాలు తీసుకుని అమలు చేస్తే, అది కేవలం వేతనజీవులకు మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక బలమైన పెట్టుబడిగా నిలుస్తుంది. ఉద్యోగుల శ్రమకు గౌరవం ఇవ్వాలంటేవారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ఉత్తమ మార్గమని ప్రభుత్వం గుర్తిస్తే, ఈ నిర్ణయాలు భారత కార్మిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతాయి.**

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థికాభివృద్ధికి అసలైన చోదకశక్తి ఎవరు అంటే, సందేహం లేకుండా వేతన జీవులు, కార్మికులే అని చెప్పాలి. పరిశ్రమలు, సేవారంగం, నిర్మాణ రంగం, సమాచార సాంకేతిక రంగం ఏ రంగాన్ని చూసినా వారి కృషే దేశ ప్రగతికి పునాది. అయితే, వారి శ్రమకు తగిన సామాజిక భద్రత కల్పించడంలో చాలాకాలంగా కొన్ని లోపాలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భరోసా కల్పించే ఉద్యోగుల భవిష్య నిధి , ఉద్యోగుల పెన్షన్ పథకంలకు సంబంధించిన వేతన పరిమితి, కనీస పింఛన్ అంశాలు ఎన్నో సంవత్సరాలుగా చర్చనీయాంశాలుగా మారాయి. ఇలాంటి నేపథ్యంలో ఉద్యోగుల గరిష్ట వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచే ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ సానుకూలంగా స్పందించినట్లు వెలువడుతున్న సమాచారం లక్షలాది ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. అదే సమయంలోప్రస్తుతం నెలకు రూ.1,000గా ఉన్న కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు వస్తున్న సంకేతాలు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ఈరెండు నిర్ణయాలు అమలులోకి వస్తే ప్రైవేట్ రంగ ఉద్యోగుల సామాజిక భద్రతలో ఒక కీలక మలుపు తిరిగినట్లే అవుతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న రూ.15 వేల వేతన పరిమితి దాదాపు దశాబ్దం కిందటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయించబడింది. కానీ ఈ కాలంలో ద్రవ్యోల్బణం పెరిగింది. జీవన వ్యయం గణనీయంగా అధికమైంది. ఉద్యోగుల వేతనాల్లో కూడా మార్పులు వచ్చాయి. అలాంటి పరిస్థితుల్లో పాత పరిమితిని కొనసాగించడం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదనే అభిప్రాయం చాలా కాలంగా వ్యక్తమవుతోంది. అందుకే వేతన పరిమితిని రూ.25 వేలకు పెంచడం కాలానుగుణమైన సంస్కరణగా పరిగణించవచ్చు. ఈ మార్పు అమలైతే కొత్తగా మరింత మంది ఉద్యోగులు ఉద్యోగుల భవిష్య నిధి, ఉద్యోగుల పెన్షన్ పథకాల పరిధిలోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఉద్యోగుల పొదుపు పెరగడమే కాకుండా, భవిష్యత్తులో వారికి లభించే పెన్షన్ కూడా మెరుగయ్యే అవకాశం ఉంటుంది. ఉద్యోగ భద్రతతో పాటు ఆర్థిక భరోసాకూడా బలపడుతుంది. దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇక కనీస పెన్షన్ పెంపు అంశం మరింత కీలకమైనది. ప్రస్తుతం అమల్లో ఉన్న రూ.1,000 నెలవారీ పెన్షన్ నేటి ధరల పరిస్థితుల్లో సరిపోదన్న అభిప్రాయం చాలా కాలంగా వినిపిస్తోంది. మందులు, వైద్య ఖర్చులు, అద్దెలు, నిత్యావసర వస్తువుల




ధరలు పెరిగిన ఈ రోజుల్లో వెయ్యి రూపాయలతో గౌరవప్రదమైన జీవితం గడపడం అసాధ్యమే. అందుకే కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని పెన్షనర్ల సంఘాలు ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నాయి. ఒకవేళ ఈ ప్రతిపాదన అమలైతే కోట్లాది పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అది ఆర్థికంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా గొప్ప ఊరటనిస్తుంది. ఉద్యోగ జీవితమంతా కష్టపడి దేశ ఆర్థిక వ్యవస్థకు సేవలందించిన వారికి వృద్ధాప్యంలో కనీస జీవన భద్రత కల్పించడం సంక్షేమ రాజ్య బాధ్యతగా భావించాలి. పెన్షన్ అనేది దానం కాదు, అది ఉద్యోగి తన సేవా కాలంలో సంపాదించుకున్న హక్కు అనే భావనకు మరింత బలం చేకూరుతుంది. అయితే ఈ సంస్కరణలు అమలవ్వాలంటే కేవలం ప్రకటనలతో సరి పోదు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, యజమానులు, కార్మిక సంఘాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి సమగ్ర కార్యాచరణను రూపొందించాలి. యజమానులపై అదనపు భారం పడకుండా, అదే సమయంలో ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతినకుండా సమతుల్య విధానం అవసరం. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఆర్థిక సామర్థ్యాన్ని కూడా ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం అసంఘటిత రంగ కార్మికులది. దేశంలోని భారీ సంఖ్యలో కార్మికులు ఇప్పటికీ సామాజిక భద్రత పరిధిలోకి పూర్తిగా రాలేదు. కాబట్టి వేతన పరిమితి పెంపు, కనీస పెన్షన్ పెంపుతో పాటు అసంఘటిత రంగ కార్మికులను కూడా సామాజిక భద్రతా వ్యవస్థలోకి తీసుకురావడానికి మరింత సమర్థమైన విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే ఈ సంస్కరణల అసలైన లక్ష్యం నెరవేరుతుంది. దేశం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఉద్యోగుల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడాలి. స్థూల దేశీయోత్పత్తి పెరగడం మాత్రమే అభివృద్ధి కాదు, ఆ అభి వృద్ధి ఫలాలు ఉద్యోగులకు, పెన్షనర్లకు చేరినప్పుడే అదిసమ గ్రాభివృద్ధిగా నిలుస్తుంది. ఉద్యోగ భద్రత, వృద్ధాప్యభరోసా, సామాజిక రక్షణ ఈ మూడు అంశాలు బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరంగా ఉంటుంది. వేతన పరిమితి పెంపు, కనీస పెన్షన్ పెంపుపై కేంద్రం తీసుకోబోయే నిర్ణ యాలు కోట్లాది కుటుంబాల జీవితాలను ప్రభావితం చేయ గలవు. అందుకే ఈఅంశాన్ని కేవలం పరిపాలనా నిర్ణయంగా కాకుండా సామాజిక న్యాయానికి సంబంధించిన కీలకసంస్క రణగా చూడాలి. ఉద్యోగుల ఆశలు నిజమయ్యేలా త్వరిత గతిన తుదినిర్ణయాలు తీసుకుని అమలు చేస్తే, అది కేవలం వేతనజీవులకు మాత్రమే కాదు, దేశ ఆర్థికవ్యవస్థకు కూడా ఒక బలమైన పెట్టుబడిగా నిలుస్తుంది. ఉద్యోగుల శ్రమకు గౌరవం ఇవ్వాలంటేవారి భవిష్యత్తుకు భరోసాకల్పిం చడమే ఉత్తమ మార్గమని ప్రభుత్వంగుర్తిస్తే, ఈ నిర్ణయాలు భారత

# చక్కెర తీపి, సామాన్యుడికి చేదు ఎందుకైంది?

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

ఉదయం నిద్రలేచిన వెంటనే ఒక కప్పు టీతో రోజును ప్రారంభించే ప్రతి భారతీయుడి జీవితంలో చక్కెరకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇంట్లో అతిథి వస్తే టీ, పండుగ అయితే పాయసం, పుట్టినరోజు అయితే కేక్, శుభవార్త అయితే స్వీట్లు ప్రతి ఆనందంలో చక్కెరే తీపిని నింపుతుంది. అలాంటి చక్కెర ఇప్పుడు సామాన్యుడి వంటింట్లో విలాస వస్తువులా మారుతోంది. ఒకప్పుడు నిత్యావసర సరుకుల జాబితాలో నిశ్శబ్దంగా ఉండే చక్కెర, నేడు దేశ ఆర్థిక విధానాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న అతిపెద్ద చర్చనీయాంశంగా నిలిచింది. కిలో రూ.45 వద్ద లభించిన చక్కెర ధర ఒక్కసారిగా రూ.65 దాటడం వెనుక కేవలం మార్కెట్‌లో సహజ కొరత మాత్రమే కాదు, ప్రభుత్వ ఇథనాల్ విధానం, మిల్లు యజమానుల వ్యాపార ప్రయోజనాలు, వాతావరణ అనిశ్చితి, ఆహార భద్రత పట్ల నిర్లక్ష్యం కలిసి ఈ సంక్షోభాన్ని సృష్టించాయి. దేశంలో చక్కెర కొరత ఏర్పడటానికి ప్రధాన కారణం చెరకు రసం, బిహెవీ మొలాసెస్‌ను భారీగా ఇథనాల్ తయారీకి మళ్లించడమే. చమురు దిగుమతులను తగ్గించి పెట్రోల్‌లో ఇథనాల్ కల పాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్లినప్పటికీ, దేశీయ ఆహార అవసరాలను సరిగా అంచనా వేయడంలో విఫల మైంది. దాదాపు 35 నుంచి 45 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తికి సమానమైన చెరకు రసం ఇథనాల్ కర్మాగారా లకు మళ్లిపోవడంతో మార్కెట్‌లో చక్కెర నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇంకోవైపు చక్కెర అమ్మకాలకంటే ఇథనాల్ సరఫరా ద్వారా చమురు కంపెనీల నుంచి వేగంగా, స్థిరంగా నగదు రావడం మిల్లు యజమానులకు మరింత లాభదాయకంగా మారింది. ఫలితంగా వారు చక్కెర ఉత్పత్తి కంటే ఇథనాల్ తయారీకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆహార భద్రత కంటే వ్యాపార లాభాలకే ప్రాధాన్యం దక్కిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయాలపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రధాన చెరకు ఉత్పత్తి రాష్ట్రాల్లో వాతావరణ మార్పుల కారణంగా దిగుబడులు తగ్గే అవకాశం



ఉందని ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ, ఇథనాల్ మళ్లింపుపై సమయానికి నియంత్రణలు విధించలేదు. ధరలు సామాన్యుడి అందుబాటును దాటిన తర్వాత మాత్రమే స్టాక్ పరిమితులు, దిగుమతి సుంకాల సడలింపు వంటి చర్యలు తీసుకోవడం వల్ల మధ్యవర్తులు, నిల్వ దారులు కోట్ల రూపాయలు ఆర్జించగా, వినియోగదారుడు మాత్రం భారాన్ని మోయాల్సి వచ్చింది. మరోవైపు చెరకు రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎరు వులు, డీజిల్, కూలీల ఖర్చులు విపరీతంగా పెరగడం, ఎల్‌నినో ప్రభావంతో దిగుబడి, నాణ్యత తగ్గిపోవడం రైతును తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. ప్రభుత్వం ప్రకటిం చిన ప్రోత్సాహకాల అసలు లాభం మిల్లు యజమాను లకు, వ్యాపార వర్గాలకే ఎక్కువగా చేరింది. పంట పండించిన రైతుకు మాత్రం తగిన మద్దతు ధర, స్థిరమైన ఆదాయం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రతి ఉదయం ఒక కప్పు టీతో మొదలయ్యే సామాన్యుడి జీవి తంపై ఇలాంటి నిర్ణయాలు నేరుగా ప్రభావం చూపుతు న్నాయి. చక్కెర ధర పెరగడం అంటే కేవలం టీ తీపి తగ్గిపోవడం కాదు, ప్రతి ఇంటి నెలవారీ ఖర్చు పెరగడం, చిన్న స్వీట్లు కూడా ఆలోచించి కొనాల్సిన పరిస్థితి రావ డం. దేశ ఇంధన భద్రత పేరుతో ప్రజల ఆహార భద్రతను పణంగా పెట్టడం ఏ ప్రభుత్వానికీ సమర్థించదగిన ఆర్థిక విధానం కాదు. ఒక వైపు పెట్రోల్‌లో ఇథనాల్ కలిపి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేస్తున్నామని చెప్పుకుంటూ, మరోవైపు అదే నిర్ణయంతో కోట్లాది కుటుంబాల వం టింటిపై అదనపు భారం మోపడం అభివృద్ధి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం దూర దృష్టితో వ్యవహరించాలి. దేశీయ చక్కెర నిల్వలు తగ్గే ప్రమాదం కనిపించిన ప్రతిసారీ నేరుగా చెరకు రసంనుంచి ఇథనాల్ తయారీపై కఠిన నియంత్రణలు అమలుచేయాలి. పండుగల సీజన్, అధిక డిమాండ్ ఉన్న కాలాల్లో ఇథనాల్ మళ్లింపును తగ్గించి, నిల్వలు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్ర మే పెంచే సౌకర్యవంతమైన విధానాన్ని రూపొందించాలి. రైతుకు గిట్టుబాటు ధర, మిల్లులకు స్థిరమైన వ్యాపారం, వినియోగదారుడికి అందుబాటు ధర ఈ మూడు లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే నిజమైన విజయమని చెప్పుకోవచ్చు. ఎందుకంటే దేశ అభివృద్ధి అంటే పెట్రోల్ ట్యాంక్ నిండడమే కాదు, ప్రతి ఇంట్లో ఉదయం టీ కప్పు లో తీపి తగ్గకుండా ఉండటం కూడా అంతే ముఖ్యం. సామాన్యుడి కప్పులోని తీపిని

# నదులలో నీరు ఉన్నా సాగునీరు ఇవ్వలేరా?

బొల్లిముంత సాంబశివరావు

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నదుల్లో నీటి నిల్వలు పడిపోయాయని, అందువల్ల కృష్ణాడెల్టాకు సాగునీరు ఇవ్వలేమని జూలై24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రివర్గ సమావేశం ప్రకటించింది. మంత్రివర్గ నిర్ణయాన్ని సమాచార మంత్రి కె.పార్థసారథి తెలియచేశారు. వరిపంట వేయవద్దని, వరి పంట వేస్తే తర్వాత నీరులేక నష్టపోయేది మీరేనని రైతులకు హెచ్చరిక జారీచేశారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాభావంతోపాటు కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ఖరీఫ్‌కు చాలా ముందే ప్రకటించారు. ఆవిధంగా కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. కాని చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోలేదు. నదుల్లో నీరునిల్వకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. అలాంటి చర్యలు తీసుకోకుండా సాగునీటి విడుదల గురించి ఆర్భాటపు ప్రకటనలు చేశారు. జూన్ 1 నుంచే కాల్వలకు నీరువిడుదల చేస్తామని మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామనాయుడు ప్రకటించారు. కృష్ణాడెల్టాకి జూలై 1 నుంచి, నాగార్జునసాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కేసీ కెనాల్కి వంశధార ఆయకట్టుకు జూలై 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని, రైతులు సేద్యానికి సిద్ధం కావాలని చెప్పారు. కృష్ణా డెల్టా ఆయకట్టుకి 150 టిఎంసిలు అవసరమని, బ్యారేజిలో 461 టిఎంసిల నీరు అందుబాటులో ఉందని కూటమి ప్రభుత్వం ప్రకటించి జూలై1న ప్రకాశం బ్యారేజీ నుంచి ఆర్భాటంగా నీరు విడుదల చేసింది. మంత్రుల ప్రకటనతో రైతాంగం ఖరీఫ్ సేద్యానికి సమాయత్తం అవుతూ ఉండగా రాష్ట్రప్రభుత్వం కృష్ణా డెల్టాకి సాగునీరు విడుదల చేయలేమని జూలై 24న ప్రకటించింది. మంత్రివర్గ ప్రకటన తర్వాత ఇరిగేషన్ శాఖ సమావేశం జరిగింది. ఆ సమావేశం అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఇంజినీరు ఎల్‌నినో ప్రభావం వల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గాయని చెప్పారు. రాష్ట్రంలో 51 శాతం, కృష్ణా డెల్టాలో49శాతం లోటు వర్షపాతం ఉందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తాగునీటికే ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. పులిచింతల నీటిని కూడా తాగునీటి అవసరాలకే భద్రపర్చినట్లు వెల్లడించారు. గోదావరి ప్రవాహం తగ్గడంతో పట్టిసీమ ఎత్తిపోతల పంపింగ్‌పై ప్రభావం పడిందని అన్నారు. సీలేరు నీటి లభ్యత కూడా తగ్గిందని చెప్పారు. అందువల్ల కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం లేదని చావు కబురు చల్లగా చెప్పారు. ప్రకాశం బ్యారేజి నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతాంగానికి హెచ్చరిక జారీచేశారు. కుడికాల్వ పరిధిలో రైతులు వరిసాగు చేయవద్దని చెప్పారు. ఆరుతడి పంటలు సాగుచేయాలని పేర్కొన్నారు. జూన్, జూలై నెలల మధ్య సాగు నీరు విడుదల విషయంలో కూటమి ప్రభుత్వ వైఖరిలో మార్పువచ్చింది. జూన్ నెలలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు విడుదల తేదీలను కూటమి మంత్రులు ప్రకటించారు. సాగుకి రైతులు సిద్ధం కావాలని చెప్పారు. మంత్రుల ప్రకటనతో అప్పులు చేసి సేద్యానికి కావాల్సిన వాటిని సమకూర్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఎకరాకు 10 వేలకు పైగా రైతులు సేద్యానికి ఖర్చుచేశారు.



ఇలాంటి పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల ఇప్పుడు సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెప్పడం వల్ల రైతాంగం తీవ్రమైన మనోవేదనకు గురౌతున్నారు. జూలై1లో 461 టిఎంసిల నిల్వఉన్న నీరు జూలై23 నాటికి ఏమైంది. సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం ఎలా చెప్పగలుగుతున్నది. ఎల్‌నినో ప్రభావం ముందుగానే కూటమి ప్రభుత్వానికి తెలుసుగా, తెలిసే సాగునీరు ప్రాంతాల వారిగా విడుదల చేస్తామన్నది గదా! ఇప్పుడు సాగునీరు విడుదల సాధ్యం కాదని చెప్పడం రైతులను మోసం చేయడం కాదా! సేద్యంపైనే చిన్న, సన్నకారు రైతు కుటుంబాల ఆధారపడి ఉన్న విషయం కూటమి ప్రభుత్వానికి తెలియదా, ఆ కుటుంబాల పరిస్థితి ఏమికావాలి. సాగునీరు విడుదల గురించి ప్రభుత్వం చెప్పే మాటలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. జలవనరుల వ్యవస్థ తాజా గణాంకాల ప్రకారం ప్రకాశం బ్యారేజి నీటినిల్వ 2.978 టిఎంసిలు కాగా, పూర్తి నీటిమట్టం 3.071 టిఎంసిలు. అంటే పూర్తి నీటి మట్టానికి అతితక్కువ మాత్రమే. 96.97 నీటి నిల్వతో సురక్షితంగా ఉన్నందువల్ల సాగునీటి సర ఫరాకు ఎటువంటి ఆటంకం లేదని నిపుణులు చెబుతున్నా రు. డెడ్ స్టోరేజికి చేరాలంటే 2 టిఎంసిల కంటే తక్కువ ఉండాలి. బ్యారేజిలో నీరులేనప్పుడు సాగునీరు ఇవ్వాల్సి వస్తే, నాగార్జున సాగర్లేదా పులిచింతల నుంచి నీరు విడు దల చేయాలి. పులిచింతలలో ప్రస్తుతం 29.039 టిఎంసి లనీరు ఉంది. సాగు, తాగునీటి అవసరాలకు నీటిని దిగువకు విడుదల చేయవచ్చని కూడా నిపుణులు అంటున్నా రు. మరి కూటమి ప్రభుత్వం సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదు. గతంలో బ్యారేజిలో ఇంతకన్నాతక్కువనీరు ఉన్నప్పుడే సాగునీరు విడుదల చేయడం జరిగింది. కృష్ణా డెల్టాలో ప్రధాన సేద్యం వరి. అలాంటి వరిసేద్యం చేయవద్దంటే, రైతులు ఖరీఫ్ సేద్యానికి దూరం కావడమేగదా! ఆగస్టు నెల నాటికి పూర్తిగా సేద్యం జరగాలి. ఆ తర్వాత పంటలు వేసినా ప్రయోజనంలేదు. నల్లరేగడి భూముల్లో ఇప్పుడు ఆరు తడిపంటల సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆరుతడి పంటలకు మళ్లడం కూడా రైతులకు చాలా ఇబ్బందికరం అవుతుంది. వరిసేద్యం జరగకపోతే ఆహార సమస్యకూడా ముందుకు వస్తుంది. రెండు కోస్తాతీర ప్రాంతాల్లోని చాలా జిల్లాల్లో వరిపంట తర్వాత జొన్న, మొక్కజొన్న పంటవేస్తారు. ఈపంటలు రైతులకు కొంత మిగులు ఆదాయాన్ని ఇస్తున్నాయి. ప్రకాశం బ్యారేజి కుడి, ఎడమ కాల్వలకు సాగునీరు విడుదల చేయకపోతే ఆ పంటల సేద్యం సాధ్యం కాదు. అందువల్ల రైతులకు తీవ్రనష్టం జరుగుతుంది. ఆరుతడి పంటలు వేయమనే కూటమి ప్రభుత్వం, అందుకు అవసరమైన వాటిని కూడా ముందు జాగ్రత్తగా సిద్ధం చేయలేదు. రైతులు వాటిని సమకూర్చుకోవాలంటే అనేక అవస్థలుపడాలి. అవస్థలు పడి ఆరుతడి పంట వేసినా చేతికి వస్తాయనే నమ్మకంలేదు. వరిపంట వల్ల మిగులు ఎక్కువలేకపోయినా నష్టం అనేది తక్కువగా ఉండటంతో రైతాంగం వరిపంట సాగుకే మొగ్గుచూపుతున్నారు. నేడు సాగునీటి సమస్యకు పాలకుల విధానాలే కారణం. ఎల్‌నినో ప్రమాదం గురించి ముందుగానే సమాచారం ఉన్నప్పుడు నదుల నీటినిల్వల గురించి సరైన చర్యలు తీసుకోవాలి. అలాంటి చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకోలేదు. భారతదేశంలో అత్యధిక చెరువులు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ముందు ఉంది. 2023లో కేంద్ర ప్రభుత్వ లెక్కలప్రకారం రాష్ట్రంలో 1,90,777 నీటి వనరులుండగా, వాటిల్లో 99.7 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో 81,703 చెరువులు పంచాయతీ ఇరిగేషన్ వంటి ప్రభుత్వశాఖల పరిధిలో ఉన్నాయి. ఈ చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుని, పూడికలు తీసి నీటితో వాటిని నింపి ఉంటే, వాటి ద్వారా సాగునీరు లభించేది. చెరువులను కాపాడే చర్యలను ఏ ప్రభుత్వం తీసుకోలేదు. పట్టిసీమ ఎత్తిపోతల పంపింగ్ గురించి గొప్పలు చెప్పేకూటమి ప్రభుత్వం ముందుగానే కృష్ణాబ్యారేజికి నీరు పంపింగ్ ఎందుకు చేయలేదు. ఇప్పుడు పంపింగ్ చేయడం సాధ్యంకాదని ఎందుకు చేతులుఎత్తింది. చెరువులను నీటితో నింపి, నిర్మాణంలో ఉన్నప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే ఈపరిస్థితుల్లో కూడా తాగు, సాగునీరు సమస్య

# ప్రజావాక్కు

## ఆర్థిక వాస్తవాలను విస్మరించడమే

**అమెరికా** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌పై విమర్శలతోవిరుచుకుపడటం రెండుదేశాల మధ్య సంబంధాలపైఅనవసరమైన ఉద్రిక్తతను పెంచుతోంది. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ప్రపంచ దేశాలను సుంకాల బెదరింపులతో ఒత్తిడికి గురిచేయడం, అదే సమయంలో అమెరికా ప్రయోజనాలకోసం వాటి సహకారాన్ని కోరడం ఇది భాగస్వామ్యమా, ఆధిపత్యమా అన్న ప్రశ్నను లేవనెత్తుతోంది. ట్రంప్ విధానంలో కనిపించే మరో విరుద్ధత అమెరికా ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని విస్మరించడం. అమెరికా శక్తి కేవలం అమెరికన్ల ప్రతిభతో నిర్మించబడలేదు. ముఖ్యంగాసాంకేతిక, వైద్య, పరిశోధనారంగాల్లో ప్రపంచ ప్రతిభ అమెరికా అభివృద్ధికి కీలకమైన బలం. అటువంటి దేశం విదేశీ ప్రతిభను అనుమానంతో చూడటం, సంస్థలను కేవలం స్థానికులను నియమించుకోవాలని ఒత్తిడి చేయడం ఆర్థిక వాస్తవాలను విస్మరించడమే.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## అతి వినయం ..

**అవసరానికి** మించి అతిగావంగి నమస్కరిస్తూ, వినయం ప్రదర్శించేవారిని అసలు నమ్మకూడదు. వాళ్ళ నిజస్వరూపాన్ని, స్వార్థాన్ని కప్పిపుచ్చుకోవడానికి పైకి నకిలీ వినయాన్ని ప్రదర్శిస్తారు. ఎప్పుడూ తానే ప్రత్యేకంగా కనిపించాలని భావిస్తారు. ఇలాంటి వారు మనకు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటారు. ఎవరైనా మనపై అతిగా పొగడ్తలు కురిపించినా, విపరీతమైన మర్యాద చూపించినా, వారి పట్లఅప్రమత్తంగా ఉండాలి. పొగడ్తలు అవసరమేగానీ వాటిపైనే ఆధారపడకూడదు. పొగడ్తలను జాగ్రత్తగా గమనించకపోతే అన్ని విధాలనష్టపోతాం. కొందరు తమలోని చెడుగుణాలను కప్పిపుచ్చుకునేందుకు ఎదుటివారిముందు చాలా అతివినయం ప్రదర్శిస్తుంటారు. వినయవిధేయతలతో మెలగానేగానీ, అతి వినయం అసలు పనికిరాదు.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## పాఠాలు నేర్చుకోవాలి

**నేపాల్** జల ప్రళయం నుండి భారత్ చాలా పాఠాలు నేర్చుకోవలసిఉంది. ముఖ్యంగాగ్లెషయర్ హిమాని నదాలు తొందరగాకరిగిపోకుండా ఉండేందుకు వాతావరణం సమతుల్యతను కాపాడే చర్యలు ఎన్నో చేయవలసి ఉంది. గ్రీన్ కవర్ పెంచడాన్ని ప్రాథమిక విధిగా చేర్చాల్సిన అవసరం ఉంది. ఇక టెక్నికల్ పేపర్స్‌లోను జీవోలలోనూ ఆవిషయాలు దాచకుండా అప్రోచ్ అనేది తక్షణావసరం.

- భారత అవినాష్, జనగామ

## మోడీ, పుతిన్‌ల కారు బంధం

గత పర్యటనలలో భారత ప్రధాని మోడీ సాధారణంగా ఉపయోగించే అత్యంత విలాసవంతమైన, కట్టుదిట్టమైన భద్రత ఉండే 'రేంజ్ రోవర్' కారునువదిలి 'టయోటా ఫార్చ్యూనర్‌లో' పుతిన్‌ను తీసుకెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రష్యా అధినేత పుతిన్ కూడా తాను ఎప్పుడూ వాడే అత్యున్నత భద్రతా ప్రమాణాలు ఉన్న తన అధికారిక కారు'ఆరస్ సెనేట్ లిమోసిన్‌లో' కాకుండా 'ఫార్చ్యూనర్'లో ప్రయాణించారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత, ప్రోటోకాల్ నడుమ ప్రయాణాలు సాగించే ఇద్దరు దేశాధినేతలు భద్రతా ప్రమాణాలకు విభిన్నంగా ఒక సాధారణ కారును ఎంచుకోవడం ఇరుదేశాల మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా భావించవచ్చు. ఇటీవల మోడీతో పుతిన్ మరో సారి తమ ప్రత్యేక స్నేహాన్ని చాటుకున్నారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా ద్వైపాక్షిక భేటీ అనంతరం ఇద్దరు ఒకేకారులో ప్రయాణించారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## కొండ వాహనాలపై నియంత్రణ అవసరం

**తిరుమలలో** కార్లు, జీపులు, ప్రైవేట్ వాహనాల ఇష్టారాజ్యం కనిపిస్తోంది. భక్తుల నుంచి వారికి ఇష్టం వచ్చినట్లుగా అధిక మొత్తాలను వసూలు చేస్తున్నారు. అందినకాడికి దోచుకునే ఈ విధానాన్ని నియంత్రించాలి. కార్లు, జీపులు ఎక్కడపడితే అక్కడ నిలపకుండా చూడాలి. వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా నిలపడంవల్ల పాదచారులకు, భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. టీటీడీ బస్‌స్టాప్‌లలో కేవలం టీటీడీ ఉచిత బస్సులే ఉండేలా చూడాలి. ప్రైవేట్ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. తిరుమలలో వాహనాల విషయంలో క్రమశిక్షణ, నియంత్రణ తప్పనిసరిగా ఉండాలి. భక్తుల సౌకర్యం కోసం ఈఅంశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి పెట్టాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

మన నిజ జీవితంలో ఏది కొనుగోలు చేయాలన్న విక్రయించాలన్న ప్లాస్టిక్ వాడకం జీవితంలో భాగమైపోయింది. నిరంతరం ప్లాస్టిక్ వినియోగించడం వలన మన జీవిత కాలం తగ్గిపోయే అవకాశంతో పాటు అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయంగా వాడితేనే ఇబ్బందులు ఉండకపోవచ్చు.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

MN 5 PAGE-GNT :MN 5 PAGE-GNT 01/01/2001 11:04 Page 1



గుంటూరు వార్త

# పింఛన్ల పంపిణీ సిబ్బంది పై మంత్రి మనోహర్ ఆగ్రహం

**కొల్లిపర, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే సిబ్బంది సజావుగా విధులను నిర్వర్తించడం లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీకి



సంబంధించి వృద్ధుల నుండి ఫిర్యాదులు రావడంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు వెంటనే మెమో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కొల్లిపర మండలంలోని అత్తోటలో పర్యటించిన మంత్రి మనోహర్ ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా సక్రమంగా పెన్షన్లు పంపిణీ జరగడంలేదని తెలుసుకుని మంత్రి మనోహర్ ఆగ్రహం వెలుబుచ్చారు. అత్తోటలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని ముందుకు కదలని మురుగునీటితో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, దుర్వాసనను భరించలేక పోతున్నామని మంత్రి దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద లక్షా 46 వేల కోట్ల రూపాయలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులకు పెన్షన్లు అందుతున్నాయని ఆయన గుర్తు చేశారు. అత్తోటలో 977 మందికి రూ.48 లక్షలు ,నంది వెలుగు గ్రామంలో 975 మందికి రూ.47 లక్షలు పెన్షన్ల రూపంలో చెల్లిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లిపర మండల తహశీల్దార్ సిద్ధార్థ, ఎంపిడివో విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపిడివోలు భార్గవ్, దానయ్య, నాయకులు దివ్వెల వెంకయ్య నాయుడు, అడపా నారాయణరెడ్డి, ఎటిఎం నాగరాజు, ఏడుకొండలు, దాసరి నరసయ్య, వరికూటి నాగరాజు, కొఠారు ఆంజనేయులు, ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి మందలించిందని అన్నదమ్ముల ఆత్మహత్య



**క్రోసూరు( సెప్టెంబర్ 1 ప్రభాతవార్త)** క్రోసూరు మద్యం తాగి ఇంటికి వచ్చినందుకు తల్లి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఇద్దరు అన్నదమ్ములు ఆత్మహత్యకు పాల్పడ్డారు. క్రోసూరు మండలం 88తాళ్లూరు గ్రామానికి చెందిన ఇరువురు పురుగు మందు తాగగా, కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పెద్ద కుమారుడు, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చిన్న కుమారుడు మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# 120 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం

## 812 మంది యజమానులకు ఉపశమనం

## కేంద్రమంత్రి పెమ్మసాని

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు, పుల్లడిగుంట, ఏటుకూరు గ్రామాలలో 120 సంవత్సరాల భూ సమస్యకు కూటమి ప్రభుత్వ పాలనలో శాశ్వత పరిష్కారం లభించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వట్టిచెరుకూరు మండల కేంద్రంలో మంగళవారం నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు, పుల్లడిగుంట, ఏటుకూరు గ్రామాల్లో 812 కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీ







కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ భాష్యం రామకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ సీఎం.సాయికాంత్ వర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభంలో కేంద్రమంత్రి పెమ్మసాని మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వంలో ఏకకాలంలో మూడు గ్రామాల్లో 41.46 ఎకరాల భూసమస్యకు సంబంధించి శాశ్వత పరిష్కారం లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. వట్టిచెరుకూరు గ్రామంలో చెరువు పోరంబోకుగా నమోదై ఉండగా, పుల్లడిగుంట గ్రామంలో తోపు పోరంబోకు, ఏటుకూరు గ్రామంలో దేవదాయ భూమిగా నమోదై ఉండడంవల్ల అచ్చటి ప్రజలు ఆ స్థలాలను అమ్ముకోలేక, రిజిస్ట్రేషన్ చేసుకోలేక, తాకట్టు పెట్టుకోలేక, గిఫ్టుగా ఎవరికైనా ఇవ్వలేక నానా ఇబ్బందులకు గురవడం జరిగిందని వివరించారు.

వట్టిచెరుకూరు గ్రామం కాకతీయుల కాలంకు ముందే విలసిల్లింది, 25.37 ఎకరాల భూమిలో 1906 సంవత్సరం నుండి ఎటువంటి భూ లావాదేవీలు జరగలేదని వెల్లడించారు. రీసర్వే చేసి రికార్డులు పరిశీలించి సరిచేయడం జరిగింది. 426 ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 22 (ఏ) భూముల క్రింద తొలగించి సమస్యను పరిష్కరించటం జరిగిందని చెప్పారు.

పుల్లటగుంట గ్రామంలో 1922 సంవత్సరం నుండి 10.16 ఎకరాల భూమి తోపు పోరంబోకుగా రికార్డులో నమోదై ఉందన్నారు. 120 ఏళ్ళుగా నివాస గృహాలు, మౌళిక సదుపాయాలు కలిగి ఉన్నాయని కలెక్టర్ నివేదిక సమర్పించారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పూర్తి విచారణ చేసి 22 (ఏ) నుండి తొలగించారని తెలియజేశారు. గుంటూరు తూర్పు మండలం ఏటుకూరు గ్రామంలో 5.93 ఎకరాల భూమి 22 (ఏ) (సి) క్రింద నమోదై ఉండడం, 1915 సంవత్సరం నుండి అన్నీ లావాదేవీలు జరిగాయని గుర్తించడం, సర్వే నంబరు 74లో భూములపై జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పించడంతో పై మూడు గ్రామాలలో కుటుంబ యజమానులకు మీ భూమిమీ హక్కు కార్యక్రమంలో భాగంగా అర్హులందరికీ ఇంటి పొజిషన్ సర్టిఫికెట్లు అందించడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా నివేషణ స్థలాలకు సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం ఆనందదాయకం అన్నారు. శతాబ్ద కాలంగా అనుభవించి, పన్నులు చెల్లించి, యాజమాన్య హక్కులు లేకపోవడం చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కాలంలో ల్యాండ్ టైటిల్ చట్టంతో ప్రజల్లో భయం వచ్చిందని, 22(ఎ) క్రింద రాష్ట్రంలో 1.60 లక్షల ఎకరాలకు విముక్తి కలుగుతుందని చెప్పారు. నాలా ఛార్జీలు 4 శాతంకు తగ్గింపు, వారసత్వ ఆస్తికి వంద రూపాయల స్టాంప్ డ్యూటీ తగ్గించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2026 జూలై నుండి 2027 జూలై వరకు 67 లక్షల పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ జరుగుతుందన్నారు. రీ సర్వే చేసి డిజిటలైజేషన్ రికార్డులు నెలకొల్పి కేంద్ర స్థాయిలో భద్రపరచడం జరుగుతోందని వివరించారు. జీవో 30 క్రింద రాష్ట్రంలో 35 వేల ఇళ్ళ పట్టాలు పంపిణీ జరిగిందని, ఇంకా కొన్ని వేల ఇళ్లకు పంపిణీ జరుగుతుందని చెప్పారు. నలభై యాభై ఏళ్ళ నుండి అపరిష్కృతంగా ఉన్న గుంటూరు చానల్ ను రూ.6 వందల కోట్లతో అభివృద్ధి చేయడం, చెరువులను ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. త్వరలో ప్రత్తిపాడు నియోజక వర్గంలో వంద కోట్ల రూపాయలతో ఆయుష్ ఆసుపత్రి వస్తుందని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్తిని కొనుగోలు చేశామని, ఎరువులు సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

**రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ..** ఇదొక అద్భుత కార్యక్రమమని, రాష్ట్రంలో ఈ కార్యక్రమానికి నాంది పలికింది వట్టిచెరుకూరు గ్రామం అన్నారు. రాష్ట్రంలో మూడు వందల గ్రామాలకు పరిష్కారం లభించిందని, గత వైసిపి కాలంలో రీసర్వే అస్తవ్యస్థంగా జరిగి రైతులు ఎన్నో ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. ఎక్కడకు వెళ్లినా 70 శాతం రెవెన్యూ సమస్యలు వస్తుండేవని, వాటిని పరిష్కరించుటకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ క్లినిక్లను ఏర్పాటుచేసి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. 2007లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో రీసర్వే ప్రారంభించడం జరిగిందని, ఈ సర్వేలో డేటా పక్కాగా ఉన్నప్పుడే పట్టాదారు పాసు పుస్తకం అందిస్తున్నామని తెలిపారు. రీ సర్వేకు కేంద్ర మంత్రి డా.పెమ్మసాని ఎంతో సహకరిస్తున్నారని, క్యూఆర్ కోడ్ తో పట్టాదారు పాసు పుస్తకం అందిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులు 30 క్రింద ఉన్నవారికి రెగ్యులరైజ్ చేస్తున్నామని, విశాఖలో దాదాపు 30 వేలు, విజయవాడలో 25 వేల వరకు అందించనున్నామని అన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన అందించాలని, క్షేత్ర స్థాయిలో మంచిచేసే సంస్కరణలు తీసుకువస్తున్నా మని వివరించారు. పార్లమెంట్ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ..భూ సమస్య పరిష్కారం శాశ్వతంగా జరగడం సంతోషించదగ్గ విషయం అన్నారు.

**స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ..**

శాసనసభ సాక్షిగా భూ సమస్య పరిష్కారం అయిందన్నారు. తాతా ముత్తాతల నుండి అనుభవిస్తున్నప్పటికీ దానిపై హక్కు లేకుండా జీవించారని, ఈ పవిత్ర కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం అయినందుకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ సియం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ..మూడు గ్రామాల ప్రజలకు చక్కటి పరిష్కారం లభించిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన దిశానిర్దేశంతో ఇది సాధ్యమైయిందని చెప్పారు. రెవెన్యూశాఖ ప్రజలకు చేరువ చేయుటకు రెవెన్యూ మంత్రి కృషి అభినందనీయమని, ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలు గుర్తించి పరిష్కారం చేస్తున్నామని వివరించారు.

ఈ గ్రామాల్లో సమస్యల పట్ల స్థానిక శాసన సభ్యులు కృషి అభినందనీయమని, మూడు గ్రామాల్లో 41.46 ఎకరాలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.

మూడు నుండి నాలుగు వేల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రారంభంలో అనంతవరప్పాడు గ్రామము నుండి కూటమి నేతలు అతిథులకు స్వాగతం పలికి భారీర్యాలీతో సభాస్థలికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్డీవో కె.శ్రీనివాస రావు, ఉత్తర అమెరికాలో రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి జయరాం, స్థానిక అధికారులు, అనధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లలో మౌళిక వసతులపై ప్రజల మన్ననలు పొందాలి

**గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 7 అన్న క్యాంటీన్లలో పారిశుధ్య నిర్వహణ, మౌళిక వసతులపై ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్ల నిర్వహణపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పర్యవేక్షణకు ప్రత్యేకంగా విధులు కేటాయించిన వెల్ఫేర్ సెక్రెటరీలు, మెప్మా కమ్యూనిటి ఆర్గనైజర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ క్యాంటీన్ల వారీగా వసతులు, సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకొని, ప్రతి క్యాంటీన్ కి కమ్యూనిటి ఆర్గనైజర్లు, వెల్ఫేర్ సెక్రెటరీలు తప్పనిసరిగా ప్రతి రోజు వెళ్లాలన్నారు . ఈ సమావేశంలో ఉపా సెల్ పిఓ సింహాచలం, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కమ్యూనిటి ఆర్గనైజర్లు, వెల్ఫేర్ కార్యదర్శులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్యం,విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## ఎం.పి లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**వెల్దుర్తి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథులుగా






హాజరై నూతన భవనాలను మంగళవారం ప్రారంభించారు. మండలంలో రూ. 4.20 కోట్లతో చేపట్టిన ముఖ్య అభివృద్ధి పనుల వివరాలు:50 లక్షలతోఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినుల వసతి కోసం రూ. 2.55 కోట్లతో నిర్మించిన వసతి గృహం తో పాటు రూ. 60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అధునాతన కంప్యూటర్ ల్యాబ్ భవనాన్ని ప్రారంభించారు. ఐ.టి.డి.ఏ హెల్త్ సెంటర్‌వెల్దుర్తి మండల కేంద్రంలో రూ. 55 లక్షలతో నిర్మించిన ఐ.టి.డి.ఏ హెల్త్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా మంజూరైన మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు సంబంధించిన తాత్కాలిక తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం, నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మండల ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కళ్ళం రామంజిరెడ్డి, కేసిరెడ్డి వెంకటరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి, నర్రా గురవారెడ్డి, కుర్రి శివారెడ్డి, జూలకంటి చిరంజీవిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నందివెలుగు లో ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల

**తెనాలి, సెప్టెంబర్1, (ప్రభాతవార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో మంగళవారం స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఇంటింటికీ పెన్షన్ల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని మంత్రి, నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంగళవారం తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. నందివెలుగు గ్రామంలో 975 మంది పెన్షన్ దార్లుకు రు.51 లక్షలు, లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు రు.70 వేల కోట్ల పెన్షన్లు అందించామని, ప్రతి నెల సుమారు 3 వేల కోట్లను పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులకు నెలకు రు.4,000, మంచానికే పరిమితమైన వారికి అటెండర్ సౌకర్యంతో రు.15,000 వరకు పెన్షన్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. హిమోఫీలియా బాధితులకు రు.10 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. వచ్చే అక్టోబర్ నుంచి సుమారు 2 లక్షల కొత్త పెన్షన్లను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించనున్నామని, అర్హతతో పాటు ప్రాధాన్యత ఆధారంగా పెన్షన్లు అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా చిన్న వయసులో భర్తను కోల్పోయి పిల్లలతో జీవిస్తున్న వితంతువులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు సుమారు రు.1.46 లక్షల కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించామని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి నాయకులు జనసేన కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

# నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ పడే ప్రసక్తి లేదు : కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత అత్యంత ప్రధానమని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని బ్రాడీపేట, కాకుమానువారి వీధి, లాంచెస్టర్ రోడ్, సంపత్ నగర్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న, పూర్తైన అభివృద్ధి పనులను, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నూరు శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే పనులు వేగంగా, సమర్థవంతంగా జరుగుతాయన్నారు. బ్రాడీపేటలో త్రాగునీటి శ్యాంపిల్స్ తీయడంలో నిరక్ష్యంగా ఉన్న ఎమినిటి కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్ఈని, రోడ్లపై నిర్మాణ సామగ్రి వేసిన వారికి నిర్మాణ పనులు ఆపాలని నోటీసు ఇవ్వాలని ఏసిపీని



ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈలు విష్ణు, వేణు, డిఈఈలు వెంకటరమణ, సతీష్, చైతన్య, ఏసిపీ రెహ్మాన్, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఏఎన్‌యు సర్ణోత్సవ చిత్రమాలిక ప్రదర్శన

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు1, ప్రభాతవార్త:** ఏఎన్‌యు 50ఏళ్ళ స్వర్ణోత్సవాల్లో భాగంగా 1976 నుంచి 2026 వరకు 50ఏళ్ళ మధుర జ్ఞాపకాలకు దృశ్యరూపం చూపుతు ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను మంగళవారం వీసి గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్



సింహాచలంలు ప్రారంభించారు. డైక్మన్ ఆడిటోరియంలో వర్సిటీ ప్రారంభం నుంచి నేటి వరకు సాధించిన ప్రగతి, విద్యా పరిశోధన, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో సాధించిన విజయాలు, ప్రముఖుల సందర్శనలు, ముఖ్యమైన కార్యక్రమాలు, వర్సిటీ అభివృద్ధికి సంబంధించిన కీలక ఘట్టాలను అరుదైన ఛాయా చిత్రాల రూపంలో ప్రదర్శనలో ఉంచారు. 5దశాబ్దాల కాలంలో వర్సిటీ ప్రగతికి అద్దం పట్టేలా ఫోటోలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేయడం విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంలో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి, సిఎస్ఆర్ ప్రోగ్రామర్ ఎం.వి.రమణ, ఫోటోగ్రాఫర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**చిత్రకళా ప్రదర్శన**

వర్సిటీ స్వర్ణోత్సవ శోభను సంతరించుకునేలా ఫైన్‌ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో పూర్వ ప్రస్తుత కళా విద్యార్థులు చిత్రకళా ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. వికాస భవన్‌లో 50మంది విద్యార్థులు రూపొందింన 1000కి పైగా చిత్రకళాకృతులు ఈ ప్రదర్శనలో ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రదర్శనను వీసి ఆచార్య గంగాధరరావు, ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌కుమార్, ఫైన్‌ఆర్ట్ విభాగం కోఆర్డినేటర్ పి.దేవకాంత్, అధ్యాపకులు బి.శేఖర్‌బాబు, పి.శ్రీనివాసరావు, బి.జాన్‌రత్నబాబు, వి.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# 108 కిలోల కుంకుమతో ఆదిలక్ష్మీ అమ్మవారికి అభిషేకార్చన

**గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వ్యవస్థాపకులు ప్రధాన పూజారి మర్రిపాటి ప్రసాద్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటికుంకుమార్చనలో భాగంగా మూడవ శ్రావణ మాస మంగళవారం మంగళగౌరీ వ్రతం కనుల పండువగా జరిగింది. తొలుత అమ్మవార్లకు 108కిలోల కుంకుమతో విశేషాభిషేకార్చన వేదం మంత్రాలతో జరిగింది. నక్షత్ర హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణతో పాటు అన్న ప్రసాద వితరణ జరిగింది. స్థానిక సిద్ధార్థ నగర్ శ్రీకనకమహాలక్ష్మీ దేవాలయంలో ఆలయ వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి ఆధ్వర్యంలో విశేషంగా పాల్గొన్న సువాసినులతో భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం నిర్వహించి, విశేషహారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా మూల విరాట్టును మంగళగౌరీగా అలంకరించారు.



## నవనీత బాలకృష్ణ స్వామి ఆలయంలో జన్మాష్టమి వేడుకలు



**యడ్లపాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెంఘీస్ఖాన్‌పేట గ్రామంలోని శ్రీ వెన్నముద్దల వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ఈ నెల 4వ తేదిన వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 4.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యా హావ చనం, 5 గంటలకు పంచామృత అభిషేకం ప్రారంభమవుతుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించటం జరుగుతుందన్నారు. సాయంత్ర స్వామి వారి ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

## టీడీపీలో చేరిన ఆరుగురు కౌన్సిలరు

**పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే యరపతినేని**









**గురజాల, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పిడుగురాళ్లలోని టీడీపీ కార్యాలయంలో వీరు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వీరికి పార్టీ కండువాలను కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ బడేజాని (మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్, 9వ వార్డు), షేక్ అలీ మున్నీసా బేగం (8వ వార్డు కౌన్సిలర్), కుక్కమూడి అనిల్ (20వ వార్డు కౌన్సిలర్), బండి రవి (14వ వార్డు కౌన్సిలర్), తూముల లింగాచారి (1వ వార్డు కౌన్సిలర్), మంచి యశోద (13వ వార్డు కౌన్సిలర్) ఉన్నారు. ఈ సందర్భంగా బడేజాని మాట్లాడుతూ పట్టణాభివృద్ధి ఎమ్మెల్యే యరపతినేనితోనే సాధ్యమన్నారు. తనకు 1994 నుంచి ఎమ్మెల్యే యరపతినేనితో పరిచయముందని, ఈనాడు దినపత్రిక పాత్రికేయునిగా పనిచేసే కాలంలో ఆయన్ను దగ్గరగా చూశానని, ఆ రోజుల్లో ఫ్యాక్షన్ రూపు మాపాలని, యువతకు ఉపాధి కల్పనకు ఎమ్మెల్యే యరపతినేని శ్రమించారన్నారు. 2014 - 2019 టీడీపీ హయాంలో గురజాల పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, గ్రామస్థాయిలో ఉన్న పట్టణానికి ఆర్డీవో కార్యాలయం తీసుకొచ్చారని అన్నారు. సింగిల్ రోడ్డుగా ఉన్న పట్టణంలో డబుల్ రోడ్డు వేయించి అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వాసుపత్రికి నిధులు తీసుకొచ్చి ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాసుపత్రికి మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. సుంకరకుంట చెరువును రూ.2 కోట్ల నిధులతో మరమ్మతులు చేయించి ఆధునీకరణ చేస్తున్నారని, పట్టణంలో రూ.కోటి నిధులతో పెండింగ్‌లో ఉన్న కాపు కమ్యూనిటి హాలు నిర్మాణం చేస్తున్నారని అన్నారు. రూ. 3 కోట్లతో రెండున్నరేళ్లలో రోడ్ల నిర్మాణం చేపట్టారని, నగర పంచాయతీ భవనానికి నూతన భవన నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని చెప్పారు. మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల భవనాలు పాతవి కావడంతో నూతన భవనాల నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నారన్నారు. 2024లో అధికారం చేపట్టాక ముళ్ల కంపలతో ఉన్న శ్మశాన వాటికలను ఆధునీకరణ చేస్తున్నారన్నారు. దశాబ్ధ కాలంగా పెండింగ్ పైపులైను నిర్మాణ పనులను ప్రారంభించారని, రూ.16 కోట్ల నిధులతో అమృత 2.0 పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనులకు దిక్సూచిగా ఉన్న ఎమ్మెల్యే యరపతినేని నాయకత్వంలో టీడీపీలో కొనసాగుతామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. అభివృద్ధిలో తాము కూడా భాగమయ్యేందుకు టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ ఆకుల పిచ్చయ్య గుప్త, అడపా శ్రీనివాసరావు, నేలవెల్లి బొల్లయ్య, శరమాల హనుమంతురావు, మల్లయ్య, పోటు నాగేశ్వరరావు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా జగన్ క్రెడిట్ చోరీ రాజకీయాలు సిగ్గు చేటు..

**చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ మక్కెన**



**శావల్యాపురం,సెప్టెంబర్1,ప్రభాతవార్త:** పేద,బడుగు ,బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలను నేరుగా అందించ డమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలకేంద్రం శావల్యాపురం ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ మక్కెనతో కలిసి చీఫ్‌విప్ జీ.వీ లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేసి, వారితో ఆత్మీయంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 లక్షల మందికి ప్రతి నెలా ఇంటి వద్దే పెన్షన్లు అందిస్తున్నామని జీవీ తెలిపారు. గతంలో రూ.3 వేలుగా ఉన్న సాధారణ పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచామని, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు రెట్టింపు చేశామని చెప్పారు. ఉదయం నుంచే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పెన్షన్ అందిస్తూ వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉండి ప్రస్తుతం పెన్షన్ అందని వారికి కూడా కొత్త పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. సంక్షేమంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని జీవీ అన్నారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూసిన వెలిగొండ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లి కృష్ణా జలాలు అందించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. వెలిగొండ ద్వారా సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరు,40 లక్షల మందికి తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉండి వెలిగొండను ఎందుకు పూర్తిస్థాయిలో పూర్తి చేయలేకపోయిందో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని జీవీ ప్రశ్నించారు. ఎన్నికల ముందు అసంపూర్తి ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని ప్రకటించడం రైతులను మభ్యపెట్టడం కాదా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లి ప్రజలకు నీళ్లు అందించే పరిస్థితి తీసుకొచ్చిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వెలిగొండను ముందుకు తీసుకెళ్లి ప్రజలకు నీళ్లు అందిస్తుంటే ఇప్పుడు జగన్ క్రెడిట్ మాదే అంటూ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని జీవీ విమర్శించారు. అభివృద్ధి పనులు ఎవరు చేశారో ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. ప్రతి పనికీ తమదే క్రెడిట్ అని చెప్పుకోవడం క్రెడిట్ చోరీ రాజకీయాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. పేదలకు పెన్షన్ భరోసా రైతులకు సాగునీటి భరోసా కల్పిస్తూ సంక్షేమం-అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ విధానమని జీవీ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమం,ప్రతి ప్రాంతానికి అభివృద్ధి అందేలా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,కూటమి నాయకులు,ప్రజాప్రతినిధులు,అధికారులు,సచివాలయ సిబ్బంది,పెన్షన్ లబ్ధిదారులు,ప్రజలు పాల్గొన్నారు.

## ఖోఖోలో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ





**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 30న నకరికల్లులోని శ్రీ వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో అసోసియేషన్ మీట్ అండ్ ట్రైల్స్ లో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన ఆకుల కోమలేష్, నక్కా సాయి చరణ్ రెడ్డి జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒగూరి నాగేశ్వరరావు తెలిపారు. సెప్టెంబర్‌లో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో మీట్‌లో వీరు ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు విద్యార్థులను అభినందిస్తూ, క్రీడలతో పాటు విద్యలోనూ రాణించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పి.వి. అచ్యుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

**ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు వాగ్దేవి విద్యార్థుల ఎంపిక ..**

నకరికల్లు శ్రీ వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 30న నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఖోఖో అసోసియేషన్ మీట్ అండ్ ట్రయల్స్ లో వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆకుల కోమలేష్, నక్కా సాయి చరణ్ రెడ్డి సెప్టెంబర్‌లో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థుల ప్రతిభను కళాశాల ప్రిన్సిపాల్ ఒగూరి నాగేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అభినందించారు. డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పి.వి. అచ్యుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మాచర్లకు జలకళ..

## రూ.153.47 కోట్లతో వాటర్‌గ్రిడ్‌కు శ్రీకారం

**15,374 కుళాయిలకు శుద్ధజలం**

**అభివృద్ధే కూటమి ప్రభుత్వ నినాదం**

**ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**

**24 గంటల తాగునీటి సరఫరానే లక్ష్యం**

**వరికపూడిశెలపై అబద్ధపు ప్రచారం చేస్తే ఊరుకోం**

**ఎమ్మెల్యే జూలకంటి**



**మాచర్ల టౌన్ సెప్టెంబరు 01 ప్రభాత వార్త:** జలంతోనే జీవనం సాధ్యమని,ప్రజలకు సాగు, త్రాగునీటి సమస్యలు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మాచర్ల పట్టణ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. మంగళవారం మాచర్ల పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో అమృత్ స్కీమ్ 2.0, యూఐడీఎఫ్ నిధులతో రూ.153.47 కోట్లతో చేపట్టనున్న వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు,ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. రానున్న కాలంలో సుమారు 15,374 కుళాయిల ద్వారా ప్రజలకు శుద్ధమైన త్రాగునీటి ని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పట్టణంలో రూ.47 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థ,రహదారులను ఆధునీకీకరించేందుకు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందుతున్నాయని, జాతీయస్థాయిలో అవార్డులు సాధించడం అభినందనీయమన్నారు. వెనుకబడిన మాచర్ల ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అభివృద్ధే కూటమి ప్రభుత్వ నినాదమని,గతంలో ఎన్నడూ చూడని విధంగా మాచర్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని ఎంపీ పేర్కొన్నారు.

**వరికపూడిశెల పై త్వరలో ముందడుగు..**

వరికపూడిశెల ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన కొన్ని అనుమతుల కోసం ఈ నెలలోనే నివేదికలను సిద్ధం చేస్తున్నామని ఎంపీ తెలిపారు. అవసరమైన అనుమతులు పూర్తయిన వెంటనే ప్రాజెక్ట పనులపై మరింత స్పష్టత వస్తుందని చెప్పారు.

**సన్యాసి పిన్నెల్లి ఇకనైనా బుద్ధి మార్చుకో..**

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రావ ఁకృష్ణారెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇకనైనా బుద్ధి మార్చుకోవాలని,వరికపూడిశెల ప్రాజెక్టుపై అబద్ధపు ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. భూటకపు హామీలతో ఐదేళ్ల కాలయాపన చేసినందుకే ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు రావాల్సిన కొన్ని అనుమతులు అందిన వెంటనే పనులను ప్రారంభించి సాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు ఒక్క ఓటుతో రాష్ట్ర రూపురేఖలను మార్చారని,రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలివస్తున్నాయని అన్నారు.

మాచర్లలో 500 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్క్‌ను పట్ల వీడు వద్ద ఏర్పాటు చేస్తున్నామని,దీనివల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ,ఉపాధి అవ కాశాలు లభిస్తాయని తెలిపారు. వైసీపీ హయాంలో నిరక్షా ్యనికి గురైన టిడ్కో ఇళ్లకు మరమ్మతులు చేపట్టి వచ్చే దసరా నాటికి లబ్ధిదారులకు ఇళ్లు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు,సాగునీటి పంపిణీ సంఘం చైర్మన్ పంగులూరి అంజయ్య,సొసైటీ అధ్యక్షులు కుర్రి శివారెడ్డి,మార్కెట్ యార్డు చైర్మన్ రాజబోయిన మధుయాదవ్, దుర్గి మార్కెట్ యార్డు చైర్మన్ లింగా బ్రహ్మయ్య,టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్,మాజీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి (వాసవి సేవాదళ్ అధ్యక్షులు)కంభంపాటి అనిల్ కుమార్, యెనుముల కేశవరెడ్డి,కొమెర దుర్గారావు,కజ్జం సైదయ్య,పోలూరి నరసింహారావు, అన్వర్,వజ్రం నాయక్,మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లోనే సినీ పరిశ్రమ అభివృద్ధి చేయాలి

**500 ఎకరాల స్టూడియో భూమి కేటాయించాలి**

**ప్రముఖ సినీ నిర్మాత**

**అమరావతిలో అడుగుపెడతా.. స్థానిక ప్రాంతాల్లో సినిమాల షూటింగ్‌కు ప్రాధాన్యం**



**యడ్లపాడు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను స్థిరపరిచి అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీ నిర్మాత మరియు ఏపి ఫిలింమ్ బోర్డు సభ్యుడు వంకదారి సముద్ర పేర్కొన్నారు. మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని తన స్వగృహానికి విచ్చేసిన తరుణంలో పాత్రికేయులతో పలువిషయాలపై చర్చించారు. సినీ పరిశ్రమకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్టూడియోల ఏర్పాటుకు సుమారు 500 ఎకరాల భూమిని కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల సినిమా పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి పలువురు ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం సినీ పరిశ్రమను ఎక్కడ అభివృద్ధి చేయాలనే అంశంపై బోర్డు సభ్యులతో సమావేశం జరిగిందని, అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులతో కూడా చర్చలు జరిగినట్లు చెప్పారు. సమావేశాల్లో వచ్చిన అభిప్రాయాలను ఐఏఎస్ అధికారి నమోదు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో చర్చించినట్లు వివరించారు. అమరావతికి తప్పకుండా వస్తామని, ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి ప్రాంతాల్లో అభివృద్ధి చేసే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. విశాఖపట్నంలో బీచ్, అరకు, రాజమండ్రి వంటి అద్భుతమైన షూటింగ్ లొకేషన్లు ఉన్నందున అక్కడ కూడా సినీ పరిశ్రమ అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయని తెలిపారు. అయితే తాను మాత్రం అమరావతిలో తప్పకుండా అడుగుపెడతానని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించిన తర్వాత, తాను వ్యక్తిగతంగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై ప్రణాళిక రూపొందించుకుంటున్నానని చెప్పారు.

**500 ఎకరాలు స్టూడియోలకు కేటాయించాలి :**

ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ స్థిరపడాలంటే ప్రభుత్వం స్టూడియోల ఏర్పాటుకు కనీసం 500 ఎకరాల భూమిని కేటాయించాలని ఆయన సూచించారు. చిత్ర పరిశ్రమకు చెందిన నిర్మాతలు, నటులు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది రాష్ట్రంలో స్థిరపడేలా అవసరమైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో చెన్నై నుంచి హైదరాబాద్‌కు సినీ పరిశ్రమ మారుతున్న సమయంలో అక్కడి ప్రభుత్వాలు స్టూడియోలు, ఫిల్మ్‌నగర్ వంటి ఏర్పాట్లకు ప్రోత్సాహం అందించాయని గుర్తుచేశారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించి భూమి, మౌలిక వసతులు కల్పిస్తే సినీ పరిశ్రమ క్రమంగా రాష్ట్రంలో స్థిరపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు 17 సినిమాలు పూర్తి చేసినటు తెలిపారు. ప్రస్తుతం తాను నిర్మించిన మరో చిత్రం వరదరాజు గోవింద చిత్రం దసరా నాటికి విడుదలకు సిద్ధమవుతోందన్నారు. ఈ చిత్రం కృష్ణుడి మీద ప్రధాన పాత్రలో రూపొందిందని, పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కించామని చెప్పారు. ఈ చిత్రాన్ని ఏడు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ భాషలకు చెందిన నటీనటులు ఇందులో భాగస్వాములయ్యారని చెప్పారు. తాను ఇప్పటికే తెలుగు, అస్సామీతో పాటు ఇతర భాషల్లోనూ స్ట్రెయిట్ సినిమాలు చేసినట్లు వివరించారు.

**స్థానిక ప్రాంతాల్లోనే షూటింగ్స్‌కు ప్రాధాన్యం..**

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో గతంలో అనేక సినిమాల షూటింగ్స్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. చిలకలూరిపేట, నర్సరావుపేట, కడప, కర్నూలు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ చేసినట్లు చెప్పారు. ఇకపై ప్రారంభం కానున్న మరో ఐదు సినిమాల్లోనూ వీలైనంత వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాలకే ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ముఖ్యంగా తన స్వస్థలం బోయపాలెం పరిసర ప్రాంతాల్లో షూటింగ్స్ నిర్వహించి, స్థానికంగా అభివృద్ధికి తనవంతు సహకారం అందించాలనుకుంటున్నట్లు చెప్పారు. కొండవీడు, తెనాలి, రేపల్లె, కోటప్పకొండ, కృష్ణుడి ఆలయ పరిసరాలు వంటి ప్రాంతాల్లో చిత్రీకరణకు మంచి అవకాశాలు ఉన్నాయని, భవిష్యత్ సినిమాల్లో ఆయా ప్రాంతాలను లొకేషన్లుగా ఉపయోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు కుమారులను హీరోలుగా పరిచయంతో తన భవిష్యత్ ప్రణాళికల గురించి కూడా ఆయన వివరించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న చిత్రం విడుదలైన అనంతరం తన ఇద్దరు కుమారులను హీరోలుగా సినీ రంగానికి పరిచయం చేయనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో మరిన్ని సినిమాలు నిర్మించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని సహజసిద్ధమైన ప్రాంతాలను సినీ షూటింగ్స్‌కు ఉపయోగించుకుని స్థానికంగా చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ బలపడాలంటే ప్రభుత్వం, సినీ పరిశ్రమ వర్గాలు కలిసి పనిచేయాలని, అవసరమైన భూమి, మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు కల్పిస్తే రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున చిత్ర నిర్మాణాలు జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**సినీ రంగం నుంచి వ్యాపార రంగంలోకి అడుగు...**

సముద్ర వండర్స్ పేరుతో మ్యూజిక్ కంపెనీ ఏర్పాటు చేసి ఏడు భాషల్లో దేశవ్యాప్తంగా సంగీతాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, సినీ రంగంలో నటుడిగా, నిర్మాతగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సినీ నిర్మాత ఇక వ్యాపార రంగంలోకి కూడా అడుగుపెడుతున్నట్లు ప్రకటించారు. తొలిసారిగా మ్యూజిక్ కంపెనీని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. సముద్ర వండర్స్ పేరుతో దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించే మ్యూజిక్ కంపెనీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని ఏడు భాషల్లో సంగీతాన్ని విడుదల చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు సినీ పరిశ్రమలో దర్శకుడిగా, నిర్మాతగా పనిచేసిన తాను ఇకపై వ్యాపార రంగంలోనూ తన కార్యకలాపాలను విస్తరించనున్నట్లు తెలిపారు. మ్యూజిక్ కంపెనీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటుందని వెల్లడించారు. అయితే భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌లో కూడా తన కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు చెప్పారు. ముఖ్యంగా సినీ పరిశ్రమకు సంబంధించిన కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందేలా తన వంతు కృషి చేయాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. సినీ రంగంలో తన అనుభవాన్ని ఉపయోగించుకుని సంగీతం, సినిమా నిర్మాణం, వ్యాపార రంగాల్లో కార్యకలాపాలను విస్తరించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ప్రతిభకు అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ఆర్‌టీసీ రిటైర్డు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

**-డీపీటీఓ కార్యాలయం ఎదుట ధర్నా, వినతిపత్రం అందజే**



**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** :ఆర్‌టీసీ రిటైర్డు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం గ్యారేజ్ దగ్గర నుంచి డీపీటీఓ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీపీటీఓ టి.అజితకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా డిపో అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకరరావు, సింగ్ మాట్లాడుతూ ఏళ్లు, నెలలు గడుస్తున్నా తమ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవట్లేదన్నారు. దీని వలన ఆయా ఉద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నాయన్నారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ తీసుకోకుండానే అనేక మంది రిటైర్డు ఉద్యోగులు మృతిచెందారన్నారు. ఉద్యోగం లేక రావాల్సిన సెటిల్‌మెంట్ తాలూకా మొత్తాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందువలన వెంటనే గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, రిటైర్డు ఉద్యోగి, ఆయన భార్యకు లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని, హయ్యర్ పెన్షన్‌కోసం ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించి పీఎఫ్ కార్యాలయంకు జమచేసిన సొమ్మును తిరిగి చెల్లించాలని, హైదరాబాదు బర్కత్‌పురాలో ఉన్న పీఎఫ్ కార్యాలయం నుంచి ఉద్యోగుల ఖాతాలను ఏపీకి తరలించాలని కోరారు. వై.మస్తాన్‌రావు, ఎం.ఆర్.కే.రెడ్డి, టి.సుబ్బారావు, ఎస్ఎం ఆలీ, వీరారెడ్డి తదితర రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది

**డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి**



**నరసరావుపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** :నాయి బ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివారెడ్డి అన్నారు. పట్టణంలోని విజయ రెసిడెన్సీలో వైఎస్సార్‌సీపీ నాయి బ్రాహ్మణ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా అట్లూరి బాలసుబ్రహ్మం నూతనంగా బాధ్యలు స్వీకరించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సంర్భంగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాయి బ్రాహ్మణుల సమల్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు అన్యాయం చేసింని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరక్ష ్యం చేస్తోందని విమర్శించారు. అడుడుగునా బీసీలను మోసం చేస్తూనే ఉందని ఆరోపించారు. బీసీలను కేవలం బ్యాక్‌వర్డ్ క్లాస్‌గా కాకుండా బ్యాక్‌బోన్‌గా అభివర్ణించి వారికి అండగా నిలిచింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకత్వంలోని వైఎస్సార్‌సీపీ మాత్రమేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు జిల్లాలో బీసీలకు అన్ని విధాలుగా అండగా నిలిచామని, పాలనలోనూ వారికి సముచిత ప్రాధాన్యత కల్పించామని గుర్తుచేశారు. సెప్టెంబర్ 2న దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు డాక్టర్ గోపిరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా నియమితులైన నాయి బ్రాహ్మణ విభాగం పల్నా డు జిల్లా అధ్యక్షుడు అట్లూరి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నాయి బ్రాణ్మ సంఘం పెద్దలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ.ఎం. స్వామి, కరిముల్లా, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, నాయి బ్రాణ్మ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై ఏపీ జేఏసీ సమావేశం



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 1, ప్రభాతవార్త):** రాష్ట్ర ఏపీ జేఏసీ అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ ఆదేశాల మేరకు ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లి స్థానిక ఏపీఎన్‌జీఓస్ కార్యాలయంలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు సత్తెనపల్లి తాలూకా ఏపీ జేఏసీ చైర్మన్ పెండెం మణిరావు తెలిపారు .ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సత్తెనపల్లి తాలూకా పరిధి లోని ఏపీ జేఏసీ సభ్యుల ందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ సత్తెనపల్లి తాలూకా యూనిట్ కార్యదర్శి పి. రమేష్‌బాబు తెలిపారు.

## ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 1, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని 20వ వార్డులో మంగళవారం ఉదయం వివిధ విభాగాలకు చెందిన లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బందితో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు మారెళ్ల వీరాంజినేయులు (స్వామి), దివ్వెల శ్రీనివాసరావు, దాసరి తిరుపతిరావు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ఆర్యవైశ్య వృద్ధుడి అంత్యక్రియలకు రూ.36 వేల ఆర్థిక సహాయం



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 1, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని 20వ వార్డులో నివాసం ఉంటున్న నిరుపేద ఆర్యవైశ్య వృద్ధుడు చీమకుర్తి లక్ష్మీనారాయణ (73) ఆదివారం గుండె సంబంధిత అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలకు దాతల సహకారంతో రూ.36 వేల ఆర్థిక సహాయం అందించారు. పోతరమ్మ తల్లి దేవాలయం వెనుక బజారులో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల కోసం అప్పులు చేయడంతో చేతిలో డబ్బులు కూడా లేని పరిస్థితిలో మృతి చెందిన విషయం ఏపీ సత్తెనపల్లి ఆర్యవైశ్య సంఘం, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన మహాప్రస్థానం కమిటీ సభ్యులతో మాట్లాడి, మృతదేహాన్ని మహాప్రస్థానానికి తరలించేందుకు కుటుంబ సభ్యులకు సహకరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ వివిధ గ్రూపుల్లో సమాచారం అందించడంతో పలువురు దాతలు స్పందించి ఆర్థిక సహాయం అందించారు. దాతల నుంచి సమకూరిన రూ.36 వేల మొత్తాన్ని మంగళవారం ఉదయం మృతుని అల్లుళ్లు సతీష్‌కుమార్, బి. అశోక్‌కుమార్‌లకు న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్తూరి విశ్వేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్క దాతకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. దాతలు స్పందించడం వల్లే బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించగలిగామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా దాతల సహకారంతో కుటుంబాలకు మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్యవైశ్య సంఘాలు, ఆర్యవైశ్య సమాజం మొత్తం నిరుపేదలకు "మేమున్నాం" అనే భరోసా కల్పించినప్పుడే సంఘాలపై మరింత గౌరవం పెరుగుతుందని ఆయన అన్నారు.

## నందిపాడు మేజర్ కాలువకు నీటి విడుదల

**యడ్లపాడు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** నందిపాడు మేజర్ సాగర్ కాలువకు నీటిని విడుదల చేసినట్లు ఏఈ చిన్నరాణి తెలిపారు. ఐదు రోజుల పాటు కాలువకు నీటి విడుదల కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ నీటిని ఆయా గ్రామాల తాగునీటి అవసరాల కోసం వినియోగించుకునేలా తాగునీటి చెరువులను నింపుకునే అవకాశం ఉందన్నారు. గ్రామ పంచాయతీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తాగునీటి చెరువులను అవసరమైన మేరకు నింపుకోవాలని ఏఈ చిన్నరాణి సూచించారు.



# పల్నాడు జిల్లా వార్త



## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**సత్తెనపల్లి (సెప్టెంబర్ 1, ప్రభాతవార్త):** ప్రజా సేవలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని 27వ, 11వ వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరస రావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక పింఛన్లతో పేద కుటుంబాలకు ఆసరా

### మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్



**కారంపూడి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త ::** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సామా జిక పింఛన్లు పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోళ్ళ. సురేష్ యాదవ్ అనా న్నరు. మంగళవారం మండల ంలోని ఇనుప రాజు పల్లె గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమినేతలు సచి వాలయ సిబ్బందితో కలిసి గ్రామాలలో పింఛన్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా సిబ్బందితో కలిసి పెంచల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణపై అధికారులకు తురకపాలెం గ్రామస్తుల వినతి



**నకరికల్లు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** నకరికల్లు మండలం తురకపాలెం గ్రామంలోని చర్చి సమీపం నుంచి గ్రామ చివర ఉన్న వాటర్ ట్యాంకు వరకు నిర్మించాల్సిన సీసీ రోడ్డు వెడల్పును 4 మీటర్ల నుంచి 7 మీటర్లకు పెంచాలని గ్రామస్తులు పంచాతీరాజ్ అధికారులను కోరారు. వివరాలను గ్రామ మాజీ సర్పంచ్ నాగోతు దాసయ్య మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఈ రహదారిని 4.0 మీటర్ల వెల్పుతో సీసీ రోడ్డుగా నిర్మించేందుకు శాంక్షన్ మంజూరైనట్లు తెలిపారు. ఈ రహదారి మీదుగా చీమలమర్రి, చాగల్లు, కండ్లకుంట, చగ్లుండ్ల, దేచవరం, రూంపెగుంట్ల తదితర గ్రామాల ప్రజలు నరసరావుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. నరసరావుపేటకు ఈ మార్గం దగ్గరగా ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ రహదారిని వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. కాలేజీ బస్సులు, పాఠశాలలకు చెందిన బస్సులు సైతం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో 4 మీటర్ల వెడల్పు రోడ్డు సరిపోదని గ్రామస్తులు తెలిపారు .మంగళవారం రహదారి పరిశీలనకు వచ్చిన పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, డీఈఈ వై.వి. రమేష్, ఏఈఎం కిరణ్‌లకు తురకపాలెం మాజీ సర్పంచ్ నాగోతు దాసయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు తమ సమస్యను వివరించారు. ప్రజల రాకపోకలు, విద్యార్థుల బస్సుల ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు వెడల్పును 7 మీటర్లకు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను వారు కోరారు.

## ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లలో సబ్‌కోటా కల్పించాలి

### - బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు



**రొంపిచర్ల, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త ::** చట్టసభల్లో మహిళలకు కేటాయించే 33 శాతం రిజర్వేష న్లలో ఓబీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించి, విధాన నిర్ణయాల్లో వారిని భాగస్వాములను చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు డిమాండ్ చేశారు .నర సరావుపేటలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కదం నాగజ్యోతిని రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ జాడీ శ్వేత నిమించారు. బీసీ మహిళల్లో సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు గ్రాస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంఘాన్ని బలోపేతం చేయాలని శంకరరావు సూచించారు. బీసీల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం, రాజకీయ రిజర్వేషన్లు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, క్రీమీ లేయర్ తొలగింపు వంటి అంశాల పై ఉద్యమాలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. నూతన జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగజ్యో తిని నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి బీసీ సంఘాల నాయకు లు బిళ్ళ కంటి శ్రీనివాసరావు, బాదుగున్నల శ్రీనివాసరావు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, దేవళ్ల వెంకట్ ద్వారాకాశ్రీను, యమ మురళి, తన్నీరుసాం బయ్య, శ్రీరాములు, ప్రసన్న ,శేఖర్, విశ్వేశ్వరం రావు, డాక్టర్ రాంప్రసాద్, మడకశివప్రసాద్, పాండురంగారావు, పోతర్లంక రవికుమార్ లు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు కృష్ణవేణి డిగ్రీ విద్యార్థినులు ఎంపిక



**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 30న నకరికల్లు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జూనియర్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో మహిళల విభాగంలో కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన బి. సౌజన్య, కె. బుజ్జి జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు సెప్టెంబర్ 13, 14, 15 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆది బాబు, అధ్యాకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షి ంచారు.

## రేషన్ దుకాణాల్లో సర్వర్ల మొరాయింపు

**దుర్గి, సెప్టెంబర్1, ప్రభాతవార్త ;** గంటల తరబడి వేచి ఉన్న లబ్ధిదారులుకొత్తగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానంతో తలెత్తిన సమస్యలుడీలర్లకు అవగాహన లేక, ఆప్షన్ అర్థం కాక అయోమయం దుర్గి మండల వ్యాప్తంగా స్తంభించిన రేషన్ పంపిణీప్రభుత్వం రేషన్ అక్రమాలను అరికట్టేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం మొదటి రోజే లబ్ధిదారులకు, డీలర్లకు చుక్కలు చూపించింది. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సర్వర్లు పూర్తిగా మొరాయించడంతో నాలుగు నుండి ఐదు గంటల పాటు రేషన్ పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఎండలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర్థం కాని కొత్త ఆప్షన్ – డీలర్ల అయోమయం:సెప్టెంబర్ నెల రేషన్ పంపిణీ నుంచి ప్రతి బియ్యం బస్తాకు ఉన్న క్యూఆర్ కోడ్‌ను మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి, ఈపోస్ యంత్రంలో నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ కొత్త నిబంధన పెట్టింది. అయితే, ఈ కొత్త ఆప్షన్ స్కానర్ ఆప్షన్ పై డీలర్లకు ముందస్తుగా ఎలాంటి శిక్షణ గానీ, అవగాహన గానీ కల్పించలేదు. చాలా మంది డీలర్ల వద్ద ఆండ్రాయిడ్ ఫోన్లు లేకపోవడం, యాప్ లాగిన్ కాకపోవడంతో ఏం చేయాలో పాలుపోక డీలర్లు తీవ్ర ఇబ్బంది పడ్డారు. 5 గంటల పాటు నిలిచిన పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి డీలర్లు యాప్ ఓపెన్ చేసి స్కానింగ్ చేయడానికి ప్రయత్నించడంతో సర్వర్లపై తీవ్ర ఒత్తిడి పడి సర్వర్ డౌన్ అయింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సర్వర్లు పని చేయకపోవడంతో బస్తాల స్కానింగ్ సాధ్యం కాలేదు. దీనివల్ల రేషన్ షాపుల వద్ద గంటల తరబడి వేచి ఉన్న జనం, సర్వర్ రాదనే సమాధానంతో విసుగు చెంది వెనుదిరిగారు .

## పోలేరమ్మా చల్లగా చూడమ్మా

### భక్తజన సంద్రంగా పెదకూరపాడు



**పెదకూరపాడు ( సెప్టెంబర్ 1 ప్రభాతవార్త )** పెదకూరపాడులో పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంక్యలో తరలివచ్చి అమ్మవారి నిజరూపం దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. పాడిపంటలతో గ్రావాలు సుభీక్షంగా ఉండాలని ప్రార్థించారు. జ్వరాలు, వ్యాధులు విజృంభించకుండా ఉండాలంటూ పొంగళ్లు నివేదన చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వహణా కమిటీ ప్రతినిధులు జాగర్లమూడి రఘుపతిరావు, కృష్ణమనేని లక్ష్మయ్య, దర్శి శ్రీనివాసరావు, సుంకర మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.

## దేవరంపాడులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**రాజుపాలెం, సెప్టెంబరు 1 (ప్రభాతవార్త):** పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం దేవరంపాడు గ్రామంలో సెప్టెంబరు నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ప్రత్తిపాటి వెంకయ్య, సచివాలయ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి నారా లోకేష్ పర్యటనను జయప్రదం చేయండి

### టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే అరవిందబాబు పిలుపు



**నరసరావుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త ::** రాష్ట్ర ఐటి, విద్యా శాఖల మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బుధవారం నరసరావుపేటలో పర్యటించనున్న నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపునిచ్చారు. మంగళవారం నరసరావుపేట గుంటూరు రోడ్డులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్యాడర్ తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఎమ్మెల్సీ, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్ బెందుల తిరుమల నాయుడు (బీటీ నాయుడు), రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనాదేవి, నియోజకవర్గ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ, సెప్టెంబరు 2న జేఎన్టీయూకే లో వసతి గృహాల ప్రారంభోత్సవం, టిడిపి నియోజకవర్గస్థాయి క్యాడర్ మీటింగ్ లకు నారా లోకేష్ నరసరావుపేటకు రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. వేలాది మందితో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ పర్యటనకు అన్ని ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరానున్నారని తెలిపారు. పర్యటన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఇప్పటికే పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, వైసీపీపై విమర్శలు చేశారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల క్రెడిట్‌ను మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిని క్రెడిట్ చోరీగా ఆయన అభివర్ణించారు. వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి, పూర్తి చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని గ్రామాలు, మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో తరలిరావాలని కోరారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే డా. చదలవాడ



**నరసరావుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త ::** కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. మంగళవారం నరసరావుపేట మున్సిపాలిటీలో 28వ వార్డులో జిల్లా స్థాయి పింఛన్ల పంపిణీ కార్యమ్రంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం ఉదయం 10.30 గంటలకే జిల్లా వ్యాప్తంగా 80 శాతం పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సాయంత్రానికి నూరు శాతం పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లాలో అర్హులైన సుమారు 2.26 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలారూ.116 కోట్ల మేర పింఛన్లు అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమయ్వంతో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ ప్రక్రియను చేపడుతున్నారని తెలిపారు. శాసన సభ్యులు చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా దాదాపు రూ.3 వేల కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు.

## నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో వైభవంగా గ్రాడ్యుయేషన్ డే



**నరసరావుపేట టౌన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త::** నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో 2025-26 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్వాలి ఫౌండర్ అండ్ సీఈఓ శ్రీ నవీన్ కుమార్ లింగా ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ లింగా మాట్లాడుతూ వేగంగా మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలను (స్కిల్స్) అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. ఇన్నోవేటివ్ థింకింగ్‌తో కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని కెరీర్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులుతమభవిష్యత్తును తీర్చిదిద్దకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ 2025, 2026 సంవత్సరాల్లో వినిది విద్యార్థులు 1,380కు పైగా ప్లేస్‌మెంట్లు సాధించడం కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. .అనంతరం పట్టభద్రులకు డిగ్రీలను ప్రదానం చేసి గ్రాడ్యుయేషన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మిట్టపల్లి బి.వి. సత్యనారాయణ, మిట్టపల్లి కిశోర్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. డి. సునీల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వి. మహేష్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం,పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### రూ.98.60 లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రం,స్వర్ణ గ్రామ కార్యాలయం ప్రారంభం



**మాచర్ల టౌన్ సెప్టెంబరు01 ప్రభాతవార్త:** ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు .మంగళవారం మాచర్ల మండల పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా నాగులవరం పంచాయతీ పరిధిలోని చెంచు కాలనీలో ఐటీడీఏ శ్రీశైలం ఆధ్వర్యంలో రూ.55 లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రావడంతో చెంచు కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు. అనంతరం కొప్పునూరు గ్రామంలో రూ.43.60 లక్షల నిధులతో నిర్మించిన స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో ప్రజలకు అందుతున్న సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గుండాల లక్ష్మీ శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు వీరాస్వామి, కొల్లూరి వెంకట్రామయ్య, వస్తపూరి శ్రీరామూర్తి, గొట్టిముక్కల బాబు, శీలం బైయమ్మ, గండిబోయిన వెంకటేశ్వర్లు, డీలర్ వెంకటేశ్వర్లు, వట్టికుండ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలలో పెద్ద కొదమగుండ్ల విద్యార్థిని



**కారంపూడి (సెప్టెంబర్ 1, ప్రభాతవార్త):** అమరావతి ఛాంపియన్ షిప్ వాలీబాల్ పోటీలలో మండలంలోని పెద్ద కొలమగుండ్ల జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని సత్తా చాటింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించింది. అందులో భాగంగా బాలికల అండర్ 17 వాలీ బాల్ పోటీలలో పదవ తరగతి విద్యార్థిని ఏరువ. . లక్ష్మీదేవి శ్రీ జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం రావడం జరిగింది. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్ణయ్య అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కాలేశ్వరం, ఉపాధ్యా యులు అభినందించారు.

## భవిష్యత్తుకు భరోసా.. సామాజిక పింఛను

### ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడి



**మాచర్ల టౌన్ సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** సామాజిక పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన పేదలకు భవిష్యత్తుపై భరోసా కల్పిస్తున్నాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. మంగళవారం మాచర్ల పట్టణంలోని 18,19వ వార్డుల్లో అర్హులైన లబ్ధిదారులకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరా యలు ,ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సామా జిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుం టున్నామని వారు తెలిపారు. పేదలు, వృ ద్ధుల ు, మహిళలు, దివ్యాంగులకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమంతో పాటు అభివృ ద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్ఐసీ భీమా వారోత్సవాలు ప్రారంభం



**వినుకొండ, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న బీమా వారోత్సవాలు వినుకొండలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి వినుకొండ ఎంఆర్ఓ సురేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం డి.శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ వై. భార్గవ్, ఏవో కె. పవన్, ఐసీఈయూ కార్యదర్శి వై. రాము పాల్గొన్నారు. బీమా వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆహ్వానించి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో బీమా, పొదుపు, ఆర్థిక భద్రతపై అవగాహన కల్పించారు. ఏడు దశాబ్దాలుగా కోట్లాది కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ, ప్రజ ల నమ్మకాన్ని చూరగొన్న సంస్థగా ఎల్ఐసీ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఓ ఎన్. బర్మా నాయక్, డీఓ కె. నాగయ్య, సిఎల్ఐఏ ఎం. రమణారెడ్డి, ఏజెంట్ యూని యన్ నాయ కులు కోటి రామమూర్తి, బి. వెంక టేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పలువురు ఎల్ఐసీ ఏజెంట్లు, సిబ్బంది కూడా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని వారోత్సవాలకు తమ మద్దతు తెలిపారు. సెప్టెంబర్ 1 నుండి 7వ తేదీ వరకు జరిగే ఈ బీమా వారోత్సవాల్లో విద్యారు ధులు, ఉపాధ్యాయులు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మంత్రి లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి

### వినుకొండ తెదేపా నాయకులు పిలుపు



**వినుకొండ, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరగనున్న మంత్రి నారా లోకేష్ పర్యటన కార్యక్రమానికి పల్నాడు జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి మన్నెం శివనాగ మల్లేశ్వరరావు (మల్లిబాబు) పిలుపు నిచ్చారు. మంగళవారం చీఫ్‌విప్ కార్యాలయము నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి యువత, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్నాడు జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోందని మల్లిబాబు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. పార్టీ శ్రేణులు, యువత, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఐక్యతను చాటడంతో పాటు కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో గుర్తుండిపోయేలా విజయవంతం చేయాలని మల్లిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో బొంకూరు రోశయ్య, పివి సురేష్ బాబు, పత్తి పూర్ణ, సౌదాజానీ, గట్టుపల్లి శీను, రియల్ ఎస్టేట్ జానీ, మోటుమర్రి నరసింహారావు, గంధం సుబ్బారావు, వీరగంధం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నారా లోకేష్ నరసరావుపేట పర్యటనను విజయవంతం చేయండి

### పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలి నక్కా ఆనందబాబు



**సత్తెనపల్లి (సెప్టెంబర్ 1, ప్రభాతవార్త):** సెప్టెంబర్ 2, 2026న గౌరవ మంత్రి శ్రీ నారా లోకేష్ నరసరావుపేటలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనను విజయవంతం చేసేందుకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని మాజీ మంత్రి, వేమూరు శాసనసభ్యులు శ్రీ నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులతో జనసమీకరణ, కార్యక్రమ ఏర్పాట్లు, నాయకులు-కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. నరసరావుపేటలో నిర్వహించనున్న నారా లోకేష్ పర్యటనకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంఘీభావం తెలియజేయాలని నక్కా ఆనంద బాబు సూచించారు. పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి పర్యటనను ఘనవిజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్యటన తేదీ: సెప్టెంబర్ 2, 2026 పర్యటన ప్రదేశం: నరసరావుపేట, పల్నాడు జిల్లా ముఖ్య కార్యక్రమాలు: రివిగిగేరీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో హాస్టళ్ల ప్రారంభోత్సవం, విద్యార్థులతో ముఖాముఖి, తెలుగుదేశం పార్టీ క్యాడర్‌తో సమావేశం.

MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 11:07 Page 1




# బాపట్ల జిల్లా వార్త



## విధులను బహిష్కరించిన న్యాయవాదులు

**రేపల్లె, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** న్యాయవాదులకు రక్షణ,భద్రత కల్పించేందుకు అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్,సీనియర్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు.న్యాయవాదుల సంక్షేమానికి




ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకా పూర్ణచంద్రరావు,ఉపాధ్యక్షుడు యెండూరి రాజేష్,ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి జాన్ హనోక్,క్రీడా సాంస్కృతిక విభాగం కార్యదర్శి ఆళ్ళ సూరిబాబు,కార్యవర్గ సభ్యులు కొలుసు వీరరాఘవులు,మోర్ల కృష్ణారామ్,మాదాసు పవన్ కుమార్,బి.ఉదయశంకర్,ఎస్.వెంకట శివకుమారి,కె.కాకమ్మ,గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్,బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డి.సాంబశివరావు,పుప్పాల ఐజ్,కె.సాంబశివరావు, ఎం.సుబ్బారావు,ఆర్.నాగరాజు,చింతల సురేష్,ఆయుబ్‌ఖాన్,భూషణం, హరి,యు .శ్రీనివాసరావు,బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పింఛన్లతో ప్రయోజనం : అనగాని శివప్రసాద్

**రేపల్లె, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వృద్ధాప్య,వితంతు,వికలాంగ పెన్షన్ల వలన పేదలకు ప్రయోజనం చేకూరుతున్నదని రేపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త అనగాని శివప్రసాద్ అన్నారు.మంగళవారం రేపల్లె పురపాలక సంఘంలోని 27వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ పెన్షన్ల సొమ్ము పంపిణీతో పెన్షనర్ల కుటుంబాలు సంతృప్తి చెందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వలన కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజాదరణ పెరుగుతున్నదని ఆయన తెలిపారు.రేపల్లె నియోజకవర్గం అభివృద్ధికి పూర్తిస్థాయిలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చర్యలు తీసుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు,తెలుగుదేశం పార్టీ నాయకులు డొక్కు శ్రీనివాసరావు(బుజ్జి),షేక్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

**భట్టి ప్రోలు (రేపల్లె), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** చట్టాలపై విద్యార్థులు ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని భట్టి ప్రోలు ఎస్ఐ కె.అమీర్ అన్నారు.మంగళవారం భట్టి ప్రోలులోని శ్రీ విశ్వశాంతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో వ్యవహరించాలన్నారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తత,సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,రహదారి భద్రతా నియమాలు,దురలవాట్లకు దూరంగా ఉండటం పట్ల అవగాహన కల్పించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.కరస్పాండెంట్ ఎం.పి.వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక చైతన్యం తీసుకువచ్చేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ వెంకటప్పయ్య,ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## పొలం పిలుస్తోంది

**భట్టి ప్రోలు (రేపల్లె), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు మండలంలోని పెదలంక,వెల్లటూరు గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భట్టి ప్రోలు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమాన్ని రైతులు పూర్తి చేసుకోవాలని చెప్పారు.పంట నమోదు వలన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.




## తెదేపా నేత అల్లంశెట్టి నాగరాజు మృతి

**వేమూరు సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త) :** టిడిపి నాయకులు అబ్బన గూడవల్లి మాజీ సర్పంచ్ అల్లంశెట్టి భాగ్యలక్ష్మి భర్తగారైన అల్లంశెట్టి నాగరాజు (47)సోమవారం రాత్రి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. నాగరాజు భాగ్యలక్ష్మి అబ్బనగూడవల్లి గ్రామానికి సర్పంచ్‌గా పని చేశారు. నాగరాజుకు భార్య, కుమారుడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పార్టీ నాయకులు డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, జొన్నలగడ్డ విజయబాబు, టిడిపి నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు కుటుంబాన్ని పరామర్శించారు.



## ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి

**నిజాంపట్నం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య, వికలాంగ, వితంతు తదితర పెన్షన్లు పేద బడుగు బలహీనవర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులు ఒకటవ తారీఖు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటారని తెలిపారు. పెన్షన్ అందిస్తేనే వారికి ఆ నెల భుక్తి లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నదన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో కూటమి నాయకులు, కార్యకర్తలు పింఛన్ల ను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సాగునీటి వినియోగదారులసంఘం అధ్యక్షుడు నక్కల పోలిరాజు, ఖాదర్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## అమెరికన్ ఫ్లాగ్ ఫుట్బాల్ కి ఎంపికైన అమరావతి గురుకులం విద్యార్థులు

**చుండూరు సెప్టెంబర్1(ప్రభాతవార్త):** చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన అమరావతి గురుకులం విద్యార్థులు, అమెరికన్ ఫ్లాగ్ ఫుట్బాల్ కి ఎంపికయ్యారు .సెప్టెంబర్ 12మరియు13తేదీల్లో కాకినాడ లో జరిగే స్టేట్ లెవెల్ కాంపిటీషన్ లో పాల్గొంటారని డిస్ట్రిక్ట్ సెక్రటరీ అమర్నాథ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.ప్రమీల,వైస్ ప్రిన్సిపాల్ జి.ఉదయకుమారి,పి.డీ ఆర్.నిర్మల,జయశ్రీ పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

### -ఎమ్మెల్యే ఆనందబాబు

**వేమూరు సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త) :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలియజేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పోతుమర్రు గ్రామంలో




పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిఆరులకు ఇంటింటికి తిరిగి పెన్షన్లు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆనందబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలకు రాష్ట్రంలోనే కూటమి ప్రభుత్వం అత్యధిక మొత్తంలో ఖర్చు చేస్తుందన్నారు. అదే విధంగా సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత ం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలన అందిస్తున్న చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ పార్టీ అబ్జర్వర్ వెంకటేశ్వరరాజు, ఎంపీడీవో రవికుమార్, తహశీల్దార్ పార్వతి, మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య,యాడ్ వైస్ ఛైర్మన్ అమ్మిశెట్టి కిషోర్, పార్టీ నాయకులు కూచిపూడి రవికాంత్, గోసే రవి, షేక్ అనీఫ్, బండారు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### తూనుగుంట్ల సాయిబాబా

**భట్టి ప్రోలు (రేపల్లె), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ పాలనలో అర్హులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా చెప్పారు.మంగళవారం భట్టి ప్రోలులో



పెన్షన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు,దివ్యాంగులు,పూర్తిగా వైకల్యం ఉన్నవారు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా 1వ తేదీ పెన్షన్లు అందుతున్నాయని సాయిబాబా పేర్కొన్నారు.రాష్ట్రంలోని పేదలకు గౌరవప్రదమైన జీవితాన్ని కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు.ఆయా వర్గాల పెన్షన్‌దారులకు నెలకు రూ.4 వేల నుండి రూ.15 వేల వరకు ఆర్థిక ప్రయోజనం లభిస్తున్నదని ఆయన వివరించారు.పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పాలకులు,అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు.1వ తేదీ సెలవు అయితే ముందు రోజే పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని సాయిబాబా స్పష్టం చేశారు.ప్రభుత్వం పట్ల పెన్షన్‌దారులు కృతజ్ఞతా భావంతో ఉండాలని ఆయన కోరారు.వేమూరు నియోజకవర్గం అభివృద్ధికి,ప్రజల సమస్యల పరిష్కారానికి మాజీ మంత్రి,శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి పార్టీల శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్‌దారు మరణిస్తే వెంటనే స్పౌజ్‌కు పెన్షన్

**నిజాంపట్నం, సెప్టెంబరు1, ప్రభాతవార్త:** కుటుంబంలో పెన్షన్ తీసుకుంటున్న భర్త, భార్య మరణించిన వారి జీవిత భాగస్వామికి వెంటనే పెన్షన్‌ను మంజూరు చేస్తామని ఎంపిడిఓ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తుపల్లిలో భర్త మరణించినందున భార్య మరకా సుందరమ్మకు నెలరోజులలో పెన్షన్ మంజూరు చేసి అందిస్తున్నామని ఆమె తెలిపారు. కష్టకాలంలో ఉన్న పేదలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం పిఎసిఎస్ అధ్యక్షుడు ఎం నరేష్, నాగరాజు, పంచాయితీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

**తెనాలి సెప్టెంబర్1(ప్రభాతవార్త):** రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్ర ప్యారిస్ తెనాలి వారి ఆధ్వర్యంలో ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారి సహకారంతో మంగళవారం సోమసుందరపాలెం పంచాయతీ ఆఫీస్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి 100కు పైగా కంటి సమస్యలు ఉన్నవారు హాజరయ్యారు వారిలో సుమారుగా 60 మందికి శుక్లాలు ఆపరేషన్




చేయవలసిఉంది. వారిని రేపు గూడవల్లి ఎల్వి ప్రసాద్ వైద్యశాలకు తీసుకెళ్లి శుక్లాల ఆపరేషన్ ఉచితంగా చేయబడుతుంది. క్లబ్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ గాజుల విజయసారధి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మున్నంగి శ్రీనివాసరావు, క్లబ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ మైనేని రత్న ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ జాస్తి వినోద లక్ష్మి, గాజుల శ్రీనివాస్, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సిబ్బంది దామర్ల సరళ, కొల్లూరు సుచిత్ర, కౌలురపు పవన్ కుమార్, గ్రామ నాయకులు కేసన కోటేశ్వరరావు, వాకా అర్జున్, కేసును హనుమంతరావు పాల్గొన్నారు. కార్య కార్యక్రమాన్ని క్లబ్ జీఎస్ఆర్ ఈదర వెంకట పూర్ణ చంద్ పరివేక్షించారు.

## రహదారి విస్తరణ పనులకు కలెక్టర్ ఆదేశం

**రేపల్లె, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రేపల్లె-పెనుమూడి రహదారి మార్గంలోని బాణాసంచా గోదాము వద్ద తరచూ రహదారి ప్రమాదాలు చోటుచేసుకుని మృతుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రహదారి విస్తరణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని మంగళవారం బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్



వి.వినోద్‌కుమార్‌ను రేపల్లె నియోజకవవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త అనగాని శివప్రసాద్ ఫోన్‌లో కోరారు.స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ రహదారి వెడల్పు పనులను ప్రారంభించాలని రహదారుల భవనాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.తొలుత అనగాని శివప్రసాద్ ప్రమాదాలు జరుగుతున్న రహదారి ప్రాంతాన్ని పరిశీలించారు.ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి,విద్యుత్,పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**రేపల్లె, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవి సాయి శ్రీవాణి కోరారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం పొందేలా పోలీస్ అధికారులు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయస్థానం పరిధిలోని పోలీస్ స్టేషన్ల అధికారులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రేపల్లె, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్‌డిఎస్ఎస్ స్కీం కింద 33కెవి నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు,మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రేపల్లె విద్యుత్ శాఖ డిఇఇ డి.శ్యామ్ సుధాకర్ బాబు మంగళవారం తెలిపారు.మున్సిపల్ ఆఫీస్ రోడ్,చంద్రమౌళి ఉద్యానవనం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**భట్టి ప్రోలు (రేపల్లె), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** భట్టి ప్రోలులోని శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్ర వారోత్సవ కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బి.అరుణకుమారి ఆధ్వర్యంలో మంగళ వారం కంచి కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాత్యాయనుడు అనే మహర్షి పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకునేం దుకు తపస్సు చేశాడన్నారు.ప్రత్యక్షమైన పరమశివుడు వరం కోరుకోమనగా అమ్మవారు తన కూతురుగా లభించాలని కోరుకున్నాడని వివరించారు.పసిపాపలా ఆయన ఒడిలోకి అమ్మవారు వచ్చారని కాత్యాయనుడిచే పెంచబడిన అమ్మకు కాత్యాయని అనే పేరు వచ్చిందని అరుణకుమారి తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్త కృష్ణకుమారి,దరిశి శశికళ,దీపిక,మానేపల్లి శైలజకుమారి,పెండ్యాల భాగ్యలక్ష్మి,మాజేటి ప్రభావతి,కోట రేఖ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## దేశంలో ప్రజాస్వామ్యం ఉందా?

### కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ ఛైర్మన్ యార్లగడ్డ గోపి

**వేమూరు సెప్టెంబర్ 1, (ప్రభాతవార్త) :** దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుల వివక్ష విపరీతంగా పెరిగిపోయిందని, అదే విధంగా ప్రత్యర్థి రాజకీయ నాయకులపై మరియు పార్టీలపై కూడా ప్రతీకార రాజకీయాలు పెరిగిపోయాయని, అసలు దేశంలో ప్రజాస్వామ్యం ఉందా అని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ఛైర్మన్ యార్లగడ్డ గోపి విమర్శించారు. మంగళవారం భట్టిప్రోలులో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 8వ తేదిన ఉత్తరాఖండ్‌లోని హల్ద్వాని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విజయ్ శంకనాద్ అనే భారీ బహిరంగ ర్యాలీ నిర్వహించారని, ఆ కార్యక్రమం అనంతరం 10వ తేదిన శ్రీరామసేవ అనే స్థానిక సంస్థకు చెందిన కొందరు వ్యక్తులు ఆ వేదికపై హవనం నిర్వహించి గంగాజలంతో శుద్ధి చేశారని, వారిపై బిజెపి ప్రభుత్వం ఎలాంటి కేసు ఇప్పటి వరకు నమోదు చేయలేదని తెలియజేశారు. దీనిపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ ఘటనను తీవ్రంగా తపు పట్టారని, అదే విధంగా ఇది దేశంలోని దళితులందరినీ అవమానించడమేనని పేర్కొంటూ బాధ్యులుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒక దళిత నాయకుడుపై వివక్షతో శుద్ధి కార్యక్రమం నిర్వహించిన వారిపై కూడా నమోదు చేసి (ఎఫ్ఐఆర్)నమోదు చేయకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయండి అని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఏంటి అని ప్రశ్నించారు. దేశంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా వివక్ష చూపిస్తూ శుద్ధి కార్యక్రమం నిర్వహించిన వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేని పక్షంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని యార్లగడ్డ గోపి హెచ్చరించారు.



## వైద్యసేవలో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న డాక్టర్ చందు సాంబశివుడు

**తెనాలి సెప్టెంబర్1,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలో వైద్యరంగంలో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ చందు సాంబశివుడు. 1986 సెప్టెంబర్ 1వ తేదీన తెనాలి పట్టణం మారీస్ పేట లో శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ పేరుతో ప్రముఖ వైద్యులు డాక్టర్ చందు సాంబశివుడు వైద్యశాలను ప్రారంభించి నేటికి నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్నారు. ఆనాటి గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు ఇతర సహచర వైద్యులు రాజకీయ ప్రముఖులైన సింగం బసవపున్నయ్య మరియు ఇతర సన్నిహితుల సమక్షంలో ప్రారంభోత్సవం జరుపుకున్న తొలి నెలలోనే ఎన్నో క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించి తెనాలి పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో విశేషమైన పేరు గడించారు.



## ఆక్రమణలను తొలగించండి : మున్సిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్1(ప్రభాతవార్త):** పురపాలక సంఘ పరిధిలో ఆక్రమణ లను తొలగించాలని,మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు.పట్టణం లోని 4 వ వార్డు నందులపేట, నరేంద్ర దేవ్ కాలనీ,ఐతనగర్ తదితర ప్రాంతాల్లో అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ తో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో గల కమ్యూనిటీ టాయిలెట్లు, పోలింగ్ కేంద్రాలు, చెరువులు, ప్రతిపాదిత నూతన కాలువల నిర్మాణ ప్రాంతాలను పరిశీల్నిచీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన ఆక్రమణ ల తొలగింపు కు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సిబ్బంది నీ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.అనంతరం పట్టణం లోని 7వ వార్డు లో గల మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల బాలుర ఉన్నత పాఠశాల లో జరుగుతున్న అభివృద్ధి పనులను, ఆ ప్రాంతంలో గల పోలింగ్ స్టేషన్లను అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ తో కలిసి పరిశీలించారు.



# తిరుమల సమాచారం



## తిరుమలలో జలాశయాల డ్యామ్‌ల పటిష్టతపై ఆరా

### వారంరోజుల్లో పనులు పూర్తికావాలి: టిటిడి అదనపు ఇఒ చౌదరి

**తిరుమల,సెప్టెంబరు1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల డ్యామ్‌ల పటిష్టతపై,నీటి నిల్వలపై టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమీక్షించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, ఇంజనీరింగ్ పనులు వారంరోజుల్లో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ పనుల పురోగతిపై చౌదరి మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుమలలోని సుధర్మ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో సివిల్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ తదితర విభాగాలకు సంబంధించిన పనుల పురోగతిని పరిశీలించారు.టిటిడి ఇన్‌ఛార్జి సిఇ మనోహరం ఇంజినీరింగ్ పనుల పురోగతిని అదనపు ఇఒకు వివరించారు. శ్రీవారి ఆలయం, మాడ వీధులు, గ్యాలరీల్లో వైట్‌వాషింగ్, పెయింటింగ్, బారికేడింగ్, మరమ్మతులు, అభివృద్ధి పనులు, పుష్కరిణి గ్రిల్స్ పునరుద్ధరణ, వాహనాల ఫిట్‌నెస్, వివిధ డ్యామ్‌లలో నీటి నిల్వల స్థాయి,విద్యుత్ అలంకరణ, వివిధ విశ్రాంతి భవనాల్లో ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ తదితర పనులు దాదాపు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల నాటికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సివిల్ ఇంజినీరింగ్ పనులన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అదనపు ఇఒ అధికారులను ఆదేశించారు. అనంతరం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న వేంకటేశ్వర మ్యూజియానికి సంబంధించిన పనుల పురోగతిని ఆయన సమీక్షి ంచారు. ఈ సమావేశంలో ఎస్ఇలు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, ఇఇలు శ్రీనివాసులు, సుధాకర్, డిఇ చంద్రశేఖర్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



## అంతామంచి జరగాలని వేడుకున్నా

### తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**తిరుమల,సెప్టెంబరు 1 ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అంతామంచి జరగాలని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబంతో కలసి ఆయన శ్రీవారి అష్టదళపాదపద్మారాధనసేవలో పాల్గొని అనంతరం స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## 18నుండి 20వరకు కొండకు ద్విచక్రవాహనాలు నిషేధం

**తిరుమల,సెప్టెంబరు 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈనెల 15వతేదీ నుండి జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు ముందురోజునుండి 48గంటలు పాటు ద్విచక్రవాహనాలు నిషేధం అమలు చేస్తున్నారు. దేవదేవుని బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు సెప్టెంబర్ 19వతేదీ శనివారం రాత్రి అత్యంత విశిష్టమైన గరుడసేవకు భక్తులు దేశంనలుమూలల నుండి విచ్చేస్తారు. అంతేగాక తిరుపతి పరిసరాల ప్రజలు కూడా భారీగా తరలివస్తారు. దీన్ని దృష్టిలో వుంచుకుని భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా సెప్టెంబర్ 18వతేదీరాత్రి 9గంటల నుండి 20వతేదీ ఉదయం 6 గంటల వరకు తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనాలు టిటిడి పూర్తిగా నిషేధించింది. తిరుమల,తిరుపతి స్థానికులు,భక్తులు సహకరించాలని కోరారు.



## కళాకారుల ప్రతిభకు పట్టం


### నాదనీరాజనంకోసం ఎంపికలో పారదర్శకత

**తిరుమల,సెప్టెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి పాదాలచెంత తిరుమల ఆలయం ఎదురుగా భక్తితో నృత్యం,పదసంకీర్తన,నీరాజనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విచ్చేసే కళాకారుల ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసేందుకు టిటిడి ఎస్వీబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ కసరత్తు చేపట్టారు. పూర్తిస్థాయిలో ఆలయం ముందు నాదనీరాజనం వేదికపై పాల్గొనే కళాకారులను పారదర్శకతతో ఎంపికచేయాలని కమిటీకి సూచించారు. ఎస్వీబిసి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌వర్మ తొలిసారిగా నాదనీరాజనం కార్యక్రమానికి పాల్గొనే కళాకారుల కళాబృందాల ఎంపికపై పూర్తిస్థాయిలో అవగాహనతో ఛానల్ సాంకేతిక నిపుణులతో మంగళవారం సమావేశమయ్యారు. కళా, సాంస్కృతిక రంగాల్లో నిపుణులైన ఎంపిక కమిటీ సభ్యులు ఈ సమావేశంలో ఎస్వీబిసికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కళాబృందాలు పంపిన వీడియోలను వీక్షి ంచి, వారి ప్రతిభ, ప్రదర్శన స్థాయి, కార్యక్రమానికి అనుకూలతను పరిశీలించారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో నాదనీరాజనం కార్యక్రమంలో ప్రదర్శనలు ఇవ్వనున్న కళాబృందాలను కమిటీ ఎంపిక చేసింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కళాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, వివిధ విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాలపై కూడా చర్చించారు. ఈ ఎంపిక కమిటీలో సభ్యులు ఎస్వీబిసి ఛైర్మన్, బి. శ్రీధర్ వర్మ ,వయోలిన్ విద్వాం సురాలు పద్మశ్రీ కన్యాకుమారి అవసరాల , భరతనాట్యం కళాకారిణి పద్మశ్రీ ఆనంద శంకర్ జయంత్, కూచిపూడి కళాకారుడు వేదాంతం రాధేశ్యామ్ , ముడిగొండన్ ఎస్.ఎన్. రమేష్ - వీణ విద్వాంసుడు, కైవల్య కుమార్ గురవ్ - హిందుస్తానీ శాస్త్రీయ గాయకుడు,,నందకిశోర్ కపోటే - కథక్ కళాకారుడు, ఎస్వీ మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్వీబిసి కన్వీనర్ వ్యవహరిస్తారు. సమావేశం అనంతరం వివిధ కళా రంగాల్లో నిపుణులైన సెలెక్షన్ కమిటీ సభ్యులను ఎస్విబిసి చైర్మన్ బి శ్రీధర్ వర్మ శాలువాలతో,శ్రీవారి ప్రసాదాలతో సత్కరించారు.

## అంచనాలకు తగ్గని వెంకన్న హుండీ ఆదాయం!

# ఆగస్టు నెల కానుకల రాబడి రూ.138కోట్లు

**తిరుమల,సెప్టెంబరు 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సంతృప్తికరంగా దర్శించుకుంటున్న భక్తుల సంఖ్యకు రెట్టింపుగా, స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంతకంతకూ రికార్డు సృష్టిస్తోంది. జులై నెలలో తిరుమలకు చేరుకున్న భక్తులు మొక్కుబడుల రూపంలో హుండీకి సమర్పించిన కానుకలు 134.12కోట్లు రూపాయలు కాగా గడచిన ఆగస్టు నెలలో 137.44కోట్లు రూపాయలు ఆదాయం లభించడం టిటిడి చరిత్రలో నెలనెలకో ప్రత్యేకత సంతరించుకుంటోంది. ఈ ఏడాది మార్చినెలనుండి ఆగస్టువరకు వడ్డీకాసుల వెంకన్నకు చేకూరిన ఆదాయం వరుసగా పరిశీలిస్తే కోటాదిమంది హిందు భక్తులు దేశవిదేశాల్లో స్థిరపడిన వాళ్ళంతా ఏడుకొండలకు చేరుకుని తమ ఇష్ట దైవాన్ని, కులదైవాన్ని దర్శించుకోవడం అర్థమవుతుంది. ఈ ఏడాది మేనెలలో వెంకన్న హుండీద్వారా ఖజానాకు 114కోట్లు రూపాయలు ఆదాయం లభించగా, జూన్‌లో 125కోట్లు, జులై నెలలో 134.12కోట్లు, ఆగస్టునెలలో 137.44 కోట్లు రూపాయలు ఇలా వరుసగా నాలుగునెలలు వందకోట్లురూపాయలు పైగానే దాటి రికార్డు స్థాయిలో నమోదైంది. ఆగస్టు నెలలో కూడా 24.56 లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు



చేరుకుని వెంకన్నను దర్శించుకోగా కానుకల ద్వారా హుండీకి ఆదాయం 138కోట్లు రూపాయలు లభించడం ప్రత్యేకత. గడచిన ఆగస్టు నెలలో 18వతేదీ 6.12కోట్లు రికార్డుస్థాయిలో హుండీ ఆదాయం చేకూరింది. ఇక 10వతేదీ 5.36కోట్లు, 5న 5.46కోట్లు, 19న 4.94 కోట్లు, 9న 4.59కోట్లు ఇలా సరాసరి రోజువారీగా 4 కోట్ల రూపాయలు వరకు కానుకల ద్వారా హుండీకి చేరింది. నెలవారీగా ఏడుకొండలకు చేరుకుంటున్న భక్తుల సంఖ్య సరాసరి 25లక్షలమంది వరకు ఉంటుండగా,ఆ భక్తులు సమర్పించుకుంటున్న మొక్కుల ద్వారా వడ్డీకాసులవాడి ఖజానాకు కాసుల వరద వెల్లువెత్తుతోంది.ప్రస్తుత సెప్టెంబర్‌మాసంలో కూడా దేవదేవుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనుండటంతో భక్తులు భారీగా చేరుకునే అవకాశం వుంది. హుండీ కానుకలు మరింత రెట్టింపయ్యే అవకాశం ఉందని టిటిడి వర్గాలు అంచనావేస్తున్నాయి.

**రెట్టింపవుతున్న శ్రీవారి భక్తులు :** కోట్లాదిమంది భక్తుల ఇలవేల్పుగా కీర్తింపబడుతున్న ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, తమ మొక్కులు తీర్చుకునేందుకు తిరుమలకు సరాసరి నెలవారీగా 23లక్షలమందివరకు భక్తులు వస్తున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య రెట్టింపవుతూ దాని ప్రభావం హుండీపై కూడా గణనీయంగా చూపుతోంది. సాధారణరోజులు, వారాంతపు తేడా లేకుండా సరాసరి 70వేలమందిపైగా భక్తులు తిరుమలకు వస్తున్నారు. రోజువారీగా భక్తుల సంఖ్యను గమనిస్తే ఆగస్టు 7,8తేదీల్లో 87,658,87,179మంది భక్తులకు దర్శనం చేయించారు. ఇలా వరుసగా సరాసరి 75వేల మంది వరకు భక్తులు దేవదేవున్ని దర్శనం చేసుకున్నారు. గత ఐదునెలలుగా ఊహించని రీతిలో 120-140కోట్ల రూపాయలు పైగానే వెంకన్నకు హుండీ ఆదాయం చేకూరుతుండటంతో 2027-28 వార్షిక బడ్జెట్ మార్పులు ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.

# టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగులకు స్మార్ట్ ఐడి కార్డులు

### దర్శనం,లడ్డూ సదుపాయం

**తిరుమల,సెప్టెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో ఏళ్ళతరబడి వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు స్మార్ట్ కార్డులు జారీకానున్నాయి. ఇందుకోసం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర కార్మికనేతలతో సమావేశమై వారివారి హోదాను బట్టి ఈ స్మార్ట్ ఐడి కార్డులు ఇవ్వనున్నారు. ఈ కార్డుల వల్ల ప్రతినెలా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సబ్సిడీపై 10లడ్డూలు, మూడునెలలకోసారి సుపథం మార్గంద్వారా శ్రీవారి దర్శనం తదితర సౌకర్యాలు కలగనున్నాయి. ఎన్నో ఏళ్ళుగా పని చేస్తున్న ఈ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఒక అవకాశం కల్పించింది. అనేక సదుపాయాలు కూడా పొందనున్నారు. సుమారు ఐదువేలమంది వరకు ఈ విభాగాల సిబ్బంది లబ్ధిపొందడానికి వీలుకలిగింది. ఉద్యోగుల విధులను బట్టి వేర్వేరు రంగుల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డుల ముద్రణ జరుగుతోంది. త్వరలోనే ఈ కార్డులు వారికి అందనున్నాయి.

# ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక ఎన్నికలు జరుగుతాయి

### మంత్రి పొంగూరు నారాయణ

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపాల్టీలలో రూ.3300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, కోర్టుల్లో కేసులు వేశారని విమర్శించారు. వైసీపీ తరుపున పోటీచేసే వారు లేరని అందుకే జగన్ ఎక్కడా ఏకగ్రీవం కాకూడదని నేతలకి హుకుం జారీ చేశారని వ్యాఖ్యానించారు. అభ్యర్థులు కూడా లేని దయనీయ



పరిస్థితుల్లో వైసీపీ ఉందని మంత్రి నారాయి ణ వ్యాఖ్యానించారు. నిబంధనలు, న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయాలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చూసి తట్టుకోలేక ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. ఇదే సమయంలో... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, వెలిగొండ ప్రాజెక్టుల క్రెడిట్ తమదేనని వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను, నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తోందని వివరించారు. నెల్లూరు నగరంలో కాలువల కట్టలపై ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసే అంశంపై త్వరలోనే ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని హామీ ఇచ్చారు.

# ఎపిలో కొత్తగా జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలి

### మరో ఎయిమ్స్‌ఏర్పాటుకు అవసరమైన బడ్జెట్ సహాయం అందించాలి

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎంపి లింగమనేని రమేశ్ వినతి

**విజయవాడ.సెప్టెంబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో కొత్త జవహర్ నవోదయ విద్యాలయాల (జేఎన్వీ) ఏర్పాటుతోపాటు రాష్ట్రంలో మరో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన బడ్జెట్ సహాయం అందించాలని రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 28 జిల్లాలు ఉండగా, 15జిల్లాల్లో మాత్రమే జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరై, ప్రస్తుతం పని చేస్తున్నాయని ఎంపీ లింగమనేని రమేశ్ తెలిపారు. దీంతో 13 జిల్లాలు నవోదయ విద్యాలయాలు లేకుండా ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన రెసిడెన్షియల్ విద్యను అందించడంలో నవోదయ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. 2024 డిసెంబర్‌లో కేంద్ర మంత్రివర్గం ఐదేళ్ల కాలానికి 2,359.82 కోట్ల అంచనా వ్యయంతో దేశవ్యాప్తంగా 28 కొత్త జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని లింగమనేని రమేశ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదే ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన 13 జిల్లాల్లో జేఎన్వీల ఏర్పాటుకు ఐదేళ్ల కాలంలో సుమారు 1,096 కోట్ల మేర నిధుల అవసరం ఉంటుందని ఆయన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో నవోదయ విద్యాలయాలు లేని మొత్తం 13 జిల్లాల్లో వాటిని ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయ ఆమోదంతోపాటు తగిన బహువార్షిక బడ్జెట్ కేటాయింపులు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఎంపీ కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా ఎంపీ తన వినతిపత్రంలో ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లో పునర్వ్యవస్థీకరించిన రాష్ట్రంలో జాతీయ స్థాయి విద్యా, వైద్య సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారని, దాని ఫలితంగా ఎయిమ్స్ మంగళగిరి ఏర్పాటైందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి ముందుగా సాధ్యాసాధ్యాల అధ్యయనం, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ కోసం ప్రారంభ బడ్జెట్ కేటాయింపులు చేయాలని, అనంతరం సంస్థ ఏర్పాటుకు అవసరమైన మూలధన నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ఈ రెండు కీలక ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన బడ్జెట్ సహాయాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ఎంపీ లింగమనేని రమేశ్ తెలిపారు.

## ఎస్పీడిసిఎల్‌లో భారీగా పదోన్నతులు

**తిరుపతి,సెప్టెంబరు 1ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్‌లో 40 మందికి పదో న్నతులు కల్పిస్తూ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 28 మందికి, అకౌంట్స్ విభాగంలో 12 మందికి పదోన్నతి కల్పించారు. ఇంజనీరింగ్ విభాగంలో సూపరింటెండింగ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న ఏ. శ్రీనివాస బాబు, జి. సుధాకర్ కుమార్ లకు చీఫ్ జనరల్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న టి. శ్రీధర్, డి. భూపతి, జి. శ్రీనివా సుల రెడ్డి, ఏ. జయ కృష్ణారెడ్డి, పి. సుధాకర్, టి. శేషాద్రి, డిఎన్ విజయ రాజు, వి. సురేష్ బాబులకు సూపరింటెండింగ్ ఇంజనీర్లుగానూ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల స్థాయి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 10 మందికి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 9మందికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అకౌంట్స్ విభాగంలో జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీకాంత్ కు చీఫ్ జనరల్ మేనేజర్ గా పదోన్నతి కల్పించారు. అదేవిధంగా సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న కే. శ్రీనివాసులుకు జనరల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించగా, అకౌంట్స్ ఆఫీసర్ నుంచి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా ఇద్దరికీ, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నుంచి అకౌంట్స్ ఆఫీసర్ గా మరో ఇద్దరికి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నుంచి అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గా ఆరుగురికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



## తల్లి మందలించిందని అన్నదమ్ముల ఆత్మహత్య

**క్రోసూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** క్రోసూరు మద్యం తాగి ఇంటికి వచ్చినందుకు తల్లి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఇద్దరు అన్నదమ్ములు ఆత్మహత్యకు పాల్పడ్డారు. క్రోసూరు మండలం 88తాళ్లూరు గ్రామానికి చెందిన ఇరువురు పురుగు మందు తాగగా, కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పెద్ద కుమారుడు, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చిన్నకుమారుడు మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎపిసిపిడిసిఎల్ సిఎండి డైరెక్టర్లతో భారత్-డెన్మార్క్ ఇంధన భాగస్వామ్య ప్రతినిధుల సమావేశం

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ, డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో డెన్మార్క్ ప్రతినిధి బృందం సమావేశమైంది.ఈ సందర్భంగా విద్యుత్ రంగంలో పునరుత్పాదక ఇంధన వనరుల అనుసంధానం, విద్యుత్ వ్యవస్థల అభివృద్ధి, నిర్వహణ, గ్రిడ్ ప్రణాళిక తదితర అంశాలపై ఇరు పక్షాలు సాంకేతిక చర్చలు జరిపాయి. ముఖ్యంగా అధిక శాతం పునరుత్పాదక ఇంధనాన్ని గ్రిడ్‌లో సమర్థవంతంగా అనుసంధానం చేయడం, విద్యుత్ పంపిణీ వ్యవస్థలను భవిష్యత్ అవసరా లకు అనుగుణంగా అభివృద్ధి చేయడంపై అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకున్నారు. భారత్-డెన్మార్క్ ఇంధన భాగస్వామ్యం అనేది స్వచ్ఛ ఇంధన మార్పిడి, పునరుత్పాదక ఇంధన విస్తరణ, గ్రీన్ టెక్నాలజీల అభివృద్ధి లక్ష్యంగా భారత ప్రభుత్వం, డెన్మార్క్ ప్రభుత్వం మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక భాగస్వామ్యం. ఇండో-డానిష్ గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌లో భాగంగా 2020 జూన్ 5న తొలి అవగాహన ఒప్పందం కుదిరింది. 2020-2024 మధ్య మొదటి దశలో సామర్థ్య నిర్మాణం, పవన విద్యుత్, ఇంధన మోడలింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిం చారు. ప్రస్తుతం 2025-2029 వరకు రెండో దశ కొనసాగుతోంది. ఇందుకోసం 2025 మేలో పునరుద్ధరించిన అవగాహన ఒప్పందం కుదిరింది.ఈ భాగస్వామ్యం భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ, డెన్మార్క్ విదేశాంగ మంత్రిత్వ శాఖల మధ్య ప్రభుత్వ స్థాయి సహకారంగా కొనసాగుతోంది. డానిష్ ఎనర్జీ ఏజెన్సీ , భారత కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (దినితి)తో కలిసి సాంకేతిక కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ సంస్థల మధ్య పరస్పర అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞా నం, ఉత్తమ విధానాల మార్పి డికి అవకాశం కలుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఆన్‌లైన్ వర్క్‌షాప్‌లు, ప్రజెంటేషన్లు నిర్వహిం చగా, ప్రస్తుతం భారత విద్యుత్ పంపిణీ సంస్థలతో ప్రత్యక్ష సాంకేతిక చర్చలు, అనుభవాల మార్పిడి కోసం వన్‌టువన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

### కత్తితో దాడి చేసిన నిందితుడిపై

## ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపిన పోలీసులు

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీసులపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై ఆత్మరక్షణ కోసం వారు కాల్పులు జరిపారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోమటికుంటలాకుల డొంకరోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. నిందితుడు అవినాద్ కాళ్లపై కంకిపాడు సీఐ కాల్పులు జరిపినట్టు సమాచారం. సోమవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని దేవరపల్లి ప్రాంతంలో కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుపై అవినాద్ అనే వ్యక్తి కత్తితో ఘాతుకానికి ఒడిగట్టాడు. తీవ్రంగా గాయపరిచిన అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.నిందితుడు అవినాద్ కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోమటికుంటలాకుల డొంకరోడ్డు పరిసరాల్లో సంచరిస్తున్నట్లు రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో కంకిపాడు, గన్నవరం సీఐలు తమ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని ముట్టడించారు. పోలీసులను గమనించిన నిందితుడు లొంగిపోవడానికి నిరాకరించాడు. పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై అవినాద్ ఒక్కసారిగా కత్తితో దాడి చేసి, రాళ్లతో దాడికి దిగాడు. ఈ అకస్మాత్తు దాడిలో కానిస్టేబుల్ శ్రీనివాస్ ఛాతిపై తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అప్రమత్తమైన కంకిపాడు సీఐ, నిందితుడు అవినాద్ కాళ్లపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో గాయపడిన నిందితుడిని విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. కంకిపాడు కాల్పుల ఘటనపై ఉన్నతాధికారులు స్పందించారు. నిందితుడు అవినాద్‌ను అదుపులోకి తీసుకోవాలని వెళ్లినప్పుడు అతడు పోలీసులపై రాళ్లతో దాడి చేయడంతో తొలుత పోలీసులు గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో కాళ్లపై షూట్ చేయడంతో బుల్లెట్ గాయంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు వెల్లడించారు.

**చట్టాన్ని తీసుకుంటే పోలీసులు చూస్తూ ఊరుకోరు: కృష్ణా జిల్లా ఎస్పీ :** మండలం కోమటికుంటలాకుల డొంకరోడ్డులో పోలీసులపై రాళ్లతో దాడి చేయడంతో గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపామని కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. కాలికి షూట్ చేయడంతో బుల్లెట్ గాయంతో అదుపులోకి తీసుకున్నాం. ఆస్పత్రికి తరలించి చికిత్స కూడా అందించాం. గంజాయి తరలించే గ్యాంగ్‌లో అవినాద్ పెనమలూరు వాసి. ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నాడు. పోలీసులను గాయపరిచి బెదిరించాలనుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు.. ఉపాధి లేకపోతే మా వద్దకు వస్తే వారికి ఉపాధి కల్పిస్తాం. చెడు మార్గాల్లో వెళ్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకోరని చెప్పారు.

## ఎల్ నినోపై సమరానికి డిస్కంల సమగ్ర ప్రణాళిక

### ఆగస్టు 30నాటికి 4.93 లక్షల సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లతో జాతీయ స్థాయిలో ఎపికి 4వ స్థానం


### ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్,

**విజయవాడ, సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న రోజుల్లో ఎల్ నినో వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని సమ ర్థవంతంగా ఎదుర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సమన్వయ కమిటీ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) సెప్టెంబర్, అక్టోబర్ 2026 నెలలకు సమగ్ర విద్యుత్ సరఫరా ప్రణాళికను సిద్ధం చేశాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, తెలిపారు, రాష్ట్ర విద్యుత్ సరఫరా పరిస్థితి, పీఎం సూర్య ఘర్ పథకం పురోగతిని సమీక్షించేందుకు విజయానంద్ మంగళవారం విద్యుత్ సౌధ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సాధారణంగా అందుబాటులో ఉండాల్సిన థర్మల్ విద్యుత్ సామర్థ్యం 8,902 మెగావాట్లు కాగా, ఆగస్టు నెలలో సగటున 5,904 మెగావాట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. విద్యుత్ లభ్యత తగ్గడానికి ప్రధాన కారణాల్లో డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్ 5లో 46 రోజుల పాటు చేపట్టిన క్యాపిటల్ ఓవర్‌హాల్, అదే థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్4లో 31 రోజుల పాటు కొనసాగిన జనరేటర్ మరమ్మతు పనులు, వార్షిక ఓవర్‌హాల్, ఆగస్టు 9 నుంచి 20 రోజుల పాటు కొనసాగిన విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్3 వార్షిక ఓవర్‌హాల్, రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ యూనిట్లు 5, 6లో బాయిలర్ ట్యూబ్ లీకేజీలు, హిం దూజా నేషనల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ యూనిట్2, శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్/కృష్ణపట్నం ప్లాం ట్ యూనిట్3లో డక్ట్ లీకేజీలు ప్రధాన కారణాలని వివరిం చారు. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, ఆగస్టు నెలలో రాష్ట్ర గ్రిడ్ డిమాండ్‌ను సగటున రోజుకు 269 మిలియన్ యూనిట్లు మేరకు తీర్చామని అన్నారు. ఆగస్టు నెలలో గరిష్ట డిమాండ్ 286 మిలియన్ యూనిట్లుగా నమోదైందని, ఇది వేసవిలో నమోదైన 288.75 మిలియన్ యూనిట్ల గరిష్ఠ డిమాండ్‌కు దాదాపు సమీపంలో ఉందని చెప్పారు. సెప్టెంబర్‌లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారు 13,500 మెగావాట్లు, అక్టోబర్‌లో సుమారు 12,000 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉం దన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను వచ్చే ఏడాది కాలంలో, ముఖ్యంగా రానున్న వేసవి డిమాండ్‌ను తీర్చేందుకు అవసరమైన విద్యుత్‌ను సమకూర్చే లక్ష్యంతో ఏపీపీసీసీ, ఏపీ డిస్కామ్‌లు ఆగస్టు 20, 2026న డీఈఈపీ టెండర్లను ఆహ్వానించాయని విజయానంద్ తెలిపారు. ఆగస్టు 30 నాటికి 4.93 లక్షల సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లతో జాతీయ స్థాయిలో ఏపీకి 4వ స్థానం లభించిందన్నారు.ఈ సమావేశంలో ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి ఎ, ఐఏఎస్; ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డిస్కామ్‌ల సీఎండీలు లోతేటి శివశంకర్, , ఐ. పృథ్వీ తేజ్, . పుల్లారెడ్డి; ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్లు వెంకట రమణ మూర్తి, ఏ.కె.వి. భాస్కర్; ఏపీ జెన్‌కో డైరెక్టర్లు సుజయ్ కుమార్, అశోక్ కుమార్ రెడ్డి; ఏపీ పీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో పాటు ఏపీపీసీసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పన్నుల రాబడిలో గణనీయమైన వృద్ధి

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పన్నుల రాబడిలో గణనీయమైన వృద్ధి నమోదైంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో రాష్ట్ర పన్నుల ఆదాయం 18.05 శాతం పెరిగినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఆగస్టులో రూ.21,558.09 కోట్లుగా ఉన్న పన్నుల రాబడి.. ఈ ఏడాది ఆగస్టులో రూ.25,449.80 కోట్లకు చేరింది.

గతేడాదితో పోలిస్తే ఈ ఆగస్టులో పన్నుల రాబడిలో రూ.485.41 కోట్ల అదనపు ఆదాయం సమకూరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పన్నుల రాబడితో పాటు నికర వసూళ్లలోనూ దాదాపు 18 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొన్నాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి పన్నుల వసూళ్లు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు.వాణిజ్య పన్నుల శాఖలో చేపట్టిన సాంకేతిక సంస్కరణలు, ఆధునిక విధానాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పన్ను ఎగవేతలను గుర్తించడం, అనుమా నాస్పద లావాదేవీలను పరిశీలించడం కోసం వాణిజ్య పన్నుల శాఖలో ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్క్రూటినీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది .



MN 10 final:MN 10 final 01/01/2001 11:09 Page 1



# ఎస్ఆర్ఎంలో సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

## సైబర్ దాడుల నియంత్రణకు యాంటీ హ్యాకింగ్ సెల్స్ అవసరం : వీసీ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్

**మంగళగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం ఇంజినీరింగ్ విద్యార్థులకు 'సైబర్ నోవా-2026' పేరిట సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్



ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు గూగుల్ డెవలపర్స్ గ్రూప్ సహకారం అందించింది. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో సైబర్ సెక్యూరిటీపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, సైబర్ దాడులను ఎదుర్కొనే నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ దాడులను సమర్థవంతంగా నియంత్రించేందుకు యాంటీ హ్యాకింగ్ సెల్స్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. కృత్రిమ మేధస్సును సమగ్రంగా వినియోగించుకునే విధంగా సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఇండియన్ సర్వర్స్ సీఈఓ డి. సాయి సతీష్ విద్యార్థులకు సైబర్ దాడుల తీరుతెన్నులు, వాటిని గుర్తించడం, నియంత్రించడం, సైబర్ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర కీలక అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, వర్క్‌షాప్ నిర్వాహకులు డాక్టర్ నాగస్రవంతి, డాక్టర్ మణికందన్ తదితరులు డి. సాయి సతీష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# కొల్లనుకొండలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం

**మంగళగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఈనెల 4న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని కొల్లనుకొండలోని హరే కృష్ణ గోకుల క్షేత్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2026 సెప్టెంబర్ 4వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో రోజంతా వివిధ ఆధ్యాత్మిక, భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భక్తులకు ప్రత్యేక దర్శనం, సంకల్ప అర్చన, మహా అభిషేకం, అర్ధరాత్రి ప్రత్యేక అభిషేకం, హరినామ సంకీర్తనం, భక్తి భజనలు, కీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విజయవాడ, గుంటూరు, అమరావతి, తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో




భక్తులు ఈ మహోత్సవానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవం, శ్రీకృష్ణుని దివ్య లీలలు, బోధనలు, భక్తి మార్గం గురించి ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హరే కృష్ణ గోకుల క్షేత్రం అధ్యక్షులు వంశీధర దాస మాట్లాడుతూ "శ్రీకృష్ణ జన్మాష్టమి అనేది భగవంతుడైన శ్రీకృష్ణుని దివ్య నామాలను స్మరించుకునే, ఆయన పవిత్ర లీలలను శ్రవణం చేసే, హరినామ సంకీర్తనలో పాల్గొనే అత్యంత పవిత్రమైన రోజన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా ఈ మహోత్సవానికి విచ్చేసి, హరినామ సంకీర్తనలో పాల్గొని, ప్రత్యేక అభిషేకాలను దర్శించి, శ్రీకృష్ణ ప్రసాదాన్ని స్వీకరించి, భగవంతుని దివ్య కృపకు పాత్రులు కావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము" అని తెలిపారు.

**ప్రధాన ఆకర్షణలు**

ప్రత్యేక శ్రీకృష్ణ దర్శనం, సంకల్ప అర్చన మహా అభిషేకం, అర్ధరాత్రి ప్రత్యేక అభిషేకం, హరినామ సంకీర్తనం, భక్తి భజనలు, కీర్తనలు ఆధ్యాత్మిక ప్రవచనాలు, చిన్నారులు, యువతచే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయానికి విచ్చేసే ప్రతి భక్తుడికి శ్రీకృష్ణ ప్రసాదం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 25000 మందికి అన్నదాన ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పవిత్రమైన శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని హరే కృష్ణ గోకుల క్షేత్రం నిర్వాహకులు కోరారు.

# తాడేపల్లి శాఖ గ్రంథాలయంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్

**తాడేపల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ శ్రీమతి భీమినేని వందనా దేవి శాఖ గ్రంథాలయం తాడేపల్లిని ఆకస్మిక తనిఖీ చేసి పాఠకులకు అందిస్తున్న గ్రంథాలయ సేవలు గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు గ్రంథాలయానికి ఎక్కువ మంది పాఠకులు వచ్చేటట్లు మరియు ఎక్కువ చదువరులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకునేటట్లు చదువరులను ప్రోత్సహించవలసిందిగా గ్రంథాలయ అధికారి వారిని చైర్పర్సన్ తెలవడం జరిగింది



# నందిగామలో మాఏపి స్టూడియోస్ ఏర్పాటు

## ఎమ్మెల్యే తో సినీదర్శకుడు దిలీప్ రాజా చర్చలు

**తెనాలి సెప్టెంబర్ 1(ప్రభాతవార్త):** రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రలో సినిమారంగ అభివృద్ధి మాత్రమే ఏకైక ఏజండాగా 2018లో తెనాలిలో స్థాపించిన మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్



ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ ఆంధ్రలో సినిమా స్టూడియోల నిర్మాణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లుగా మా ఏపిఐ వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. హైదరాబాదు నుండి విజయవాడ మధ్యలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెనాలి లో మీడియాకు తెలిపారు. అటు హైదరాబాదు నుండి ఇటు విజయవాడ నుండి సినిమా నిర్మాణ సంస్థల సినిమాలు ఆంధ్రాలో నిర్మించుకునేందుకు నందిగామ జాతీయ రహదారి అనుకూలమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్టుడియో నిర్మాణానికి స్థలం కేటాయిస్తే మాఏపి నిర్మాణానికి సిద్ధంగా ఉందని దిలీప్ రాజా చెప్పారు. ఈ అంశాన్ని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తో చర్చించామని ఆయన వివరించారు. రిచ్ హౌస్, మండువా ఇల్లు, పోలీసు స్టేషన్, కోర్టు, హాస్పటల్, తదితర అత్యవసర సెట్లను ఏర్పాటు చేసుకున్నేటు ఆర్ట్ డైరెక్టర్ రూట్ మేప్ ను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ , నందిగామ ఎమ్మెల్యే సౌమ్య గతలో తన దర్శకత్వంలో విడిపించిన అంబేద్కర్ లో భగత్ సింగ్ స్నేహితుడు ప్రీతీలత వడేదార్ పాత్రలో నటించినట్లు దిలీప్ రాజా గుర్తు చేశారు. నటులు భవాని కపూర్, సమన్వర్తల శ్రీధర్ శర్మ, ఆనంద్, సైదులు నందిగామ సమ్మీపలో ప్రభుత్వస్థలం యాదవ్ పర్యటన బృందంలో ఉన్నారని ఆయన పరిశీలనకోసం నందిగామ ఎమ్మెల్యే సౌమ్యను పేర్కొన్నారు .

# తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ జాతీయ అధ్యక్షులుగా డాక్టర్ గురు రాజ్

**గుంటూరు విద్య సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** తెలుగు దేశం పార్టీ ఎన్ ఆర్ ఐ జాతీయ అధ్యక్షులుగా డాక్టర్.గురు రాజ్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శ్రీ వికాస్ విద్యాసంస్థల అధినేత జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురు రాజ్ నాయకత్వంలో టిడిపి జాతీయ ఎన్ ఆర్ ఐ శాఖ మరింత బలోపేతం అవుతుందని, మంచి నాయకత్వ లక్షణాలు, కలుపుగోలు తనం, దేశ విదేశాలలో విస్తృత పరిచయాలు ఉన్న డాక్టర్.గురు రాజ్‌ని జాతీయ అధ్యక్షులుగా నియమించిన చంద్రబాబు నాయుడు కి, యువ నాయకులు లోకేశ్ నారాకి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్:దాసరి రాజా మాష్టారు అభినందనలు తెలియజేశారు..

# చంద్రబాబు 30ఏళ్ళ ప్రస్థానంపై సంబరాలు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు1, ప్రభాతవార్త:** ఏఎన్‌యు వద్ద తేదేపా అధినేత చంద్రబాబు నాయుడు 30 ఏళ్ళ ప్రస్థానంపై వర్సిటీ మెయిన్‌గేట్ వద్ద కేక్ కట్‌చేసి సంబంరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇసి మెంబర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, నూటా అధ్యక్షుడు ఆచార్య పి.బ్రహ్మాజీరావు, టిఎన్ఎస్ఎఫ్, టిఎన్‌టియుసి సమన్వయకర్త వెంకట రమణ, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు హేమంత్ కుమార్‌లు మాట్లాడుతూ 30ఏళ్ళ రాజకీయ ప్రస్థానం, ప్రజాసేవ, నాయకత్వం వంటి రంగాలలో అనేక సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రాధాకృష్ణ, కె.కోటేశ్వరరావు, ఎన్.తాతయ్య, రవిచంద్ర, చిరంజీవి, వికాస కార్యదర్శి జె.శ్రీనివాసరావు, డేలీవేజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ప్రభాకర్, ఉపాధ్యక్షులు బి.రత్తయ్య, కార్యదర్శి నీలకంఠేశ్వరరావు, టిఎన్‌టియుసి నాయకులు కనకరాజు, రమేష్, బోజిబాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# తక్కువ నీటితో పండించే ఆరుదల పంటలు సాగు చేయాలి

## -జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి

**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** తక్కువ నీటితో పండించే ఆరుదల పంటలను రైతులు సాగుచేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం. పద్మావతి పేర్కొన్నారు. పెదనందిపాడు మండలంలోని జిజి పాలెం, పమిడివారిపాలెం



గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పత్తి, వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ..ప్రస్తుతం ఉన్న పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. ప్రత్తి మరియు వరి పంట వేసిన ప్రతిరైతు పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ప్రత్తి మరియు వరి పంట దెబ్బతిన్న పొలాలలో ప్రత్యామ్నాయ పంటలైన అపరాలు అనగా మినుము, పెసర వంటి పంటలకు కంటిన్జెన్సీ ప్లాన్ కింద 80శాతం సబ్సిడీలో విత్తనాలు అందచేయడం జరుగుగుతుందని, రైతులు తమ దగ్గరలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. మండలంలోని రావిపాడు గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతిరైతు ఫార్మర్ ఐడి పొందాలన్నారు. మరో అతిథి వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్.మోహనరావు మాట్లాడుతూ..రైతులకు ఎల్ నినో ప్రభావం వలన తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నందున వర్షపాతం జూన్, జూలై, ఆగస్ట్, మూడు నెలలకు సాధారణ వర్షపాతం 325 ఎంఎం కి గాను ఈ రోజుకి 95.8ఎంఎం మాత్రమే వర్షపాతం పడిందని వివరించారు. రైతులు ఎక్కువ నీటితో పండించే మిరప, మొక్కజొన్న, వరి పంటలకు బదులుగా తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలైన అపరాలు, మిల్లెట్స్ పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. ఇప్పటికి పంటలు వేయని రైతులకు ఏ పంటలు వేయాలో తెలియజేశారు. ఏపీ సీఎన్ఎఫ్ డిపిఎం రాజకుమారి మాట్లాడుతూ. .ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యత, పీఎండీస్ కిట్స్ గురించి వివరించారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, ఆర్.ఎస్.కె, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

**తెనాలి మున్సిపాలిటీ, సెప్టెంబర్1, (ప్రభాతవార్త):** కుష్టువ్యాధి పట్ల ప్రజల అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. స్థానిక పద్మశాలి పేట పట్టణ ఆరోగ్య కేంద్రం



ప్రాంగణంలో గ్రేట్నాల్టీస్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన అంగవైకల్యంలో కలిగిన కుష్టువ్యాధిగ్రస్తులకు దుప్పట్లు స్టీల్ ప్లేట్లు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. సుమారు 40 మందికి కుష్టు వ్యాధిగ్రస్తులకు స్టీల్ ప్లేట్లు దుప్పట్లు వగైరా ఆమె చేతుల మీదుగాపంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిగ్రస్తుల అరికాళ్ళకు ఉన్న పుండ్లను శుభ్రం చేయుట మరియు చేతులు, కాళ్లు వంకర్లు పోయినటువంటి పేషెంట్స్ కు వ్యాయామం చేయించుట వంటి కార్యక్రమం నిర్వహించడం జరిగినది. అనంతరం అంగవైకల్యంతో ఉన్న ప్రతి కుష్టు వ్యాధి పేషెంట్ కు ఒక దుప్పటి మరియు ఒక స్టీల్ ప్లేటు మరియు వారికి భోజన సదుపాయము చేయుట కూడా జరిగింది. కుష్టువ్యాధిగ్రస్తులకు స్టీల్ ప్లేట్లు దుప్పట్లను మురారి చిరంజీవి మన్నవ రామకృష్ణ చెప్పులను బహుకరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రావిజయలక్ష్మి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి కుష్టు వ్యాధిగ్రస్తులకు సహాయం చేయడం అభినందనీయమని అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులు వైద్యులను సంప్రదించి జాగ్రత్తగా మందులను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి , డిప్యూటీ డి ఎం ఎన్ హెచ్ ఓ ఈరుగుల అన్నపూర్ణ, పద్మశాలి పేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, గ్రేట్నాల్టీస్ ఆర్గనైజేషన్ మోరంపూడి వ్యవస్థాపకులు వంగర హేమ్ చంద్, ఫిజియోథెరపిస్టు శివ , రవి మరియు మన్నవ రామకృష్ణ , అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పద్మశాలిపేట కు చెందిన ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీవిద్య, డిఇఓ శ్రీదేవి, ఆశా వర్కర్స్ స్టాఫ్ నర్సులు , సిబ్బంది పాల్గొన్నారు.

పిఓడిటిటి డాక్టర్ ప్రియాంక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆళ్లగడ్డ వెంకటేశ్వరరావు, తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమోళి , డిపిఎంఓ జంగం శ్యామ్ పాల్గొన్నారు. ఈకార్యక్రమాన్ని పరిశీలించుటకు జర్మనీ నుంచి ప్రముఖులు విచ్చేశారు.

# ఎమ్మెల్యే బూర్లాకు వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమ బహుకరణ

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు కు ముట్లూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు గోగినేని కళ్యాణి చక్రవర్తి మరియు యూత్ కలసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమను మంగళవారం బహుకరించారు. వట్టిచెరుకూరు మండల కేంద్రంలో జరిగిన పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు కు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ఎంపీటీసీ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి కలియుగ వైకుంఠనాథుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సుందర ప్రతిమను బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.



స్వామి వారి కృపాకటాక్షాలతో మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ లు ప్రజలకు మరింత ఉన్నతమైన సేవలు అందించాలని, వారు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని ఓ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే అందుకు కంకణం కట్టుకున్న ఎమ్మెల్యేకు అభినందనలు తెలియజేశారు. అలాగే అమెరికాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన కోమటి జయరాం ను టిడిపి సీనియర్ నాయకులు గొట్టిముక్కల సుబ్బారావు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామ సమస్యలపై కొంత సేపు చర్చించటం జరిగిందన్నారు. దానికి జయరాం సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరగా పరిష్కరించే మార్గం చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

# కారంపూడిపాడులో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ హీరో కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలు కారంపూడిపాడు గ్రామంలో మంగళవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, కార్యదర్శి త్రినాథ్ హాజరై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన భారీకేక్ ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ..పవన్ కళ్యాణ్ ఒక వ్యక్తి మాత్రమే కాదు, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా, యువతకు స్ఫూర్తిగా, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన ప్రజానాయకుడిగా రాష్ట్ర ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన పవన్ కళ్యాణ్ నేడు కూటమి ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టి ప్రజా సంక్షేమం, సుపరిపాలన, రాష్ట్ర అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేసే ప్రతి అడుగులో వెన్నంటి ఉంటూ రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పవన్ కళ్యాణ్ కు ఈ సందర్భంగా ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేద ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు రైతుల ఇబ్బందులను గమనించి రూ.30 కోట్లు తమ సొంత నిధులు కేటాయించి, రైతులకు అందించిన దార్శనికులని కొనియాడారు. పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాటి నుండి



నేటి వరకు గిరిజన తండాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన మహా నాయకుడు పవన్ కళ్యాణే అన్నారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 13,500 పంచాయితీల్లో ఏకకాలంలోనే సమావేశాలు ఏర్పాటు చేసి ఎక్కడో ఉన్న పంచాయితీరాజ్ శాఖను అగ్రస్థానానికి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందుకునేలా సంస్కరణలు అమలు చేసిన అపర మేధావి జనసేన అని పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో నీలం దినేష్, కొండపల్లి కిషోర్, మాదాసు సాంబయ్య, తోటకూర రామారావు, కొండపల్లి వెంకటస్వామి, చేబ్రోలు శ్రీనివాసరావు, చందు కిషోర్, నీలం శ్రీనివాసరావు, చందు చంద్రమోహన్, ప్రతాప్, తోటకూర శివయ్య, శివరామకృష్ణ, సుబ్బారావు, జనసేన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలి

## -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** వివిధ రకాల సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒకే రోజు నూరుశాతం పూర్తి అయ్యేవిధంగా చూడాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని 16వ వార్డులో పర్యటించిన మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు పలు ఇండ్లకు తిరిగి స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో నిర్లక్ష్యం చేయకూడదని ఆదేశించారు. అన్నివార్డుల్లో సిబ్బంది చాలా చురుగ్గా పాల్గొని పెన్షన్లను పంపిణీ చేశారు.



# పలు కోర్టులకు ఇంచార్జి ఏజీపీగా వట్టికూటి లీలాప్రసాద్

**పొన్నూరు, సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** స్వర్ణపురి పట్టణానికి చెందిన వట్టికూటి లీలాప్రసాద్ పొన్నూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజిపి)గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఈయనను జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ తెనాలి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఇంచార్జి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు లీలాప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. లీలాప్రసాద్ మూడు దశాబ్దాల నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. లీలాప్రసాద్ గతంలో మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా, అసిస్టెంట గవర్నమెంట్ ప్లీడర్‌గా, నోటరీగా, వాణిజ్య బ్యాంకుల ప్యానెల్ న్యాయవాదిగా, టిడిపి లీగల్‌సెల్ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పని చేశారు.



# యాప్ ద్వారా రైతులు పంట నమోదు చేసుకోవచ్చు

## -మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని

**చేబ్రోలు(పొన్నూరు), సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులే నేరుగా పంట నమోదు చేసుకోవచ్చని మండల



వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని తెలిపారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. వరి క్షేత్రంలో పర్యటించి పంట యొక్క పరిస్థితులను గమనించారు. వరి పంటలో కలుపు యాజమాన్యం గురించి వివరించారు. వరి నాటిన 20నుంచి 25రోజుల్లోపు కలుపు మందు పిచికారి చేసుకోవాలని చెప్పారు. వరిలో కలుపు నివారణకు ఎకరానికి ఆల్‌మిక్స్ 80గ్రాములు, నామిని గోల్డ్ 200గ్రాములు, రిస్టార్ 100గ్రాములు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఇనుము దాతు లోప నివారణ పై దృష్టి పెట్టాలి

## -మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు

**పొన్నూరు, సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** బోర్ల కింద వరి వెదసాగు చేస్తున్న పొలాల్లో అక్కడక్కడ ఇనుము దాతు లోపము కనిపిస్తుందని, రైతులు దీనిపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు కోరారు. ఇనుము దాతు లోపం వల్ల పైర్లు తెల్లగా మారి ఎదుగుదల కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. ఇనుము దాతు లోప నివారణకు చెలాఫర్(సెర్రస్ సల్ఫేట్) ఎకరాకు 200గ్రాములు, అన్నభేది ఒక కిలో, నిమ్మ ఉప్పు 100గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. మొదటి దఫా ఎరువులు సిఫార్సు మేరకు ఎకరాకు 50కిలోల డిఏపి, 25కిలోల యూరియా వేయాలన్నారు. రైతులు ఏపిఎఫ్‌టిఆర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తద్వారా ఐడీని ప్రతి రైతు పొందాలన్నారు. దీని వల్ల రాబోయే రోజుల్లో ధాన్యము కొనుగోలు, అపరాల కొనుగోలు, పీఎంకిసాన్, ఇతర వ్యవసాయ పథకాలు లబ్ది పొందేందుకు తప్పనిసరిగా ఐడీ నెంబరు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలను రైతులు గమనించి త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.హెప్సిబా, సిహెచ్ రూప, ఎంపీఈఓ సింహాద్రి సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.




# ఘనంగా కరణం చిన్నయ్య జన్మదిన వేడుకలు

**ప్రత్తిపాడు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** విద్యాభివృద్ధికి విశేష కృషిచేసిన మహోన్నత వ్యక్తి, మహనీయులు కరణం చిన్నయ్య చిరస్మరణీయులని పలువురు ఆయన సేవలను కొనియాడారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం చిన్నయ్య 133వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, జన్మదిన కేకు కట్ చేసి, అందరికీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అప్నా జడ్పీహెచ్ఎస్ వెల్ఫర్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయిని మక్కెన జవహర్ రాణి మాట్లాడుతూ.. పెదనందిపాడులోని పాత మద్రాస్ రోడ్డు పక్కన సుమారు111 సంవత్సరాల క్రితమే య.17.40 సెంట్ల భూమిని విద్యాభివృద్ధి కోసం కేటాయించి ఆనాడే పాఠశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ రోజుల్లో సుమారు 50 గ్రామాల్లో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి కరణం చిన్నయ్య చిరస్మరణీయులని ఆయన సేవలను కొనియాడారు. ఈ పాఠశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు నాటి నుండి నేటి వరకు అటు రాజకీయాల్లోనూ ఇటు పారిశ్రామికవేత్తలుగాను దేశ విదేశాలలో ఉన్నత ఉద్యోగాలు నిర్వహిస్తూ ఉన్నత స్థాయిలో స్థిరపడ్డవారు అనేకమంది ఉన్నారని పేర్కొన్నారు. ఆ మహనీయులు విద్య అభివృద్ధి కోసం ఆనాడు సేకరించిన భూమిలో స్థానిక ప్రముఖులు సుమారు 60 సంవత్సరాల క్రితం కళాశాలను స్థాపించి అనేక పక్కా బిల్డింగులు నిర్మించి విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, వారందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కరణం చిన్నయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అప్నా జడ్పీహెచ్ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సికె.రామయ్య, గుంటుపల్లి అప్పారావు, వెల్లంకి శివరాం ప్రసాద్ వారి ఉపాధి కొరకు వేరే ప్రాంతాల్లో ఉన్నప్పటికీ తమ సందేశాలను ఎప్పటికప్పుడు తమకు పంపిస్తూ ఉంటారని చెప్పారు. ఆ మహానుభావుని పుణ్యఫలమే నేడు మన గ్రామంలో పాఠశాలలు, కళాశాలలో విస్తరించాయని తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు కొల్లా సీతారామయ్య, సభ్యులు ప్రత్తిపాటి సుబ్బారావు, గుగ్గిలం సాయిబాబు, మల్లంపాటి అమ్మయ్య, జెడ్పీ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయిని ఉషశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# లక్ష తమలపాకులతో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

**గుంటూరు విద్య సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక నాజ్ సెంటర్ లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో చిరంజీవి యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జనసేన నాయకులు మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కుదుటపడాలని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ రవీంద్ర బాబు ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆయన చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. అలాగే ఆయన నాయకత్వంలో జనసేన పార్టీ మరింత బలపడాలని ఆకాంక్షించారు. మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ అంజనీపుత్రుని ఆశీర్వచనాలతో పవన్ కళ్యాణ్ రాజకీయంగా అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయాలలో మచ్చలేని మహనేత పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు ఆధ్వర్యంలో వేద పండితులను ఘనంగా సత్కరించారు. పూజ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు పాల్గొని పవన్ కళ్యాణ్ కు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, యువజన విభాగం సభ్యులు, మహిళా కార్యకర్తలు పాల్గొని పూజలో భాగస్వామ్యమయ్యారు. కార్యక్రమంలో సంకూరు శ్రీనివాస్, ఇగ్రి సాయి, తోట పవన్, బద్రి, గిడుతూరి సత్యం, శంకర్ రెడ్డి, మొఖమాటం రమేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

MN 11PAGE-GNTvffff:MN 11PAGE-GNTv 01/01/2001 11:11 Page 1



# ముఖ్యమంత్రి,తెదేపా అధినేత చంద్రబాబు సూచనలు,ఆదేశాల్ని శిరసావహిస్తాం

**నరసాపురం పార్లమెంట్ టీడీపీ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి.**



**చిలకలూరిపేట, సెప్టెంబర్1,ప్రభాతవార్త :** ప్రజలతో ప్రత్యక్ష సత్సంబంధాలు, ప్రభుత్వ మరియు పార్టీ విజయాలపై పార్టీ శ్రేణులు చేపట్టే విస్తృత ప్రచారమే కూటమి ప్రభుత్వంపై ప్రజా విశ్వాసాన్ని, విజయావకాశాల్ని పెంచుతుందని, మొగల్తూరు నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ శ్రేణులకు సూచించారని, నరసాపురం పార్లమెంట్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మంగళవారం మొగల్తూరులో పర్యటించినన ముఖ్యమంత్రి చంద్రబాబు, పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం టీడీపీ అధినేత హోదాలో నిర్వహించిన నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో పార్లమెంట్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధినాయకుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన తీరు, భవిష్యత్ కార్యాచరణ లక్ష్యాలను ప్రత్తిపాటి మీడియాతో పంచుకున్నారు. ప్రతినెలా 1వ తేదీన ప్రభుత్వాధినేత హోదాలో ప్రజలకోసం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొంటున్న చంద్రబాబు, అదే రోజున ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశం కావడం ద్వారా కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం, నూతన ఉత్సాహం నింపుతూ, పార్టీ పట్ల వారికి ఉన్న అంకిత భావాన్ని మరింత పెంపొందిస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రజలే నా హై కమాండ్ అన్న మాటకు కట్టుబడే చంద్రబాబు పార్టీ కార్యక్రమాల్ని సర్వ సన్నద్ధం చేస్తున్నాన్నారన్నారు. చంద్రబాబు అనుభవం, ఆలోచనలు, దూరదృష్టి నిర్ణయాలు, భవిష్యత్ లక్ష్యాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత టీడీపీ శ్రేణులపైనే ఉందని ప్రత్తిపాటి తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల విజయం కోసం టీడీపీ నేతలు, కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలన్నారు. వ్యూహాత్మక దాడి, ముందస్తు ప్రణాళికతో వైసీపీ విషప్రచారాన్ని నిలువరించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలను ఆచరణ సాధ్యం చేసేలా శ్రేణుల్ని సన్నద్ధం చేస్తామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

# చిలకలూరిపేట ప్రజలు చంద్రబాబుకు రుణపడి ఉంటారు : ప్రత్తిపాటి

**- నిన్న రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.80లక్షలు, నేడు ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన షేక్ హసీనా కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం**

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** చిలకలూరిపేట ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటారని, నిన్న రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాల్ని, నేడు ప్రేమోన్మాది చేతిలో హత్యగావింపబడిన షేక్ హసీనా కుటుంబాన్ని ఆదుకున్న గొప్ప మానవతా మూర్తి చంద్రబాబు అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గతనెల 4న ప్రేమోన్మాది బాలసైదులు చేతిలో దారుణంగా హత్యగావింపబడిన షేక్ హసీనా కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి మంగళవారం మృతురాలి తల్లిదండ్రులకు అందచేశారు. స్థానిక కూటమి నాయకులు, మైనారిటీ మతపెద్దలతో కలిసి 38వ వార్డులోని హసీనా ఇంటికి వెళ్లిన ప్రత్తిపాటి.. ఆమె తల్లిదండ్రులు షేక్ రిహానా, మస్తాన్ లను పరామర్శించి, రూ.10 లక్షల నగదు చెక్కుని వారికి అందచేశారు. అనంతరం ప్రత్తిపాటి, షేక్ రిహానా, మతపెద్ద (ముఫ్తీ) అన్సర్ ఖాన్ విలేకరులతో మాట్లాడారు.

**హసీనా కుటుంబానికి జరిగిన అన్యాయంపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించారు : ప్రత్తిపాటి**

ఆగస్ట్ 4న ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన మైనారిటీ యువతి షేక్ హసీనా కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకున్నామని, మృతురాలి తల్లిదండ్రులు, చెల్లెలికి భవిష్యత్ లోనూ అన్నివిధాలా అండగా ఉంటామని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అన్యాయం హసీనా కుటుంబానికి జరిగిందని ముఖ్యమంత్రికి తెలియచేసిన వెంటనే, ఆయన వెంటన స్పందించి పెద్ద మనసుతో సాయం చేద్దామని చెప్పారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రభుత్వ నుంచి హసీనా కుటుంబానికి మంజూరైన రూ.10 లక్షల సాయాన్ని ఆమె తల్లిదండ్రులు రిహానా, మస్తాన్ లకు అందచేశామన్నారు.

**నా బిడ్డను చంపిన దుర్మార్గుడికి ఎవరూ మద్ధతు ఇవ్వకూడదు : షేక్ రిహానా (హసీనా తల్లి)**

నా బిడ్డను చంపిన దుర్మార్గుడికి మీడియా, సోషల్ మీడియా సహా ఎవరూ మద్ధతు ఇవ్వకూడదని హసీనా తల్లి షేక్ రిహానా విజ్ఞప్తి చేశారు. నేరస్తుడిని ప్రభుత్వం కఠినంగా శిక్షించి, తమకు తగిన న్యాయం చేయాలన్నారు. చేతికంది వచ్చిన పెద్దబిడ్డను కోల్పోయిన మాకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండగా నిలిచినందుకు వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని రిహానా తెలియచేశారు. ఎమ్మెల్యే పుల్లారావు మాకు కొండంత అండగా నిలిచారని, చంద్రబాబు అందించిన ఆర్థిక సాయంతో చిన్నకూతుర్ని బాగా చదివించి, ప్రయోజకురాల్ని చేస్తానని రిహానా తెలిపారు. ముఖ్యమంత్రి మా అక్క కుటుంబానికి న్యాయం చేయకుంటే.. అందరూ నిలువునా సమాధి అయ్యేవారు : షేక్ రేష్మ (హసీనా పిన్ని) మాకు జరిగిన అన్యాయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పందించారు. ఆనాడు మాతో మాట్లాడి దేవుడిలా మాకు అండగా నిలిచారు. ఒక దుర్మార్గుడి కారణంగా మా కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న మాకు టీడీపీ ప్రభుత్వం అండగా నిలిచింది, ఇంటింటికీ తెలుగుదేశం అంటూ.. మా ఇంటికి తెలుగుదేశం అండగా నిలిచింది. మాలాంటి పేద కుటుంబాలకు అండగా నిలిస్తే, కూటమి ప్రభుత్వాన్ని పేదలు ఎప్పటికీ విడిచిపెట్టరు. మా



అమ్మాయిని చంపేసిన బాలసైదుల్ని ఎవరూ సమర్థించకూడదు. అతన్ని కఠినంగా శిక్షిస్తేనే ప్రభుత్వంపై మాలాంటి వారికి ఇంకా నమ్మకం పెరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాకు ఆర్థిక సాయం చేయకుంటే.. మా అక్క, ఆమె కుటుంబం మొత్తం ఇక్కడే నిలువునా సమాధి అయ్యేవారు." అని హసీనా పిన్ని షేక్ రేష్మ గద్గద స్వరంతో చెప్పారు. మైనారిటీ కుటుంబానికి న్యాయం చేసిన చంద్రబాబుకు,

**ప్రభుత్వానికి అల్లాహ్ ఆశీస్సులు ఉండాలి : అన్సర్ ఖాన్ : ముఫ్తీ (మతపెద్ద)**

హసీనా కుటుంబాన్ని ఆదుకుంటామన్న వాగ్ధానాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి నిలబెట్టుకున్నారని, ఆయన ద్వారా మైనారిటీ కుటుంబానికి న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వానికి అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తున్నామని ముఫ్తీ అన్సర్ ఖాన్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి మనసుతో మైనారిటీ కుటుంబానికి అండగా నిలిచారని, వారికి మైనారిటీల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. హసీనా మరణంతో మస్తాన్ కుటుంబం దిక్కులేనిది అయిందని, వారి బిడ్డకు జరిగిన అన్యాయం భవిష్యత్ లో మరెవరికీ జరగకుండా కూటమిప్రభుత్వం ఆడబిడ్డల రక్షణ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని అన్సర్ ఖాన్ కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, జంగా వినాయకరావు, పిల్లి కోటేశ్వరరావు, ముస్లిం మత పెద్దలు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నాయకులు లోకేష్ జిల్లా పర్యటనను విజయవంతం చేద్దాం : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాల అనంతరం తొలిసారి నరసరావుపేటలో జరుగుతున్న టీడీపీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, ప్రజా నాయకులు నారా లోకేష్ పర్యటనని చరిత్ర గర్వించేలా విజయ వంతం చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాతో పాటు, నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు, మిత్ర పక్షాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లి, యువనేత లోకేశ్ కార్యక్రమాల్ని కనీవినీ ఎరుగని విధంగా విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



జిల్లాలోకి అడుగుపెట్టింది మొదలు తిరిగి వెళ్లే వరకు ప్రతి కార్యక్రమం విజయవంతంలోనూ టీడీపీ శ్రేణుల ఉత్సాహపూరిత మార్క్ పనితీరు కనిపించాలని ప్రత్తిపాటి సూచించారు. స్వాగతం మొదలు.. తుది వీడ్కోలు వరకు ప్రతి చర్యలో కూటమిపార్టీల ఐక్యత ప్రతిబింబించాలన్నారు. ఏపీ జెన్ జీ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చే సమర్థుడు, జెన్ జీకి నమ్మకమైన మిత్రుడు లోకేషే అని ప్రత్తిపాటి తెలిపారు. లోకేష్ వినూత్న ఆలోచనలు, నిర్విరామ కృషి, అవగాహన శక్తి, సోషల్ మీడియా ప్రజెన్స్ యువతలో ఆయన క్రేజ్ పెంచుతున్నాయని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. లోకేష్ కార్యక్రమాల విజయవంతం కోసం నియోజకవర్గ స్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పర్యటనలో భాగంగా తొలుత మంత్రి లోకేశ్ జేఎన్ టీయూ కళాశాలలో రూ.70 కోట్లతో నిర్మించిన విద్యార్థుల నూతన వసతి భవనాల్ని ప్రారంభిస్తారన్నారు. ఈ భవనాల ప్రారంభంతో దాదాపు 1,400 మంది విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతి సముదాయం అందుబాటులోకి వస్తుందన్నారు.

# సేవకు ప్రతిరూపం మెగాస్టార్ చిరంజీవి

**- జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కోకన్వీనర్ బాలాజి**

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** మెగాస్టార్ చిరంజీవి అంటే కేవలం సినిమా నటుడు మాత్రమే కాదని, ఆయన నిస్వార్థ సేవకు నిలువెత్తు ప్రతిరూపమని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కోకన్వీనర్ పెంటేల బాలాజి పేర్కొన్నారు. చిరంజీవి అందించిన సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకునే జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. శనివారం చిలకలూరిపేటలోని తన కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటేల బాలాజి నాయకులతో కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేసి అభిమానులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడుఅనంతరం ఆయన మాట్లాడుతూ... బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి ఎన్నో సేవా సంస్థల ద్వారా లక్షలాది మంది ప్రాణాలను కాపాడిన మానవతావాది చిరంజీవి అని కొనియాడారు. ఆపదలో ఉన్నవారికి నిస్వార్థంగా సాయం చేయాలనే ఆయన ఆలోచనా విధానమే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు, పార్టీ విధానాలకు బలమైన పునాదిగా నిలిచిందని గుర్తుచేశారు. చిరంజీవి తన సినీ ప్రస్థానంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకోవడంతో పాటు, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. రక్తదాన శిబిరాలు, ఆపదలో ఉన్న వారికి సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలకు ఆయన అందించిన స్ఫూర్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ప్రజలకు అండగా నిలవడం, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిరంజీవి చూపిన సేవా మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చిరంజీవి చూపిన సేవా మార్గంలో నడుస్తూ నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి, సామాజిక సేవా కార్యక్రమాలకు జనసేన శ్రేణులు ఎల్లప్పుడూ ముందుంటాయని బాలాజి పిలుపునిచ్చారు.



# నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యంను మర్యాద పూర్వకంగా కలసిన సినిమా దర్శకుడు వి సముద్ర.

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ప్రముఖ సినిమా దర్శకుడు మరియు ఏపీ ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వి సముద్ర మంగళవారం 01092026 ఉదయం 11 గంటలకు చిలకలూరిపేట నవతరం పార్టీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యంతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గంకు చెందిన ప్రముఖులు మరియు సింహరాశి, టైగర్ హరిశ్చంద్ర ప్రసాద్, శివరామరాజు, పంచాక్షరీ వంటి విజయవంతం అయిన అనేక సినిమాలకు దర్శకత్వం వహించిన సముద్రను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పదవికి ఎంపిక చేయడం గర్వకారణం అన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించి ప్రభుత్వం ద్వారా సినిమా రంగానికి సేవలు అందిస్తున్న వి సముద్ర ను రావు సుబ్రహ్మణ్యం అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో సినిమా, నాటక రంగం అభివృద్ధికి కృషి చేయాలని వి సముద్ర కు పలు సూచనలు చేశారు.



# లింగంగుంట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** చిలకలూరిపేట మండలంలోని లింగంగుంట్ల గ్రామలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నందు చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ సరిత పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఏ. ఓ గారు మాట్లాడుతూ ప్రస్తుతం బెట్ట వాతావరణం కారణంగా ప్రత్తిలో రసంపీల్చు పురుగులు ఉధృతి ఉన్నందున మోనోక్రోటోఫాస్ మరియు నీరు 1:4 నిష్పత్తిలో కలిపి మందు మిశ్రమాన్ని మొక్క లేత కాండానికి బ్రష్ తో పూతగా పూస్తే రసం పీల్చే పురుగులైన పేనుబంక,పచ్చ దోమ ,తెల్ల దోమ, త్రిప్స్ మొదలగు వాటిని అదుపులో ఉంచుకోవచ్చునీ ,దీనివల్ల పురుగు మందు ఖర్చు తగ్గటమే కాక వాతావరణ కాలుష్యం కూడా ఉండదని తెలిపారు మరియు రైతులందరూ సెప్టెంబర్ 15 వ తేదీ లోగా తాము సాగుచేస్తున్న పంటలను సంబంధిత రైతు సేవా కేంద్రం వద్ద నమోదు చేయించుకోవాలని కోరారు,అలాగే మండలంలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది అందరూ కూడా క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సాగు చేస్తున్న పంటల యొక్క పరిస్థితిని తిశితిజీలీ యాప్ నందు నమోదు చేయవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతాప్ లింగంగుంట్ల గ్రామ రైతులు,రైతు సేవా కేంద్ర సిబ్బంది గోపి నాయక్ పాల్గొన్నారు.



# నేడు చిలకలూరిపేటలో జనసేన ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన

**చిలకలూరిపేట, సెప్టెంబర్1,ప్రభాతవార్త :** పట్టణంలోని ఆర్.వి.యస్.సి.వి.యస్ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటనున్న సినీనటుడు, ఎమ్మెల్సీ ,నాగబాబు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించాలనే సందేశంతో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం. నాగబాబు పర్యటనకు చిలకలూరిపేట విద్యా సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగత ఏర్పాట్లు చెసారు. పెద్ద సంఖ్యలో పాల్గొని నాగబాబుకు స్వాగతం పలకనున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంఘం ప్రతినిధులు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించనున్న ఎమ్మెల్సీ నాగబాబు. ఎమ్మెల్సీ పర్యటనను విజయవంతం చేసేందుకు జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యా సంఘం ప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లు.



# ఎస్ఆర్ఎమ్‌లో ఎపిక్ సినిమా హీరో హీరోయిన్ల సందడి

**మంగళగిరి, సెప్టెంబర్1, ప్రభాతవార్త :** ఈనెల 11వ తేదీన విడుదల కానున్న ఎపిక్ సినిమా హీరో హీరోయిన్లు ఆనంద్ దేవరకొండ , వైష్ణవి చైతన్య లు మంగళవారం



సాయంత్రం నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సందడి చేశారు. మూవీ ప్రమోషన్ లో భాగంగా ఇక్కడికి విచ్చేసిన హీరో హీరోయిన్లు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎపిక్ సినిమా వివరాలను వెల్లడించారు. మంచి ఇతివృత్తంతో తెరకెక్కించిన ఎపిక్ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి, విద్యార్థి విభాగం డైరెక్టర్ రేవతి బాలకృష్ణన్‌లు హీరో హీరోయిన్లకు స్వాగతం పలికి పుష్పగుచ్చాలను అందించారు.

# ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో ఘనంగా పవన్ కళ్యాణ్ ప్రీ బర్త్‌డే వేడుకలు

**మంగళగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ ఆర్ ఎమ్ జనసైనిక్స్ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం ప్రీబర్త్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీజే సంగీతం, బైక్ ర్యాలీ, పాటు



బాణసంచా కాల్చి పుట్టినరోజు వేడుకలను వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఎం ఎస్ ఐ డి సి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి విద్యార్థులతో కలిసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముందస్తుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ విద్యా ప్రమాణాలను అందుకోవడంతో పాటు పరిశోధనలకు ప్రాధాన్యతనిచ్చి రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జనసేన పార్టీ యువజన విభాగాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ నుంచి కూడా యువజన విభాగాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను సామాజిక సేవ, రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసి డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదన్ రావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, చిట్టెం అవినాష్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు, జనసైనిక్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు గ్రాండ్ అలూమ్నీ సమావేశం

**- హాజరుకానున్న మూడు తరాల పూర్వ విద్యార్థులు**

**- 11న గవర్నర్ రాక - వీసి గంగాధరరావు వెల్లడి**

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు1, ప్రభాతవార్త:** ఏఎన్‌యు 50ఏళ్ళ స్వర్ణోత్సవాల్లో భాగంగా నేడు నిర్వహిస్తున్న గ్రాండ్ అలూమ్నీ (పూర్వ విద్యార్థులు) సమావేశంకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వీసి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీసి మాట్లాడుతూ 1976-2026 వరకు చదివిన విద్యార్థులు నేడు వర్సిటీకి వచ్చి వారి జ్ఞాపకాలను నెమరువేసుకోవడం గొప్పఅనుభూతిని మిగల్చనుందన్నారు. ఈ సమావేశానికి వచ్చే పూర్వ విద్యార్థులు ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని, ఇంటర్న్‌షిప్‌లు, ఎంఓయులు ఇలా వర్సిటీకి అనేక రకాలుగా సేవలు అందించాలనే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. మొత్తం 3తరాల విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి అయ్యే ఖర్చులను దాతల నుంచి సేకరించినట్లు వెల్లడించారు. అలాగే ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 8న 5కె రన్ నిర్వహిస్తున్నామని, 11న నిర్వహించే స్వర్ణోత్సవాలకు గవర్నర్, వర్సిటీ చాన్సలర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించనున్నామని వీసి చెప్పారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దాతల ఆర్థిక సహకారంతో ఏఎన్‌యు పేరున ప్రత్యేకంగా రూ.15 లక్షలతో పోస్టల్ స్టాంప్ తీసుకురానున్నామని, సుమారు రూ.10లక్షలతో స్వర్ణోత్సవ లోగో



నిర్మిస్తున్నామని చెప్పారు. ఏఎన్‌యుపై ఆర్థికభారం లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ అలూమ్నీ డైరెక్టర్‌గా ఆచార్య వి.చంద్రశేఖరరావును నియమించినప్పటి నుంచి కేవలం 20 రోజుల్లోనే అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఆయన అలూమ్నికోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆచార్య చంద్రశేకరరావు మాట్లాడుతూ ఏ సంస్థకైనా అలూమ్ని ఎంతో కీలకంగా పనిచేస్తుందన్నారు. ఏఎన్‌యు గ్రామీణ వర్సిటీ నుంచి గ్లోబల్ యూనివర్సిటీ స్థాయికి ఎదిగిందన్నారు. దీనికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు ఎంతో ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇది ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ ఈ సమావేశాన్ని అట్టహాసంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంలో ఇసి మెంబర్ ఆచార్య త్రిమూర్తిరావు, మీడియా కమిటీ కన్వీనర్ ఆచార్య జి.చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఇన్స్పైర్ చేసి బాల శాస్త్రవేత్తలుగా మార్చండి

**-జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష**

**గుంటూరు విద్య సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** ఇన్స్పైర్ మనక్ వేదికను ఉపయోగించుకుని అన్వేషణాత్మక ఆలోచనలు కలిగిన విద్యార్థులను ఇన్స్పైర్ చేసి బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డా. సలీమ్ భాషా ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గుంటూరులోని స్థానిక పరీక్షాభవన్ నందు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన ఇన్స్పైర్ మనక్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థుల చిట్టి బుర్రలలో గట్టి ఆలోచనలు ఉంటాయని వాటికి పదును పెడితే బాల శాస్త్రవేత్తలు తయారవుతారని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల మధ్య ప్రాజెక్టుల పోటీలు నిర్వహించాలని అన్నారు. స్థానిక సమస్యలకు పరిష్కారాన్ని చూపే వినూత్నమైన ప్రాజెక్టులను మాత్రమే నామినేషన్లలో చోటు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గుంటూరు జిల్లాలోని




ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుండి మూడు నామినేషన్లు, ఉన్నత పాఠశాలలు మరియు హైస్కూల్ ప్లస్ పాఠశాలల నుండి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు వినూత్న ప్రాజెక్టులను మాత్రమే ఎంపిక చేసి విద్యార్థులకు పదివేల రూపాయల అవార్డును ప్రకటిస్తారన్నారు. ఇలాంటి అద్భుతమైన అవకాశాన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుంటూరు ఉప విద్యాశాఖాధికారి జి. ఏసురత్నం మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని అన్నారు. అత్యుత్తమ శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దడం సైన్స్ ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి అప్పారావు, శివ శంకరరావు, మల్లికార్జునరావు, గంగాధర్, వెంకటేశ్వరరావు మరియు భాస్కరరావు రిసోర్స్ పర్సన్ లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మరియు తెనాలి డివిజన్ల నుండి 200 మంది సైన్స్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలనకు ఈనెల 10వ తేదీ వరకు గడువు పొడిగింపు

**నగర కమిషనర్ కె.మయూర్ అశోక్**

**గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 1 ( ప్రభాత వార్త ) :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర కార్యక్రమం (సర్) లో భాగంగా ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయడానికి గడువును ఎన్నికల సంఘం ఈనెల 10వ తేదీ వరకు పొడిగించిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరుకు తన క్లెయిమ్ లేదా అభ్యంతరాన్ని సమర్పించేందుకు తగిన అవకాశం కల్పించడంతో పాటు, అందిన దరఖాస్తులను తగిన జాగ్రత్తతో మరియు ఖచ్చితత్వంతో పరిష్కరించేందుకు వీలుగా భారత ఎన్నికల సంఘం క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు దాఖలు చేసే గడువుని పొడిగించిందని తెలిపారు. ఓటర్లు తమ పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉందో లేదో భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ "https://electoralsearch. eci.gov.in" లో లేదా నిది। space Voter ID Card NO. టైప్ చేసి 1950కు శీలీశీ పంపడం ద్వారా కూడా తమ ఓటరు వివరాలను తెలుసుకోవచ్చని, ఓటర్ల జాబితాలో తమ పేరు కనిపించని అర్హత కలిగిన పౌరులు https:// voters.eci.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అదేవిధంగా నిది।ష్మి మొబైల్ అప్లికేషన్ ద్వారా లేదా సంబంధిత "ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, బూత్ లెవల్ అధికారి" లకు నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.



# చిలకలూరిపేటలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గ్రాండ్ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం అత్యంత వైభవంగా, రికార్డు స్థాయిలో దిగ్విజయంగా పూర్తయింది. నియోజకవర్గ జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత క్రమశిక్షణతో, భారీ ఎత్తున ఏర్పాటైంది. రక్తదాన శిబిరాన్ని నిర్వహించడమే కాకుండా, స్వయంగా చరణ్ తేజ రక్తదానం చేసి తోటి యువతకు ఆదర్శంగా నిలిచారు. చిలకలూరిపేట రాజకీయ, సేవా రంగాల్లో యువ నాయకత్వ పటిమను చాటుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

**ముఖ్య అతిథిగా న్యూఢిల్లీ బిసాటి భరత్ – స్వయంగా రక్తదానం**

ఈ మహత్తర కార్యక్రమానికి న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ బిసాటి భరత్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కేవలం అతిథిగా హాజరు కావడమే కాకుండా, ఆయన స్వయంగా రక్తదానం చేసి అక్కడ ఉన్న జనసైనికులలో, యువతలో నూతనోత్సాహాన్ని నింపారు. బిసాటి భరత్ రాక, ఆయన చూపిన సేవా దృక్పథం కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

**రికార్డు స్థాయి స్పందన – చిలకలూరిపేట చరిత్రలోనే సరికొత్త మైలురాయి**

ఈ మెగా రక్తదాన శిబిరంలో సుమారు 250 మందికి పైగా రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 మందికి ఆధార్ కార్డులు అందుబాటులో లేకపోవడంతో వారు రక్తదానం చేయలేక వెనుదిరిగినప్పటికీ, చిలకలూరిపేట చరిత్రలోనే ఇది అత్యధిక రక్త సేకరణ జరిగిన అతిపెద్ద బ్లడ్ క్యాంప్‌గా రికార్డు సృష్టించింది. ఉప్పొంగిన జనసైనికులు, వీర మహిళల ఉత్సాహంఈ శిబిరంలో జనసైనికులు, వీర మహిళలు, మెగా ఫ్యామిలీ అభిమానులు, పవన్ కళ్యాణ్ వీరాభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రాణదాతలుగా నిలిచేందుకు పోటీపడి రక్తదానం చేసి తమ అభిమాన నాయకుడిపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన మండలనేని చరణ్ తేకార్యక్రమం ఇంతటి ఘన విజయం సాధించిన సందర్భంగా మండలనేని చరణ్ తేజ మాట్లాడుతూ తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా "ఆదాభివందనం" తెలుపుతూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. డిల్లీ నుంచి విచ్చేసిన బిసాటి భరత్ సహకారానికి, రక్తదానం చేసిన దాతలకు, జనసేన సైనికులకు, వీర మహిళలకు ఆయన కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.



# అఫ్ఘానిస్థాన్ టి20.. టీమిండియా ఖరారు

## ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి బుమ్రా, నితీష్ ఎంపిక



**న్యూఢిల్లీ:** సెప్టెంబర్ 1 (ఐఏఎన్ఎస్) సెప్టెంబర్ 13 నుంచి న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం భారత జట్టును ప్రకటించింది. ఫాస్ట్ బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ లకు ఎంపికలు ఖరారయ్యాయని, అయితే ఈ నలుగురు ఆటగాళ్ల భాగస్వామ్యం ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ ధృవీకరించింది. శ్రేయస్ అయ్యర్ మెన్ ఇన్ బ్లూ జట్టుకు నాయకత్వం వహించనుండగా, తిలక్ వర్మ అతనికి డిప్యూటీగా కొనసాగుతాడు. ఈ జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి వంటి రెగ్యులర్ ఆటగాళ్లు ఉన్నారు. జూలైలో జింబాబ్వేలో ఆడిన జట్టులో కొన్ని మార్పులు జరిగాయి. జింబాబ్వే టీ20లకు ఎంపిక కాని సంజు సామ్సన్ జట్టులోకి తిరిగి రాగా, బౌలింగ్ విభాగంలో రెగ్యులర్ స్పీడ్‌స్టర్లు తిరిగి రావడంతో మార్పులు చోటుచేసుకున్నాయి. అర్ష్‌దీప్‌తో పాటు బుమ్రా, హర్షిత్ జట్టులో చేరగా, జింబాబ్వే పర్యటన జట్టులో ఉన్న ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్ వంటి వారికి జట్టులో చోటు దక్కలేదు. వార్తలకు విరుద్ధంగా, హార్దిక్ పాండ్యాకు జట్టులో స్థానం లభించలేదు. జూలైలో ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డేల సందర్భంగా గాయపడి, అప్పటి నుంచి ఆటకు దూరమైన బుమ్రా తిరిగి రావడమే అతిపెద్ద పరిణామం. గత టీ20లో కడరాల నొప్పితో ఇంగ్లండ్ వండేలకు దూరమైన హర్షిత రాణా కూడా జట్టులోకి తిరిగివచ్చాడు. భారత్ జట్టులో శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన (వికెట్‌కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్, అక్షర్‌పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోరి, హ్రతిత్ బిష్టోయి, రవి రానా, వైభవ్ సూర్యవంశి ఉన్నారు.

## దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ఈస్ట్ జోన్

# 4 వికెట్ల తేడాతో సెంట్రల్ జోన్ ఓటమి



**బెంగుళూరు:** సెంట్రల్ జోన్‌పై ఈస్ట్ జోన్ విజయం సాధించి దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో దూసుకెళ్లింది. బెంగుళూరులో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ జట్టు 159 పరుగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్ల తేడాతో ఛేదించి, డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్‌ను టోర్నమెంట్ నుండి నిష్క్రమించేలా చేసింది. మూడవ రోజు మంగళవారం ఆట ప్రారంభంలో సెంట్రల్ జట్టు 45/3తో కష్టాల్లో పడగా, ఈస్ట్ బౌలర్లు వికెట్లు తీస్తూనే ఉన్నారు. ముఖేష్ కుమార్ 4, షమీ 3 వికెట్లు దక్కించుకున్నారు. ఈ మ్యాచ్‌లో అభిజిత్ కె. సర్కార్ మొదట నైట్‌వాచ్‌మన్ ఆర్యన్ పాండేను అవుట్ చేయగా, ఆ తర్వాత షమీ, ముఖేష్‌లు యశ్ రాథోడ్, అమన్ మోఖడేలను పెవిలియన్‌కు పంపారు. ఈస్ట్ బౌలర్ల దూకుడుతో సెంట్రల్ జట్టు 97/8తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత హర్ష్ దుబే, అర్షద్ ఖాన్ పోరాటం మొదలుపెట్టి, తొమ్మిదో వికెట్‌కు 43 పరుగులు జోడించారు. తొలి ఇన్నింగ్స్‌లో చేసిన 266 పరుగులకు అదనంగా సెంట్రల్ జట్టు 158 పరుగులకే ఆలౌట్ అయింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఈస్ట్ బ్యాటింగ్‌కు వచ్చింది. సూర్యవంశీ 43 పరుగులు చేయగా, అదే 14వ ఓవర్‌లో పాటిదార్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో అతను అవుటయ్యాడు. హర్ష్ మరో రెండు బంతుల్లో 2 వికెట్లు తీశాడు. అతను కుమార్ కుశాగ్ర, అనుకుల్ రాయ్‌లను అవుట్ చేయడంతో, ఇంకా 34 పరుగులు అవసరమైన తరుణంలో ఈస్ట్ జట్టు 124/5 స్కోరుకు పడిపోయింది. కానీ కిషన్ సంయమనం కోల్పోకుండా, సుదీప్ కుమార్ ఘరామీ వికెట్ కోల్పోయినప్పటికీ, 4 వికెట్లు మిగిలి ఉండగానే విజయ తీరాన్ని చేరుకున్నారు.

## యుఎస్ ఓపెన్..

# బెరెట్టినీ చేతిలో వావ్రింకా ఓటమి

**న్యూఢిల్లీ:** బెరెట్టినీ చేతిలో ఓటమితో వావ్రింకా భావోద్వేగభరితమైన యూఎస్ ఓపెన్ నుండి నిష్క్రమించింది. తొలి రౌండ్‌లో మాటియో బెరెట్టినీ చేతిలో 7-6(4), 7-6(3), 6-0 తేడాతో ఓటమి పాలైన తర్వాత, మాజీ యూఎస్ ఓపెన్ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా చివరి గ్రాండ్ స్లామ్ మ్యాచ్ ఓటమితో ముగిసింది. స్విస్ ఛాంపియన్ మొదటి రెండు సెట్‌ల పాటు తనకంటే చిన్న వయసున్న ప్రత్యర్థిని ఒత్తిడికి గురిచేసినా, మూడవ సెట్‌లో వెనుకబడ్డాడు. సుదీర్ఘంగా సాగిన గేమ్‌లో వావ్రింకా ఒక సెట్ పాయింట్ సాధించాడు. కానీ బెరెట్టిని నాలుగు డ్యూస్‌లను తట్టుకుని టైబ్రేక్‌కు దారితీశాడు. 30 ఏళ్ల అతను మరోసారి తన సంయమనాన్ని కోల్పోకుండా, వరుసగా మూడు పాయింట్లు గెలిచి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్‌లో వావ్రింకాకు మరో అవకాశం లభించింది. తర్వాత బెర్రెటినీ సర్వ్‌ను అతను తొందరగా బ్రేక్ చేశాడు. కానీ స్విస్ ఆటగాడు తన ఆధిక్యాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతనికి మూడు సెట్ పాయింట్లతో సహా ఏడు బ్రేక్ పాయింట్లు లభించినప్పటికీ, బెరెట్టిని మరో టైబ్రేక్‌కు దారితీసి, దానిని గెలిచి విజయానికి ఒక సెట్ దూరంలోకి వచ్చాడు. మాజీ ప్రపంచ ఆరో ర్యాంకర్, సుదీర్ఘ పోరాటం తర్వాత మూడు బ్రేక్‌లలో మొదటిదాన్ని సాధించి, వావ్రింకా యొక్క అద్భుతమైన గ్రాండ్ స్లామ్ కెరీర్‌కు తెరదించేలా బేగెల్‌ను అందించాడు.




## చైనా మాస్టర్స్.. తొలి రౌండ్‌లో నిష్క్రమించిన

# ఉన్నతి, హరిహరన్-అర్జున్

**షెన్‌జెన్:** చైనా మాస్టర్స్ సూపర్ 750లో భారత షట్లర్లకు నిరాశాజనకమైన ఆరంభం లభించింది. మంగళవారం సింగిల్స్‌లో ఉన్నతి హూడ, అలాగే హరిహరన్ అమ్సకరుణన్-ఎంఆర్ అర్జున్‌ల పురుషుల డబుల్స్ జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఉన్నతి, తనకంటే ఉన్నత ర్యాంకు క్రీడాకారిణి అయిన దక్షిణ కొరియాకు చెందిన కిమ్ గాయూన్ చేతిలో 10-21, 18-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయింది. ప్రపంచ 25వ ర్యాంర్ ఉన్నతి, ప్రపంచ 12వ ర్యాంకు క్రీడాకారిణి అయిన కిమ్ ముందు ఒత్తిడితో బరిలోకి దిగింది. ఆమె తొలి గేమ్‌లో కేవలం 10 పాయింట్లు మాత్రమే సాధించి పేలవంగా ప్రారంభించింది. రెండవ గేమ్‌లో, ఆ 18 ఏళ్ల అమ్మాయి మరింత పోరాటపటిమను కనబరిచి, పోటీతత్వాన్ని ప్రదర్శిస్తూ స్కోర్లను 18-18తో సమం చేసింది. అయితే, ఆమె ఆ ఊపును కొనసాగించలేక చివరి మూడు పాయింట్లను కోల్పోయి, వరుస గేమ్‌లలో ఓడిపోయింది. మరోపక్క హరిహరన్-అర్జున్‌ల భారత్ పురుషుల డబుల్స్ జోడీ మొదటి గేమ్ మధ్యలోనే వైదొలగాల్సి వచ్చింది. చైనాకు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేతలు చెన్ బో యాంగ్-లియు ద్వయంతో జరిగిన మ్యాచ్‌లో, ఆట మధ్య విరామ సమయంలో 8-11తో వెనుకబడి ఉన్న ఈ ద్వయం, గాయం కారణంగా మ్యాచ్‌ను వదులుకున్నారు.

## ఇంగ్లాండ్ టెస్ట్ ఎఫెక్ట్

# పాక్ క్రికెట్‌లో ప్రకంపనలు

## ఏడుగురు ఆటగాళ్లు, కోచ్‌లపై వేటు


**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో వరుసగా తొలి రెండు మ్యాచ్‌లలో ఓడిపోయి సిరీస్ కోల్పోవడంతో పాకిస్థాన్ జట్టు యాజమాన్యం తీవ్ర చర్యలు చేపట్టింది. జట్టులో ఉన్న ఏడుగురు ఆటగాళ్లను తక్షణమే పర్యటన నుంచి తొలగించి స్వదేశానికి తిప్పి పంపింది. ఈ జాబితాలో మాజీ పరిమిత ఓవర్ల సారథి సల్మాన్ అఘా, వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్‌లతో పాటు ఆమిర్ జమాల్, ఖుర్రం షెహజాద్, అలీ ఉస్మాన్, మహమ్మద్ అవైస్ జఫార్ ఉన్నారు. ఇటీవల ఆడిన ఆరు టెస్టుల్లో ఐదింటిలో ఓడిపోవడం, ఆటగాళ్ల



ప్రదర్శన ఘోరంగా ఉండటంతో బోర్డు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కేవలం ఆటగాళ్లపైనే కాకుండా బౌలింగ్, హెడ్ కోచ్‌లపై కూడా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చర్యలు తీసుకుంది. ప్రస్తుత టెస్ట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను బాధ్యతల నుంచి తొలగించింది. వీరి స్థానంలో పరిమిత ఓవర్ల క్రికెట్ హెడ్ కోచ్‌గా ఉన్న న్యూజిలాండ్ మాజీ దిగ్గజం మైక్ హెస్సన్‌కు టెస్ట్ జట్టు బాధ్యతలను కూడా అప్పగించింది. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్ పూర్తయ్యే వరకు మైక్ హెస్సన్ పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు మార్గదర్శకం వహిస్తారు.

ఇక మూడో టెస్టు మ్యాచ్ ఈ నెల 9 నుంచి బర్మింగ్‌హామ్ వేదికగా ప్రారంభం కానుంది. దీనికోసం సామ్ ఆయుబ్, అబ్దుల్లా ఫజాల్‌లను జట్టులోకి తీసుకున్నారు. వారితో పాటు అరా ఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, మహమ్మద్ ఇమ్రాన్‌లను నూతనంగా జట్టులోకి ఎంపిక చేశారు. వీరికి వీసాలు లభించిన వెంటనే ఇంగ్లాండ్‌లోని జట్టుతో కలవనున్నారు.

# బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్ల పతనం



## వరుసగా రెండో రోజు నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, సెప్టెంబరు 1:** అమెరికా- ఇరాన్ మధ్య మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో, బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా మంగళవారం కీలక సూచీలు వరుసగా రెండో రోజు నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 12.99 పాయింట్లు (0.02 శాతం) తగ్గి 76,944.28 వద్ద ముగియగా, విస్తృత సూచీ అయిన నిఫ్టీ 24.60 పాయింట్లు (0.1 శాతం) క్షీ ణించి 24,055.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సాంకేతిక స్థితిగతులపై స్పందిస్తూ, నిపుణులు 24,150-24,200 స్థాయిలు తక్షణ 'రెసిస్టెన్స్ జోన్'గా పనిచేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. "సూచీ స్థిరపడటానికి, 24,300-24,400 స్థాయిల వైపు కోలుకోవడానికి 24,200 పైన నిలకడగా కదలడం అవసరం. సూచీ ఈ స్థాయిలను తిరిగి బలంగా అధిగమించే వరకు, అధిక స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉంది" అని ఒక మార్కెట్ నిపుణుడు తెలిపారు.

"అదే సమయంలో, 24,000 అనే కీలకమైన మానసిక స్థాయికి దిగువన నిలకడగా ట్రేడింగ్ జరిగితే, సూచీ 23,900-23,800 స్థాయిల వైపు పడిపోయే ప్రమాదం ఉంది" అని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు. నిఫ్టీలోని షేర్లలో శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకి ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచి, సూచీలపై ఒత్తిడిని పెంచాయి. విస్తృత మార్కెట్ కూడా ఒత్తిడిలోనే కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.39 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.23 శాతం మేర క్షీ ణించాయి.

వివిధ రంగాల సూచీలు మిశ్రమ ఫలితాలను నమోదు చేశాయి. నిఫ్టీ హెల్త్‌కేర్, నిఫ్టీ ఆటో, నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ ఫార్మా రంగాలు విస్తృత మార్కెట్ కంటే బలహీనమైన పనితీరును కనబరిచాయి. మరోవైపు, నిఫ్టీ ఎఫ్ఎంసిజి, నిఫ్టీ ఐటీ రంగాలు మెరుగైన పనితీరును కనబరిచి, భౌగోళిక రాజకీయ అనిశ్చితి మధ్య మొత్తం మార్కెట్‌కు కొంత మద్దతు నిచ్చాయి. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక స్థిరత్వం, మార్కెట్ సెంటిమెంట్‌పై ఆందోళనలను పెంచడం, అలాగే అస్థిరత అధికంగా ఉండటంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారని మార్కెట్ నిపుణులు తెలిపారు.

# ఆగస్టు జిఎస్‌టి వసూళ్లు రూ.1.99 లక్షల కోట్లు




**ముంబై, సెప్టెంబరు 1:** 2026 ఆగస్టు జిఎస్‌టి వసూళ్లు రూ.1.99 లక్షల కోట్లకు చేరాయి. మంగళవారం ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాత్కాలిక గణాంకాల ప్రకారం, దిగుమతి చేసుకున్న వస్తువులపై పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడం వల్ల, ఆగస్టు నెలలో భారతదేశం స్థూల జిఎస్‌టి వసూళ్లు యేడాది ప్రాతిపదికన 14.8 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే ఆగస్టులో జిఎస్‌టి వసూళ్లు పెరిగినప్పటికీ, జులై నెలతో పోలిస్తే మాత్రం స్వల్ప తగ్గుదల కనిపించింది. జూలైలో స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆగస్టులో నమోదైన మొత్తం వసూళ్లలో, దేశీయ ఆదాయం వాటా రూ. 1.37 లక్షల కోట్లుగా ఉంది (గత ఏడాది ఆగస్టులో ఇది రూ.1.25 లక్షల కోట్లుగా ఉండేది, అంటే 9.3శాతం వృద్ధి నమోదైంది). మరోవైపు, దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయం 29శాతంపెరిగి ఆగస్టులో రూ.62,604 కోట్లకు చేరింది. మొత్తం స్థూల జిఎస్‌టి ఆదాయంలో, కేంద్ర జిఎస్‌టి (సిజిఎస్‌టి) వాటా రూ.38,413 కోట్లు, రాష్ట్ర జిఎస్‌టి (ఎస్‌జిఎస్‌టి) వాటా రూ.46,316 కోట్లు, సమీకృత జిఎస్‌టి (ఐజిఎస్‌టి) వాటా రూ.1.15 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఆగస్టులో మొత్తం జిఎస్‌టి రీఫండ్లు (వాపసులు) 67.9శాతం పెరిగి రూ.31,795 కోట్లకు చేరాయి. గత యేడాది ఆగస్టులో ఇవి రూ.18,935 కోట్లుగా ఉండేవి. ఇందులో దేశీయ రీఫండ్లు రూ.18,490 కోట్లు, ఎగుమతి రీఫండ్లు రూ.13,305 కోట్లుగా ఉన్నాయి. ఈ రీఫండ్లను (వాపసులను) పరిగణనలోకి తీసుకున్న తర్వాత, ఆగస్టు 2026లో మొత్తం నికర జిఎస్‌టి ఆదాయం 8.3శాతం పెరిగి రూ.1.68 లక్షల కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలోని ఇదే నెలలో ఇది రూ.1.55 లక్షల కోట్లుగా ఉండేది. నికర దేశీయ జిఎస్‌టి ఆదాయం 3.4శాతం పెరిగి రూ. 1.18 లక్షల కోట్లకు చేరగా, నికర కస్టమ్స్ ఆదాయం 22.3శాతం పెరిగి రూ.49,299 కోట్లకు చేరింది. "స్థూల జిఎస్‌టి ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14.8శాతం పెరగగా, దేశీయ వసూళ్లు 9.3శాతం వృద్ధి చెందాయి. అదే సమయంలో దిగుమతి సంబంధిత జిఎస్‌టి వసూళ్లు 29శాతం మేర భారీగా పెరిగాయి.

ఆదాయ వృద్ధిలో వాణిజ్య సంబంధిత కార్యకలాపాల వాటా అసమానంగా అధికంగా ఉంటోందని ఇది సూచిస్తోంది" అని గ్రాంట్ థోర్టన్ భారత్‌కు చెందిన భాగస్వామి, పన్ను వివాదాల నిర్వహణ విభాగం అధిపతి మనోజ్ మిశ్రా పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే, మహారాష్ట్రలో దేశీయ వసూళ్లు 8శాతం పెరిగి రూ.28,779 కోట్లకు చేరాయి.


కర్ణాటకలో వసూళ్లు 13శాతం పెరిగి రూ.14,148 కోట్లుగా నమోదయ్యాయి, గుజరాత్‌లో 15శాతం పెరిగి రూ.12,047 కోట్లకు, అలాగే ఉత్తరప్రదేశ్‌లో 19శాతం పెరిగి రూ.9,092 కోట్లకు చేరాయి. మరోవైపు, కొన్ని రాష్ట్రాల్లో వసూళ్లలో స్వల్ప తగ్గుదల కనిపించింది. తమిళనాడులో వసూళ్లు 1శాతం తగ్గి రూ.10,189 కోట్లకు, రాజస్థాన్‌లో 2శాతం తగ్గి రూ.4,148 కోట్లకు, ఒడిశాలో 7శాతం తగ్గి రూ. 3,895 కోట్లకు పరిమితమయ్యాయి.

# చక్కెర నిల్వలపై కేంద్రం కొరడా

## 2 వేల క్వింటాళ్ల వరకే నిల్వకు పరిమితి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** దేశీయ మార్కెట్‌లో చక్కెర లభ్యతను సమృద్ధిగా ఉంచడానికి, పండుగ సీజన్‌లో ఈ నిత్యావసర వస్తువును నిల్వ ఉంచి కృత్రిమ కొరతను నిరోధించడానికి ప్రభుత్వం మంగళవారం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, చక్కెర డీలర్ల నిల్వ పరిమితిని 4వేల క్వింటాళ్ల నుండి 2వేల క్వింటాళ్లకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిబంధన సెప్టెంబరు 15 నుండి నవంబరు 30వరకు అమల్లోఉంటుంది. ప్రస్తుతం, దేశవ్యాప్తంగా చక్కెర డీలర్లపై 4వేల క్వింటాళ్ల నిల్వ పరిమితి అమల్లోఉంది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ప్రకారం, నిల్వపరిమితిని 2వేల క్వింటాళ్లకు తగ్గించడం ద్వారా ప్రభుత్వం అదనపు చర్యలు చేపట్టింది. ఈ కొత్త గడువు కాలంలో, చక్కెర డీలర్ తాము పొందిన చక్కెర నిల్వలను 30 రోజుల కంటే ఎక్కువ కాలంపాటు తమ వద్ద ఉంచుకోకూడదు.

అలాగే, దేశంలో ఎక్కడైనా సరే, ఏ సమయంలోనైనా 2వేల క్వింటాళ్లకు మించి చక్కెర నిల్వలను కలిగి ఉండకూడదు. అయితే, మెట్రోపాలిటన్ ప్రాంతాలతోపాటు, ఆయా ప్రాంతాల మార్కెట్ అవసరాలను దృష్టిలోఉంచుకుని మాత్రం నిల్వ పరిమితి 4వేల క్వింటాళ్లుగానే కొనసాగుతుందని అధికారిక ప్రకటనపేర్కొంది. "ఈచర్య నిల్వలను అక్రమంగా దాచి ఉంచడాన్ని అరికట్టడం, చక్కెరనిల్వలు అధికంగాపేరుకుపోకుండా చూడటం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది చక్కెర సజావుగా రవాణా అయ్యేలా చేస్తుంది" అని ఆ ప్రకటన తెలిపింది.




# ఆర్‌బిఐ కొత్త ఇడిగా సుమన్ రే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు1:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మంగళవారం సుమన్ రేను తక్షణమే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి)గా నియమించింది. ఇడిగా పదోన్నతి పొందక ముందు, రే మహారాష్ట్ర ప్రాంతీయ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, రే డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ విభాగం, ప్రాంగణాల విభాగాన్ని పర్యవేక్షి స్తారు. సెంట్రల్ బ్యాంక్ ప్రకటన ప్రకారం, రేకు రిజర్వ్ బ్యాంక్‌లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఆయన కరెన్సీ నిర్వహణ, ఆర్థిక సమ్మిళితం, చెల్లింపు, పరిష్కార వ్యవస్థ, వినియోగదారుల విద్య, రక్షణ, మానవ వనరులతో సహా పలు రంగాలలో పనిచేశారు. రే వెస్ట్రన్ ఏరియా లోకల్ బోర్డుకు కార్యదర్శిగా కూడా పనిచేశారు.

# రాష్ట్రాల సహకారంతోనే ఆర్థిక వృద్ధి

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**యాష్‌విల్లే, సెప్టెంబరు 1:** ప్రపంచ స్థాయి సవాళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారం, వ్యాపార నిర్వహణలో నిబంధనల భారం తగ్గించడం, వ్యాపార సంస్థలతో నిరంతర సంప్రదింపులు భారత్ బలమైన ఆర్థిక వృద్ధిని కొనసాగించడంలో సహాయపడ్డాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన జి20 ఆర్థిక మంత్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను మెరుగుపరిచే కేంద్రం ప్రయత్నాలలో రాష్ట్రాలు భాగస్వాములు అయ్యాయని ప్రశంసించారు. చట్టాలలో సంస్కరణలు తీసుకురావడం, నిబంధనలను సరళీకరించడం, కాలం చెల్లిన నిబంధనలను తొలగించడం ద్వారా పౌరులు, వ్యాపార సంస్థలపై భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేసిందని ఆర్థిక మంత్రి తెలిపారు. "వెయ్యికి పైగా చట్టాలను తొలగించాము, 40వేల నిబంధనలను సరళీకరించాము" అని ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. కంపెనీలు, వాణిజ్య సంస్థలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం కూడా ప్రభుత్వ విధానంలో భాగమని ఆమె పేర్కొన్నారు. ఆర్థిక కార్యకలాపాలు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలలో భాగంగా, భారత్ ద్వైపాక్షి క వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేస్తూనే, పెట్టుబడిదారుల రక్షణ ఒప్పందాల దిశగా కూడా అడుగులు వేస్తోందని సీతారామన్ తెలిపారు. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ, ఆర్థిక పునాదులపై ఉన్న విశ్వాసానికి విదేశీ కరెన్సీ డిపాజిట్లు, ప్రవాస భారతీయుల పెట్టుబడులు నిదర్శనమని ఆర్థిక మంత్రి చెప్పారు. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని తాము కోరుకుంటున్నామన్నారు. "ప్రపంచవ్యాప్త సవాళ్లు ఉన్నప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం, ప్రజల కఠోర శ్రమ ఫలితాలను ఇస్తోందనడానికి సంకేతం కావడం సంతోషకరం" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాల్లోనూ భారతదేశం ఇదే విధమైన వృద్ధి రేటును కొనసాగించగలదని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14